

'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 288

సోమవారం 8-1-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



రోహిత్, కోహ్లి వచ్చేశారు

అఫ్గానిస్తాన్‌తో టి20 సిరీస్‌కు భారత జట్టులోకి ఎంపిక. -12లో



మీ ఇంటికి బీమా ఉందా?

ప్రమాదాలు, విపత్తులతో నష్టం. పొదుపుతో కొన్న ఇంటికి పూర్తి రక్షణ -13లో



కార్గిల్‌లో నైట్ ల్యాండింగ్

కార్గిల్ అడ్వాన్స్‌డ్ ల్యాండ్ గ్రౌండ్‌పై సి-130జే సూపర్ హెర్క్యులస్ రవాణా విమానాన్ని వాయుసేన సురక్షితంగా ల్యాండింగ్ చేసింది.

వివరాలు 6లో ▸



మళ్లీ హసీనాయే...

బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో పాలక అవామీ లీగ్ నెగ్గింది. ప్రధానిగా షేక్ హసీనా వరుసగా 4వసారి పగ్గాలు చేపట్టనున్నారు.

వివరాలు 6లో ▸



ప్లాస్టిక్ ఆహారం

మనం తినే ఆహారంలో హాని చేసే ప్రమాదకరమైన రసాయనాలు ఉంటున్నట్లు ఓ అధ్యయనంలో తేలడం ఆందోళన రేపుతోంది.

వివరాలు 6లో ▸



స్టోర్ రూంలో నిద్రించాను

డేటా బేసిక్స్ కార్పొరేషన్ అధిపతి డాన్ లైల్స్ తనను సంస్థ స్టోర్ రూంలో పడుకొమ్మన్నాడని నారాయణ మూర్తి చెప్పారు.

వివరాలు 6లో ▸

40 రోజులే గడువు!

కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు పూర్తి

ఫిబ్రవరి రెండో వారం నుంచి ఎప్పుడైనా షెడ్యూల్ వెలువడే అవకాశం

ఆరు గ్యారంటీల్లో ఇప్పటివరకు అమలు చేసింది రెండే.. మిగతా గ్యారంటీల అమలుకు ఆటంకంగా కోడ్!

షెడ్యూల్ గురించి ముందే తెలుసు కనుక కోడ్ పేరిట గ్యారంటీల అమలు దాటవేతను జనం హర్షించరనే అభిప్రాయం

మిగిలిన 40 రోజుల్లోగా అమలుపై కాంగ్రెస్, అధికార వర్గాల్లోనే సందేహాలు

రేషన్ కార్డులిచ్చి పథకాలు అమలు చేయాలంటే సమయం సరిపోదనే చర్చ

సంక్రాంతికి కొన్ని పథకాలు అమలు చేస్తారనే ఆశాభావంలో రాష్ట్ర ప్రజలు

పింఛన్లు, రైతుబంధు అమలుకు సంబంధించిన డేటా అందుబాటులో ఉన్నా తాత్సారం ఎందుకు అనే అనుమానాలు

కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలుకు లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ కారణంగా నెల రోజులు ముందుకు వచ్చిన గడువు



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. పార్టీ అధికారంలోకి వచ్చి అప్పుడే నెల రోజులు పూర్తి అయిపోయాయి. నెల రోజుల పాలన పూర్తయినందుకు కాంగ్రెస్ నేతలు ఒకవైపు హర్షం వ్యక్తం చేస్తున్నా.. ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజలకు చెప్పిన గడువు దగ్గరపడుతోందనే ఆందోళన కూడా వారిలో కనిపిస్తోంది. ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రజలకిచ్చిన 14 హామీల్లో ఇప్పటివరకు కేవలం రెండు మాత్రమే అమలు కాగా మిగిలిన నాలుగు గ్యారంటీల్లోని 12 హామీల అమలు పెండింగ్‌లో ఉండటంతో.. మిగిలిన 70 రోజుల్లో ఇవి అమల్లోకి వస్తాయా అన్న సందేహాలు వారిలో వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో ఫిబ్రవరి రెండో వారం నుంచి ఎప్పుడైనా పార్లమెంటు ఎన్నికల కోడ్ (షెడ్యూల్) అమల్లోకి వచ్చే అవకాశాలున్నాయని, అదే జరిగితే ప్రభుత్వానికి నికరంగా మిగిలిన గడువు 40 రోజులే అన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది.

కోడ్ వస్తే కష్టమే!

ఎన్నికల కోడ్ వచ్చిందంటే గ్యారంటీల అమలు సాధ్యం కాదని, షెడ్యూల్ వెలువడే అవకాశం ఉందని ముందే తెలుసు కనుక, ఆ పేరిట గ్యారంటీల అమలును వాయిదా వేస్తే ప్రజలు హర్షించరనే భయం పార్టీ నేతలను వెంటాడుతోంది. ఇంకోవైపు ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలు ఆరు గ్యారంటీలు ఎలా అమలు చేస్తారోనని ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి. మరోవైపు అమలు చేయాల్సిన హామీల్లో మరికొన్నిటిని సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వం ప్రకటిస్తుందనే ఆశాభావంలో ప్రజలు ఉన్నారు. అదే సమయంలో పింఛన్లు, రైతుబంధుకు సంబంధించిన డేటా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉందని, ఈ సమాచారం ఆధారంగా వెంటనే చేయూత పింఛన్లు రూ.4 వేలకు (దివ్యాంగులకు రూ.6 వేలు) పెంచి ఇచ్చేందుకు, పెంచిన రైతుభరోసా మొత్తాన్ని జమ చేసేందుకు అవకాశం ఉన్నా ప్రజా పాలన పేరిట అన్ని పథకాలను ఒకేగాటన కట్టి తాత్సారం ఎందుకనే అనుమానాలు వారిలో వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఎన్నికలు

మిగతా 2వ పేజీలో ▶

ప్రజాపాలనపై నేడు సమీక్ష

సీఎం అధ్యక్షతన జరగనున్న సమావేశం

అందుబాటులో ఉన్న మంత్రుల హాజరుకు విజ్ఞప్తి.. అభయహస్తం, అర్హుల ఎంపిక, కాళేశ్వరం తదితర అంశాలపై చర్చించే చాన్స్



సాక్షి, హైదరాబాద్: ప్రజాపాలన సాగిన తీరు, వచ్చిన దరఖాస్తుల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం ఉదయం 11 గంటలకు సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. అయితే ఇది అధికారిక మంత్రివర్గ భేటీ కాదని, అందుబాటులో ఉన్న మంత్రులు దీనికి హాజరు కావాలని కోరినట్లు సమాచారం. కాగా ప్రజా పాలనలో ఎక్కువగా దరఖాస్తులు దేని కోసం వచ్చాయి? వాటి అమలుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి.? అర్హులను లబ్ధిదారులుగా ఎంపిక చేయడానికి అనుసరించాల్సిన మార్గదర్శకాలపై చర్చిస్తారని తెలిసింది. ప్రభుత్వం ఊహించిన దానికంటే అధిక సంఖ్యలో ప్రజలు ప్రజాపాలనలో పాల్గొని దరఖాస్తులు సమర్పించిన నేపథ్యంలో వాటి కంప్యూటరీకరణ, దరఖాస్తుల పరిష్కారానికి అవసరమైన నిధులు, వాటి సమీకరణ తదితర అంశాలను చర్చించనున్నట్లు అధికారవర్గాల సమాచారం. చేయూత పథకం కింద పింఛన్ను రూ.4,000కు పెంచడం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రైతు భరోసా కార్యక్రమాలపై సమీక్షించనున్నారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టులో

మిగతా 2వ పేజీలో ▶

ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా...

నెల రోజుల పాలనపై సీఎం రేవంత్‌రెడ్డి 2 లో

లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ కో-ఆర్డినేటర్లు వీరే

జాబితా విడుదల చేసిన కేసీ వేణుగోపాల్ 2 లో

న్యూస్‌రీల్

సోనియా గాంధీపై ఎవరూ పోటీకి దిగొద్దు



ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన సోనియాని తెలంగాణ నుంచి లోక్‌సభకు పోటీ చేయాలని కోరామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. తెలంగాణపై ప్రేమ ఉన్న ఏ పార్టీ కూడా సోనియాపై పోటీకి దిగవద్దని సూచించారు.

- వివరాలు 2లో▶

రైతులకు మరింత 'సహకారం'



ఎరువుల నుంచి విత్తనాలు, పురుగుల మందులు ఇలా అన్నీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోనే అందుబాటులోకి రానున్నాయి. రైతులకు అవసరయ్యే సేవలు విస్తరించేందుకు 'వన్‌స్టాప్ షాప్' విధానం తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది.

- వివరాలు 5లో▶

సైబర్ కేసుల్లో తెలంగాణ @ 3



సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దేశంలో సైబర్ నేరాలపై నమోదవుతున్న కేసుల్లో తెలంగాణ రాష్ట్రం 3వ స్థానంలో ఉండగా, మొదటి రెండు స్థానాల్లో ఢిల్లీ, హరియాణా ఉన్నాయి. 2023లో రాష్ట్రంలో సైబర్ నేరాలను పరిశీలిస్తే ప్రతి లక్ష మందికి 261 ఫిర్యాదులు నమోదయ్యాయి.

- వివరాలు 3లో▶



నరేంద్ర మోదీ మహ్మద్ ముయిజ్జు

మోదీపై మాల్దీవుల మంత్రుల నోటి దురుసు..

సర్వత్రా దుమారం

మంత్రులను సస్పెండ్ చేసిన మాల్దీవులు

ప్రధాని మోదీపై మాల్దీవుల మంత్రుల అనుచిత వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. మంత్రుల వ్యాఖ్యలకు నిరసనగా వేలాది మంది భారత పర్యాటకులు మాల్దీవులకు ప్లాన్ చేసుకున్న హాలిడే ట్రిప్పులను రద్దు చేసుకుంటున్నారు. భారత ప్రభుత్వ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ముగ్గురు మంత్రులను సస్పెండ్ చేసినట్లు ఆదివారం ప్రకటించింది. వారి వ్యాఖ్యలు వ్యక్తిగతమని, వాటితో ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టతనిచ్చింది.

-6లో

కొన్నిచోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చితే బాగుండేది



పార్లమెంటు ఎన్నికల్లో పొరపాట్లు జరగనివ్వం

- కేసీఆర్ పట్ల ప్రజల్లో అభిమానం చెక్కుచెదరలేదు
- జహీరాబాద్ లోక్‌సభ సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కొన్నిచోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చి ఇతరులకు అవకాశం ఇచ్చి ఉంటే బాగుండేదనే అభిప్రాయం బలంగాఉందని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తరహా పొరపాట్లు పార్లమెంటు ఎన్నికల్లో జరగనివ్వమని స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశాల్లో భాగంగా ఆదివారం తెలంగాణభవన్‌లో జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలతో జరిగిన భేటీలో కేటీఆర్ ప్రసంగించారు. కేసీఆర్ పట్ల ఉన్న సానుభూతి, కాంగ్రెస్‌కు దూరమైన వర్గాలు పార్లమెంటులో బీఆర్ఎస్ విజయానికి బాటలు వేస్తాయన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రెండు జాతీయపార్టీలతో జరిగే త్రిముఖ పోటీ బీఆర్ఎస్‌కే అనుకూలిస్తుందన్నారు.

కాంగ్రెస్‌కు ఓట్లేసిన వారిలో పునరాలోచన: అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అప్రతిష్ట మూటకట్టుకుందని, ప్రజల నుంచి

మిగతా 2వ పేజీలో ▶



పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో కిషన్‌రెడ్డి తదితరులు

ఈ నెలలోనే మోదీ సభలు

లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి బీజేపీ సన్నద్ధమవుతోంది. ఈ నెలలోనే ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రంలో రెండు బహిరంగ సభల్లో పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఉత్తర తెలంగాణలో ఒకటి, దక్షిణ తెలంగాణలో మరో సభకు ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

- 2లో▶

ఇదండీ సంగతి




ఎప్పుడు విమర్శించాలో చెబుతాం.. కాస్త ఓపిక పట్టండీ!!

పోచంపల్లి ఇక్కత్ పట్టు చీరలు



పోచంపల్లి చీరను పోలిన ప్రింటెడ్ చీర



'ఇక్కత్'కు ఇక్కట్లు!

పోచంపల్లి డిజైన్లకు ముప్పుగా ప్రింటెడ్ చీరలు

డిజైన్లు కాపీ కొట్టి ప్రింటెడ్ చీరల తయారీ

సూరత్‌లో తయారీ..అతి తక్కువ ధరకే లభ్యం

తగ్గుతున్న ఇక్కత్ పట్టుచీరల అమ్మకాలు

ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాల్లోని 50 వేల చేనేత వృత్తిదారుల జీవనోపాధిపై ప్రభావం

సాక్షి, యాదాద్రి

పోచంపల్లి ఇక్కత్ పట్టు చీర ప్రమాదంలో పడింది. పేటెంట్ హక్కు కలిగిన ఇక్కత్ పట్టు చీరల డిజైన్లు కాపీకి గురవుతున్నాయి. భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్ ట్యాగ్) కలిగిన ఇక్కత్ డిజైన్లను కొందరు బడా వ్యాపారులు కాపీ కొట్టి ప్రింటెడ్ పాలిస్టర్ చీరలను తయారు చేసి విక్రయిస్తున్నారు. నేతన్న నేసే పట్టుచీర డిజైన్‌ను బట్టి గరిష్టంగా రూ.20 వేలు పలుకుతుండగా ప్రింటెడ్ పట్టు చీరల పేరుతో వస్తున్న చీరలు కేవలం రూ.600కే లభ్యమవుతున్నాయి. దీంతో వినియోగదారులు ప్రింటెడ్ చీరల వైపే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా పట్టు చీరల బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినడంతో పాటు చేనేత వృత్తిదారులు దెబ్బతింటున్నారు. ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో సుమారు 50 వేల చేనేత వృత్తి దారుల జీవనోపాధిపై ప్రింటెడ్ చీరలు తీవ్ర ప్రతికూల ప్రభావం చూపిస్తున్నాయి. చేనేత డిజైన్లు కాపీకి గురికాకుండా ప్రభుత్వం

మిగతా 10వ పేజీలో ▶

'ఇందిరమ్మ'లోకి డబుల్ బెడ్రూం ఇళ్లు!

- గత ప్రభుత్వం ప్రారంభించిన ఇళ్లు దాదాపు 2.28 లక్షలు
- వాటిల్లో పూర్తయినవి 1.53 లక్షలు
- అందులో లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లు లక్షా 6వేలు
- సిద్ధంగా ఉన్నవి 47 వేలు, మిగతా అసంపూర్తి నిర్మాణాలు 76వేలు
- వాటిని పూర్తి చేసి ఇందిరమ్మ లబ్ధిదారులకు కేటాయింపు
- మొత్తంగా లబ్ధిదారులకు ఇంకా కేటాయించాల్సిన ఇళ్లు 1.23లక్షలు
- తాజాగా అందిన దరఖాస్తుల నుంచే లబ్ధిదారుల ఎంపిక

10 లో



క్లుప్తంగా...



అజ్మీర్ షరీఫ్‌కు కేసీఆర్ తరఫున చాదర్

సాక్షి, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజస్తాన్‌లోని ఖాజా గరీబ్ నవాజ్ రహమతుల్లా అజ్మీర్ షరీఫ్ ఉర్సు ఉత్సవాలకు హైదరాబాద్ నుంచి చాదర్ పంపించారు. మాజీ హోంమంత్రి మహమూద్ అలీ ఆదివారం కేసీఆర్ నివాసానికి వచ్చి ప్రత్యేక ప్రార్థనలు జరిపి కేసీఆర్ తరఫున చాదర్‌ను అక్కడికి తీసుకెళ్లారు.

గాంధీభవన్‌లో సంబరాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నెల రోజులు పూర్తికావడంతో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో ఆదివారం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, పార్టీ నేతలు బండి సుధాకర్, చరణ్‌కౌశిక్ యాదవ్, దయాకర్ పాల్గొన్నారు.

ప్రజాపాలన ఎలా ఉండాలో నెల రోజుల్లో చూపించాం

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: నెల రోజుల పాలనలో ప్రజలకు మరింత దగ్గరయ్యామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన ఎలా ఉండాలో నెల రోజుల్లో చేసి చూపించామని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వం నుంచి ఎలాంటి పాలన ఆశిస్తున్నారో అది వారికి అందుతుందని ఆయన హామీ ఇచ్చారు. పౌరసరఫరాల శాఖలో రూ. 58 వేల కోట్ల అప్పులు పేరుకుపోయాయని, పేదలకు ఇస్తున్న బియ్యానికి కిలో 38 రూపాయలు ఖర్చు చేస్తున్నా ప్రజలకు ఉపయోగం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఒక నియంత పాలన అంతమైందన్న ఆనందంలో ఉన్నారని ఉత్తమ్ వ్యాఖ్యానించారు.

అక్కసుతోనే కేటీఆర్ బృందం విమర్శలు: దయాకర్



సాక్షి, హైదరాబాద్: ప్రజల అండతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ బృందంలో అసహనం వ్యక్తమవుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత అద్దంకి దయాకర్ విమర్శించారు. నెల రోజులు పూర్తి చేసుకున్న పాలనపై బీఆర్‌ఎస్ నేతల విమర్శలు చూస్తుంటే నవ్వొస్తోందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధారాల్లేని ఆరోపణలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ సోషల్ మీడియాలో కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని వెల్లడించారు.

మంచి పాలనకు రేవంత్ పునాదులు: మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి పాలనను ప్రజలు మెచ్చుకుంటున్నారని, నిజాయితీతో కూడిన మంచి పాలనకు పునాదులు వేశారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి ప్రశంసించారు. ఆయన ఆదివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా పేద ప్రజలకు చేరాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో పేదలకు చార్జీల భారం తప్పించారని, ప్రజావాణితో సామాన్యుల సమస్యలు పరిష్కరిస్తున్నారని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై న్యాయ విచారణకు చర్యలు ప్రారంభించారని పేర్కొన్నారు. డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం మోపారని మల్లు రవి వెల్లడించారు.

నాకు అన్నే లేదు.. అన్న బిడ్డ ఎవరు?

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్



కరీంనగర్: 'నాకు అసలు అన్నే లేదు.. అన్న బిడ్డ ఎవరో నాకు తెలియదు.. బోయినపల్లి సరితారావుకు జెన్‌కోలో ఉద్యోగం ఇప్పించానని సోషల్ మీడియాలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు చేస్తున్న విమర్శలు అర్థరహితం' అని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎండీ ప్రభాకర్‌రావుతో మాట్లాడి, జెన్‌కోలో సరితారావుకు ఉద్యోగం ఇప్పించానని, నెలకు రూ.1.50 లక్షల జీతమని, ఆమె తన అన్నయ్య కూతురు అని కాంగ్రెస్, బీజేపీలతోపాటు తీన్మార్ మల్లన్న లాంటివారు పత్రికల్లో ప్రచారం చేయడం విచారకరమని పేర్కొన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేక ఇలాంటి కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. బోయినపల్లి ఇంటి పేరుతో ఎంతో మంది ఉంటారని, తనకు అపవాదు అంటగట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

కేసీఆర్‌కు నరసింహన్ పరామర్శ

సాక్షి, హైదరాబాద్: తుంటిఎముక మార్పిడి చికిత్స తరువాత హైదరాబాద్ నందినగర్‌లోని తన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును మాజీ గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ దంపతులు ఆదివారం మధ్యాహ్నం పరామర్శించారు. ఈ సందర్భంగా నరసింహన్ దంపతులు కేసీఆర్ ఆరోగ్యపరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ఆవిర్భావం తరువాత జరిగిన అభివృద్ధి, అప్పటి గవర్నర్‌గా నరసింహన్ అందించిన సంపూర్ణ సహకారం చర్చకు వచ్చిన సందర్భంలో కేసీఆర్ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నరసింహన్ దంపతులకు పట్టువస్త్రాలు సమర్పించి సంప్రదాయపద్ధతిలో అతిథి మర్యాదలు చేశారు. అంతకుముందు కేసీఆర్ నివాసానికి నరసింహన్ దంపతులు చేరుకోగానే బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కె.తారకరామారావు సాదరంగా ఆహ్వానించారు. కేటీఆర్ వెంట మాజీమంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎంపీలు జోగినపల్లి సంతోష్, బీబీ పాటిల్ తదితరులు ఉన్నారు.



40 రోజులే గడువు!

▶ మొదటి పేజీ తరువాయి

జరిగిన నేపథ్యంలో రాష్ట్రంలో 18 సంవత్సరాలు నిండినవారి జాబితా కూడా సర్కారు వద్ద రెడీగానే ఉందని అంటున్నారు.

ఇప్పటికి దరఖాస్తుల ప్రక్రియే పూర్తి

100 రోజుల గడువు ప్రకారం చూస్తే మిగిలిన గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రభుత్వానికి మార్చి 15వ తేదీ వరకు గడువుంది. అది లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రాకపోతే. లేదంటే ప్రకియ మొత్తాన్ని వేగవంతం చేసి ఎన్నికల కోడ్ వచ్చే నాటికే గ్యారంటీల్లో పేర్కొన్న అన్ని పథకాలను అమల్లోకి తేవాల్సి ఉంది. ప్రస్తుతం ప్రజాపాలన కింద దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం మాత్రమే ముగిసింది. ఈ నెల 17 వరకు ఈ దరఖాస్తులన్నింటినీ కంప్యూటరీకరణ చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఆ తర్వాత మిగిలే కాలంలో 12 పథకాల అమలుకు మార్గదర్శకాలు ఖరారు చేయడంతో పాటు లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. లబ్ధిదారులను ఎంపిక చేసి ఆ పథకాలను వర్తింపజేసినప్పుడే మొత్తం ఆరు గ్యారంటీలు అమలైనట్టని, కానీ మిగిలిన సమయం ఇందుకు సరిపోయే అవకాశం లేదని ప్రభుత్వ వర్గాలే అంటున్నాయి. ముఖ్యంగా ప్రత్యక్ష నగదు బదిలీ లాంటి పథకాల అమలు పారదర్శకంగా చేయాల్సి ఉంటుందని, ఈ క్రమంలో వచ్చే సందేహాలు, సాంకేతిక సమస్యలను పరిష్కరించుకుని ముందుకెళ్లడం అంత సులభమేమీ కాదని వారంటున్నారు. మరోవైపు ఆర్థికంగా ప్రభుత్వంపై భారీగా భారం పడే కొన్ని పథకాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం రైతుబంధు అమలు కోసమే ప్రభుత్వం దగ్గర నిధుల్లేని పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త పథకాల అమలుకు ఖజానా సహకరిస్తుందా? అనే అనుమానాలు ఇటు అధికార వర్గాలు, అటు పార్టీ వర్గాల్లోనూ వ్యక్తమవుతున్నాయి.


మార్గదర్శకాలపై చర్చోపచర్చలు

ఆరు గ్యారంటీల అమలుతో పాటు వాటిని అమలు చేసేందుకు అవసరమైన మార్గదర్శకాల ఖరారు విషయంలో ప్రభుత్వం ఎలాంటి వైఖరి అవలంభిస్తుందనేది రాష్ట్ర ప్రజల్లో చర్చనీయాంశమవుతోంది. ప్రజలు, అధికార వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ మార్గదర్శకాల ఖరారు కూడా అంత సులభమేమీ కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రధానంగా చర్చకు వస్తోంది. సాధారణంగా పేదలకు అమలు చేసే సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డునే గీటురాయిగా తీసుకుంటారు. అయితే గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులకు కూడా దరఖాస్తులు స్వీకరించింది. ఆ మేరకు కొత్తగా కార్డులు ఇస్తారా? పాత కార్డుల ఆధారంగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామంటారా? అనే చర్చ కూడా జరుగుతోంది. అయితే కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ అంత సులభమేమీ కాదని, కేంద్ర ప్రభుత్వ పరిమితుల మేరకు ఈ కార్డులను జారీ చేయాల్సి ఉంటుందని అధికారులు చెపుతున్నారు. మిగిలిన గడువులోగా కొత్త కార్డులు కూడా జారీ చేయలేమని స్పష్టం చేస్తున్నారు. సోమవారం జరిగే కీలక సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి దీనిపై ఏం నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఇక నెలకు రూ.2,500 నగదు సాయం విషయంలో మహిళల అర్హతను ఎలా నిర్ణయిస్తారనేది కూడా ఉత్కంఠ రేకెత్తిస్తోంది. కుటుంబంలో ఒక మహిళకు ఇస్తారా? ఎంతమంది మహిళలున్నా ఇస్తారా? అసలు ఈ పథకానికి అర్హులను ఎలా నిర్ధారిస్తారనే సందేహాలు మహిళల్లో వ్యక్తమవుతున్నాయి. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని ఆరు గ్యారంటీల్లో చెప్పినప్పటికీ ఏడాదికి ఇన్ని సిలిండర్లేనన్న పరిమితి విధించనున్నట్టు తెలుస్తోంది. ఈ పథకం అమలుకు రేషన్‌కార్డును తప్పనిసరిగా ప్రామాణికంగా తీసుకోవాల్సి వస్తుందని అధికార వర్గాలు చెపుతున్నాయి.

ఆరు గ్యారంటీల్లో భాగంగా అమలు కావాల్సిన పథకాలివే..



- నెలకు ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం
- రూ.500కే గ్యాస్ సిలిండర్
- రైతులకు, కౌలు రైతులకు ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం
- వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు
- వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్
- గృహ వినియోగానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- తెలంగాణ అమరవీరులు, ఉద్యమకారుల కుటుంబాలకు 250 చదరపు అడుగుల ఇంటి స్థలం
- ఇంటి స్థలం ఉన్న పేదలు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సాయం
- విద్యాభరోసా కింద విద్యార్థులు చదువుకునేందుకు రూ.5 లక్షల విలువైన కార్డు
- ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ పాఠశాల ఏర్పాటు
- చేయూత కింద పింఛన్లు రూ.4 వేలకు పెంపు



16న శ్రీవారి పార్వేట ఉత్సవం

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి పార్వేట ఉత్సవం ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్నారు. అదే రోజున గోదాపరిణయోత్సవం జరుగనుంది. ఈ ఉత్సవంలో భాగంగా ఉదయం 9 గంటలకు ఆండాళ్ అమ్మవారి మాలలను పెద్ద జీయర్ మఠం నుంచి ఆలయ నాలుగు మాడ వీధులలో ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకు వెళ్లి స్వామివారికి సమర్పిస్తారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు శ్రీమలయప్ప స్వామి వారు, శ్రీ కృష్ణస్వామి వారు పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ ఆస్థానం, పార్వేట కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారు ఆలయానికి చేరుకుంటారు. కాగా, ఈ ఉత్సవాల కారణంగా 16న శ్రీవారి ఆలయంలో నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

ఈ నెలలోనే మోదీ సభలు

- ఒకటి ఉత్తర తెలంగాణలో.. మరొకటి దక్షిణ తెలంగాణలో
- లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ప్రణాళిక...10 సీట్ల గెలుపే టార్గెట్
- ప్రారంభమైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు

సాక్షి, హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి బీజేపీ సన్నద్ధమవుతోంది. ఈ నెలలోనే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రాష్ట్రంలో రెండు బహిరంగసభల్లో పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఉత్తర తెలంగాణలో ఒకటి, దక్షిణ తెలంగాణలో మరో సభకు ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్‌బన్సల్, సహ ఇన్‌చార్జ్ అరవింద్ మీనన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వివిధ అంశాలపై చర్చించారు. ఓటర్ల దగ్గరకు వెళ్లాలని, వారికి కేంద్ర ప్రభుత్వ విధానాలు, చేసిన, చేస్తున్న అభివృద్ధిపై వివరించాలని నిర్ణయించారు. ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పది కమిటీలతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని సునీల్ బన్సల్ ఆశాభావం వ్యక్తం చేశారు. పది కమిటీలు కేంద్ర నాయకత్వం సూచించిన విధంగా పనిచేస్తే, రాష్ట్రంలో పది లోక్‌సభ స్థానాలు కైవసం చేసుకోవడం పక్కా అని ధీమా వ్యక్తం చేశారు. నవ యువ ఓటర్ల కమిటీ, వికసిత్ భారత్ కమిటీ, శ్రీరామ మందిర్ దర్శన కమిటీ, లాభార్థి(లబ్ధిదారుల)అభియాన్ కమిటీ, మహిళ, స్వచ్ఛంద సంస్థల కమిటీ, గావ్ చలో, బస్తీ చలో తదితర కమిటీలతో సమావేశమయ్యారు.

నేడు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం..

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో భాగంగా సోమవారం లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపుకోసం అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎంపీలు డాక్టర్ లక్ష్మణ్, బండి సంజయ్, సోయం బాపూరావు, ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ఆఫీసు బేరర్స్ పాల్గొంటారు.



హైదరాబాద్ హైటెక్‌సిటీలోని యశోద ఆస్పత్రిలో థైమస్ గ్రంథి తొలగింపు సర్జరీ అనంతరం కోలుకుంటున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆదివారం పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

కొన్నిచోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చితే బాగుండేది

▶ మొదటి పేజీ తరువాయి

ఆ పార్టీ ఎమ్మెల్యేలకు నిరసన సెగ ఎదురవుతోందని కేటీఆర్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసిన వారు పునరాలోచనలో పడ్డారని, అప్పులను బూచిగా చూపి హామీల నుంచి రాష్ట్ర ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. జిల్లాల సంఖ్య తగ్గించేందుకు రేవంత్ కమిషన్ వేస్తామంటున్నారని, కొత్త జిల్లాలు రద్దు చేస్తే ప్రజలు ఊరుకుంటారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం మీద విమర్శల విషయంలో తొందరపడటం లేదని, బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ విమర్శలు చేస్తే వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. తెలంగాణలో కేసీఆర్ పట్ల అభిమానం చెక్కు చెదరలేదని, కాంగ్రెస్‌కు ఓటు వేసిన వారు కూడా కేసీఆర్ సీఎం కానందుకు బాధ పడుతున్నారన్నారని చెప్పారు. గతంలో తెలంగాణ పదాన్ని కాంగ్రెస్ నిషేధించిందని, బీఆర్ఎస్ బలంగా లేకపోతే తెలంగాణ పదాన్ని మాయం చేసేందుకు పార్టీలు సిద్ధంగా ఉన్నాయని, పార్టీలకు ఎత్తు పల్లాలు తప్పవన్నారు.

ఒకరికి సాయం అందితే మరొకరు ఈర్ష పడేలా సమాజం తయారైందని చెప్పారు. జుక్కల్ నియోజకవర్గం నిజాంసాగర్ మండలంలో అందరికీ దళితబంధు సాయం అందగా, ఇతర వర్గాలు ఓట్లు వేయలేదని, దళితబంధు, బీసీ బంధు, రైతుబంధు వంటి పథకాల ప్రభావం బీఆర్‌ఎస్‌పై పడిందని చెప్పారు. జుక్కల్‌లో షిండే ఓడిపోతారని తాము భావించలేదన్నారు.

జహీరాబాద్‌లో గెలుపుపై బీఆర్‌ఎస్ ధీమా

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడం ద్వారా బీఆర్‌ఎస్ బలోపేతమవుతుందని, లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ స్థానాన్ని బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. జహీరాబాద్ లోక్‌సభ సన్నాహక సమావేశం అనంతరం మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మీడియాతో మాట్లాడారు. సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎంపీ బీబీ.పాటిల్, ఎమ్మెల్యేలు మాణిక రావు, చింత ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

అధికారం కోల్పోయినా మునుపటి ఉత్సాహమే: హరీశ్‌రావు

పార్టీ తరఫున తప్పులు ఉంటే మన్నించాలని, అధికారం కోల్పోయినా బీఆర్‌ఎస్ కార్యకర్తల్లో మునుపటి ఉత్సాహమే ఉందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఓటమిని దిగమింగుకొని లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలనే పట్టుదలతో ఉన్నారని చెప్పారు. బీఆర్‌ఎస్ ఎంపీల సంఖ్య బలంగా ఉంటేనే లోక్‌సభలో తెలంగాణ గళం వినిపిస్తుందన్నారు. తెలంగాణ పాలిట బీజేపీది మొండిచేయి, కాంగ్రెస్‌ది తొండిచేయి అని, కేంద్రంతో సఖ్యత కోసం ప్రయత్నిస్తే గతంలో బీజేపీతో తాము కుమ్మక్కు అయినట్టు రేవంత్ ఆరోపించారన్నారు. ప్రజాపాలనలో స్వీకరించిన 1.25 కోట్ల దరఖాస్తులకు మోక్షం కల్పించాలని, వంద రోజుల తర్వాత కాంగ్రెస్ పప్పులు ఉడకవని హరీశ్ స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తన శక్తితో కాకుండా బీఆర్‌ఎస్ బలహీనతల వల్లే గెలిచిందని, బీఆర్‌ఎస్‌లో కొందరు సొంత పార్టీ అభ్యర్థులనే ఓడించారని మాజీ స్పీకర్ పోచారం అన్నారు. అభివృద్ధి ఎజెండాగా కాకుండా, ఇతర అంశాలపై ప్రజల దృష్టిని మళ్లించడంలో కాంగ్రెస్ సఫలమైందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు.

ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా...

నెల రోజుల పాలనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోస్ట్



సాక్షి, హైదరాబాద్: 'రేవంతన్నగా నన్ను గుండెల్లో పెట్టుకున్న తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఇక ముందు కూడా నా బాధ్యత నిర్వర్తిస్తాను' అని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. నెల రోజుల పాలనపై ఆదివారం ఎక్స్‌లో ఆయన పోస్టు చేశారు. సంకెళ్లను తెంచి, స్వేచ్ఛను పంచి జనం ఆకాంక్షలను నిజం చేస్తూ సాగిన ఈ నెల రోజుల ప్రస్థానం సంతృప్తినిచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. సేవకులమే తప్ప పాలకులం కాదన్న మాట నిలబెట్టుకుంటూ, పాలనను ప్రజలకు చేరువ చేస్తూ, అన్నగా నేనున్నానని రేవంత్ భరోసా ఇచ్చారు. నెల రోజుల ప్రయాణం కొత్త అనుభూతిని ఇచ్చిందని తెలిపారు. మన ఆడబిడ్డల మొహంలో ఆనందాలు చూస్తూ, రైతుకు భరోసా ఇస్తూ సాగిన నెల రోజుల నడక ఉజ్వల భవిత వైపునకు అడుగులు వేస్తోందన్నారు. పెట్టుబడులకు కట్టుబడి ఉన్నామంటూ పారిశ్రామిక వృద్ధికి పెద్దపీట వేస్తూ నగరాల అభివృద్ధికి నగిషీలు చెక్కుతూ, మత్తులేని చైతన్యపు తెలంగాణ కోసం గట్టి పట్టుదలతో ఈ నెల రోజుల పాలన బాధ్యతగా సాగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ట్వీట్ చేశారు.

మే నెలాఖరుకల్లా 'సీతారామ' పనులు పూర్తవ్వాలి

- సత్తుపల్లి, పాలేరు టన్నెల్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి
- ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: సీతారామ ప్రాజెక్టు కింద కాలువల పనులను మే నాటికి పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి ఆదివారం మంత్రి ఉత్తమ్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో సీతారామ ప్రాజెక్టు పురోగతి, చేపట్టాల్సిన పనులపై మంత్రి తుమ్మల పలు సూచనలు చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు సాగునీరు అందించడానికి చేపట్టిన సీతారామ ప్రాజెక్టుపై సుదీర్ఘంగా ఉత్తమ్‌తో కలిసి సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న సీతారామ ప్రాజెక్టు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల అధికారులకు సూచించారు. పనుల్లో వేగం పెంచితే ఈ ఏడాదిలోనే వైరా ప్రాజెక్టు, లంకా సాగర్, ఎన్నెస్పీ ఆయకట్టులోని సుమారు 1.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చన్నారు. ప్రాజెక్టుపై సుమారు రూ. 7,500 కోట్లు ఖర్చు చేశారని, మూడు పంప్‌హౌస్‌లు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు.

టెండర్లు పూర్తి చేయాలి..

రూ. 70 కోట్లతో ఏన్కూరు వద్ద లింకు కెనాల్ పనులకు టెండర్లు పూర్తి చేసి పనులు వేగంగా చేపట్టాలని మంత్రి తుమ్మల సూచించారు. ఈ పనులు పూర్తి చేస్తే వచ్చే సీజన్‌లోనే వైరా ప్రాజెక్టు, లంకసాగర్, బేతుపల్లి పరిధిలో ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. ఇటీవల గండుగులపల్లిలో జరిగిన సమావేశంలో సమీక్షించిన అంశాలను ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ దృష్టికి మంత్రి తుమ్మల తీసుకెళ్లగా సంబంధిత పనులను దశలవారీగా ప్రాధాన్యతను బట్టి పూర్తిచేసి మే నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. యాతాలకుంట భూసేకరణ త్వరగా తేలిస్తే కెనాల్ కింద నీరు ఇవ్వొచ్చన్నారు. ఈ పనులు పూర్తయితే సీతారామ ద్వారా ఎన్నెస్పీ ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. సత్తుపల్లి ట్రంకు కెనాల్‌కు సంబంధించి భూసేకరణకు చెల్లించాల్సిన రూ. 12 కోట్లు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా పాలేరు టన్నెల్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పై పనులన్నీ పూర్తి చేస్తే వైరా రిజర్వాయర్ కింద 1.60 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చని మంత్రి తుమ్మల అభిప్రాయపడ్డారు.

సోనియాపై ఎవరూ పోటీకి దిగొద్దు

- ఆమెను తెలంగాణ నుంచి పోటీ చేయాలని కోరాం
- రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం
- బీఆర్‌ఎస్ ఆర్థిక అరాచకత్వంపై శ్వేతపత్రం విడుదల చేస్తాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



స్నానాల లక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

వైరా/వైరా రూరల్: ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీని తెలంగాణ నుంచి లోక్‌సభకు పోటీ చేయాలని కోరామని డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. తన స్వగ్రామమైన ఖమ్మం జిల్లా వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణపై ప్రేమ ఉన్న ఏ పార్టీ కూడా సోనియాపై పోటీకి దిగవద్దని భట్టి సూచించారు. రాష్ట్రంలో గత తొమ్మిదేన్నరేళ్లలో పాలన గాడి తప్పిందని, దాన్ని తమ ప్రభుత్వం తిరిగి దారిలో పెడుతోందన్నారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగులకు 21వ తేదీ తర్వాతే జీతాలు అందేవని, ఈనెల మొదటి వారంలోనే జీతాలు పొందేలా ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకున్నామని తెలిపారు.

మిషన్ భగీరథలో అవినీతిని త్వరలో బయటపెడతాం

మిషన్ భగీరథలో జరిగిన అవకతవకలపై నివేదిక తయారు చేస్తున్నామని, అందులోని అవినీతిని త్వరలోనే బయటపెడతామని భట్టి ప్రకటించారు. కాళేశ్వరం నిర్మాణంలో దోపిడీ జరిగిందని కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఏజెన్సీలు ఇచ్చిన సమాచారం ప్రకారమే బీఆర్‌ఎస్‌కు ఆ ప్రాజెక్ట్ ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శించే వారని గుర్తు చేశారు. కాళేశ్వరం అవినీతిపై పూర్తి సమాచారం ఉన్నా నాటి బీఆర్‌ఎస్‌తో కుమ్మక్కయినందునే కేంద్రం ఉదాసీనంగా వ్యవహరించిందని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామనీ, ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామనీ, నల్లధనం బయటకు తీస్తామని ప్రకటించిన బీజేపీ నాయకులు ఇప్పుడు వాటిపై సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

కేసీఆర్‌ను కాపాడాలని చూస్తోంది

కాంగ్రెస్ వ్యవహారశైలిపై అనుమానం కలుగుతోంది: డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ సర్కార్ వ్యవహారశైలి చూస్తుంటే మాజీ సీఎం కేసీఆర్‌ను కాపాడాలని చూస్తున్నట్టు అనుమానం కలుగుతోందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. దేశంలోనే అతిపెద్ద కుంభ కోణం కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం జ్యుడీషియల్ ఎంక్వైరీతో కాలయాపన చేయాలని చూస్తోందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ సర్కార్ కాళేశ్వరం రీడిజైన్ పేరుతో ఉద్దేశపూర్వకంగా ప్రాజెక్ట్ వ్యయాన్ని సుమారు రూ.63 వేల కోట్ల నుంచి రూ.1.50 లక్షల కోట్లకు అంచనాలుపెంచి.. వేలకోట్ల అవినీతికి పాల్పడిందన్నారు. ఆదివారం అరుణ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించడం కంటే సీబీఐ దర్యాప్తు జరిపిస్తే నిజానిజాలు బయటపడతాయన్నారు. కాళేశ్వరం అవినీతి ఆరోపణలపై సీబీఐ విచారణ కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు లేఖ రాయలేదో చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ కోఆర్డినేటర్లు వీరే

సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ కోఆర్డినేటర్లను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఈ సమన్వయకర్తల జాబితాను ఆదివారం ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ. వేణుగోపాల్ ఓ ప్రకటనలో విడుదల చేశారు.

ఆదిలాబాద్ (ఎస్టీ)- సీతక్క, పెద్దపల్లి (ఎస్సీ) -డి.శ్రీధర్‌బాబు, కరీంనగర్- పొన్నం ప్రభాకర్, నిజామాబాద్- టి.జీవన్‌రెడ్డి, జహీరాబాద్- టి.సుదర్శనరెడ్డి, మెదక్- దామోదర రాజనరసింహ, మల్కాజిగిరి- తుమ్మల నాగేశ్వరరావు, సికింద్రాబాద్- మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాద్- మల్లు భట్టి విక్రమార్క, మహబూబ్‌నగర్- రేవంత్‌రెడ్డి, చేవెళ్ల-రేవంత్‌రెడ్డి, నాగర్‌కర్నూలు (ఎస్సీ)- జూపల్లి కృష్ణారావు, నల్లగొండ- ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి, భువనగిరి- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వరంగల్ (ఎస్సీ)- కొండా సురేఖ, మహబూబా బాద్ (ఎస్టీ)- పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఖమ్మం- పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.

ప్రజాపాలనపై నేడు సమీక్ష

▶ మొదటి పేజీ తరువాయి

అవినీతి జరిగిందనే ఆరోపణలు, ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోళ్లు, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్రాజెక్టుల్లో అవకతవకలకు సంబంధించి న్యాయ విచారణ కోసం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడం తదితరాలపై కూడా చర్చించనున్నట్లు చెబుతున్నారు. ఇక నెలరోజుల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో సానుకూల స్పందన వచ్చిందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో నెలరోజుల పాలన, అలాగే ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై మరింత ఘాటుగా స్పందించడానికి ఏమి చేయాలన్న అంశాలపై కూడా ఈ భేటీలో చర్చించే అవకాశం ఉంది.

1.11 కోట్ల కుటుంబాల నుంచి దరఖాస్తులు

గతనెల 28వ తేదీ నుంచి ఈనెల 6వ తేదీ వరకు 8 పని దినాల్లో కొనసాగిన ప్రజాపాలనలో మొత్తం 1.11 కోట్ల కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నట్లు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. వారి ద్వారా 1,25,84,383 దరఖాస్తులు అందినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. 12,769 గ్రామ పంచాయతీలతో పాటు, 3,623 మునిసిపల్ వార్డులు/డివిజన్లలో ఈ ప్రజాపాలన నిర్వహించినట్లు పేర్కొన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన అభ య హస్తంలోని ఆరు గ్యారంటీల కింద మొత్తం 1,05,91,636 దరఖాస్తులు రాగా.. ఇతర అంశాలకు సంబంధించి 19,92,747 అందాయి.

సైబర్ కేసుల్లో తెలంగాణ @ 3

మొదటి 2 స్థానాల్లో ఢిల్లీ, హరియాణా

- సైబర్ నేరాలపై 1930 హెల్ప్‌లైన్‌కు ప్రతిరోజు వస్తున్న ఫిర్యాదులు 50 వేలు
- వెల్లడించిన ఐ4సీ-2023 వార్షిక నివేదిక

సాక్షి, హైదరాబాద్ : సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా సైబర్ నేరాలపై నమోదవుతున్న కేసుల్లో తెలంగాణ రాష్ట్రం మూడోస్థానంలో ఉండగా, మొదటి రెండు స్థానాల్లో ఢిల్లీ, హరియాణా ఉన్నాయి. 2023లో రాష్ట్రంలో సైబర్ నేరాలను పరిశీలిస్తే ప్రతి లక్ష మందికి 261 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఇది మనం చెబుతున్న మాట కాదు ఐ4సీ (ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్) సీఈఓ రాజేశ్‌కుమార్ ఇటీవల వెల్లడించిన 2023 వార్షిక నివేదికలో పొందుపరిచారు. ఇంకా అనేక ఆసక్తికర అంశాలూ ఆ నివేదికలో ఉన్నాయి. సైబర్ నేరాలపై ప్రజల్లోనూ అవగాహన పెరుగుతోంది. ఈ నేరాలపై 1930 టోల్‌ఫ్రీ నంబరుకు రోజుకు సరాసరిన 50వేల ఫోన్‌కాల్స్ వచ్చినట్టు ఐ4సీ నివేదిక తెలిపింది. 2023 సంవత్సరంలో ఎన్‌సీఆర్‌పీ(నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్)కి 15,56,176 ఫిర్యాదులు అందాయి. ఎన్‌సీఆర్‌పీకి సైబర్ నేరాలపై దేశవ్యాప్తంగా రోజుకు సరాసరిన 5వేల ఫిర్యాదులు వస్తున్నాయి.

దేశవ్యాప్తంగా 2023లో అత్యధికంగా నమోదైన సైబర్ నేరాలు


కేవైసీ అప్‌డేషన్ మోసాలు, కస్టమర్ కేర్ నంబర్ల పేరిట మోసాలు	35%
సెక్స్‌టార్షన్ స్కామ్‌లు	24%
ఆన్‌లైన్ బ్యాంకింగ్, క్యూఆర్ కోడ్ మోసాలు	22%
ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం (ఏఈపీఎస్) మోసాలు	11%
ఆండ్రాయిడ్ మొబైల్ మాల్వేర్ మోసాలు	8%

సైబర్ భద్రతకు అత్యంత ప్రాధాన్యం



దేశప్రజలకు సైబర్ భద్రత కల్పించడం మా ప్రధాన లక్ష్యం. దీని కోసమే కేంద్రం ఐ4సీ ఏర్పాటు చేసింది. సైబర్ నేరాల గుర్తింపు, దర్యాప్తు, సైబర్ నేరాల కట్టడి చేయడం కేంద్ర హోం శాఖ మాకు ఇచ్చిన ప్రధాన బాధ్యతలు. ఇందుకోసం మేం ప్రత్యేక వేదికగా పనిచేస్తున్నాం. సైబర్ భద్రత అనేది ఇప్పుడు జాతీయ భద్రతగా మారిన నేపథ్యంలో ఐ4సీని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆదేశాల ప్రకారం బలోపేతం చేస్తూ వెళుతున్నాం. సైబర్‌నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం.

– వార్షిక నివేదిక సందర్భంగా ఐ4సీ సీఈఓ రాజేశ్‌కుమార్





సైబర్‌క్రైం పోర్టల్ బ్లాక్ చేసినవి

2,95,461 ఫేక్ సిమ్ కార్డులు	2,810 ఫిషింగ్ వెబ్‌సైట్స్, యూఆర్‌ఎల్‌లు
46,000 ఐఈఎంఐ డివైజ్‌లు	
595 మొబైల్ అప్లికేషన్స్	

ఎయిర్‌పోర్టు మెట్రోపై మేధోమథనం

- చాంద్రాయణగుట్ట వద్ద ఇంటర్‌చేంజ్ స్టేషన్
- భూ లభ్యత, రూట్‌మ్యాప్‌పై అధ్యయనం
- త్వరలో డీపీఆర్ సిద్ధం చేయండి: ఎన్వీఎస్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్ : ప్రతిపాదిత ఎయిర్‌పోర్టు మెట్రో ఫేజ్– 2పై అధికారులు కసరత్తు చేస్తున్నారు. నాగోల్, ఎల్‌బీనగర్, ఎంజీబీఎస్, ఫలక్‌నుమా మార్గాల్లో చాంద్రాయణగుట్ట మీదుగా ఎయిర్‌పోర్టు వరకు చేపట్టనున్న రూట్‌లో చాంద్రాయణగుట్ట వద్ద ఇంటర్‌చేంజ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు కొత్త ఎయిర్‌పోర్ట్ రూట్, చాంద్రాయణగుట్ట ఇంటర్ చేంజ్ స్టేషన్‌పై ఆదివారం మెట్రో భవన్‌లో హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మేధోమథన సమావేశంలో ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ నిపుణులు, కన్సల్టెన్సీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల ప్రకారం.. నాగోల్ నుంచి ఎల్‌బీనగర్ వరకు మెట్రోను పొడిగించి అక్కడి నుంచి మైలార్‌దేవ్‌పల్లి మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మెట్రో విస్తరణ చేపట్టాల్సి ఉంది. ఈ మార్గంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం వద్ద కొత్తగా హైకోర్టు భవనం అందుబాటులోకి రానున్న దృష్ట్యా మైలార్‌దేవ్‌పల్లి నుంచి నూతన హైకోర్టు భవనం మీదుగా ఎయిర్‌పోర్టు వరకు మెట్రోను విస్తరించే అంశాన్ని కూడా పరిశీలించాలని ఎన్వీఎస్ రెడ్డి అధికారులకు సూచించారు. మెట్రోస్టేషన్లు, డిపోల ఏర్పాటు, ఆపరేషన్ కంట్రోల్ సిస్టమ్, సిగ్నలింగ్ వ్యవస్థ, తదితర సాంకేతిక అంశాలు, ప్రయాణికుల లగేజీ తనిఖీలు, సెక్యూరిటీ చెకింగ్‌లు వంటి అంశాలను సైతం సమగ్రంగా చర్చించారు. సమగ్రమైన ప్రాజెక్టు నివేదికను (డీపీఆర్)ను సిద్ధం చేయాలని చెప్పారు. అమీర్‌పేట్ తరహాలో చాంద్రాయణగుట్ట వద్ద అతిపెద్ద ఇంటర్‌చేంజ్ స్టేషన్ అందుబాటులోకి రానున్న దృష్ట్యా దాని నిర్మాణంపై ప్రత్యేక అధ్యయనం చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ డీవీఎస్ రాజు, చీఫ్ సిగ్నల్ అండ్ టెలికం ఇంజినీర్ ఎస్‌కె దాస్, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.ఆనంద్ మోహన్, జనరల్ మేనేజర్లు ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి, బీఎన్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

గాలిపటం ఎగురవేస్తూ

కరెంటుషాక్‌తో బాలుడి మృతి

సిద్దిపేట జిల్లా మర్కూక్‌లో ఘటన



మర్కూక్(గజ్వేల్): పాఠశాలకు సెలవు ఉండటంతో తల్లిదండ్రుల వెంట పంటపొలానికి వెళ్లిన బాలుడిని కాపర్‌వైర్ కాటేసింది. సరదాగా గాలిపటం ఎగురవేస్తూ కరెంటుషాక్‌కు గురై పదేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లాలోని మండల కేంద్రమైన మర్కూక్‌లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మర్కూక్ గ్రామానికి చెందిన బుర్ర అశోక్ కుమారుడు సాత్విక్(10) ఓ ప్రైవేట్ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో గ్రామంలోని తోటి స్నేహితు లతో కలిసి గాలిపటాలు ఎగురవేస్తు న్నాడు. అయితే ఇంటి పట్టున ఎవరూ లేరని తండ్రి తన కొడుకును పొలం వద్దకు తీసుకెళ్లాడు. సాత్విక్ అక్కడ దొరికిన సన్నటి కాపర్ వైరుకు గాలిపటం కట్టుకొని ఎగురవేశాడు. ఈ క్రమంలో అక్కడ ఉన్న 11 కేవీ విద్యుత్‌తీగలకు కాపర్‌వైరు తగలడంతో కరెంటుషాక్‌కు గురైన బాలుడు ఒక్కసారిగా కుప్పకులాడు. గమనించిన తల్లిదండ్రులు వెంటనే సీపీఆర్ చేసినా ఫలితం లేకుండాపోయింది. వెంటనే గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ప్రోత్సహిస్తే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారు

మంత్రి సీతక్క



వైశ్య లైమ్‌లైట్ అవార్డులను ప్రదానం చేస్తున్న మంత్రి సీతక్క

హఫీజ్‌పేట్: సమాజంలో మహిళలంటే ఇంకా చిన్నచూపు చూసే పరిస్థితులు మారుతున్నా యని, ప్రోత్సహిస్తే ఏ రంగమైనా మహిళలు రాణిస్తారని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. రాయదుర్గంలోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో వైశ్య లైమ్‌లైట్ అవార్డ్స్–2023 ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ వివిధ రంగాలలో అవార్డులు పొందిన మహిళలు అందరికీ ఆదర్శమన్నారు. మహిళలను గౌరవించి..అన్ని రంగాలలో ముందుకు వెళ్లేలా వారికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు కోలేటి దామోదర్ బొల్లం సంపత్‌కుమార్, అమర వాది లక్ష్మీ నారాయణ, ఉప్పల శ్రీనివాస్, సోమ భరత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవార్డులు పొందినవారిలో డాక్టర్ ఆఫ్ ది ఇయర్‌గా డాక్టర్ కటకం నర్మద, మాన్యుఫ్యాక్చరర్ ఆఫ్ ది ఇయర్‌గా చంద్రికా సతీష్, అథ్లెట్ ఆఫ్ ది ఇయర్‌గా క్రీడాకారిణి పీవీఎం నాగజ్యోతి తదితరులు ఉన్నారు.

ప్రచారం, పురస్కారాల కోసం రచనలొద్దు

- ప్రజల జీవితాలను ప్రభావితం చేసే రచనలు చేయండి
- యువ రచయితలకు ప్రముఖ కవి నిఖిలేశ్వర్ పిలుపు



హిమాయత్‌నగర్: పబ్లిసిటీ కోసం, పురస్కారాల కోసం కాకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే లోతైన అధ్యయనంతో రచనలు చేయాలని యువ రచయితలకు ప్రముఖ కవి నిఖిలేశ్వర్ పిలుపునిచ్చారు. రచయితలు నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వారి కష్టాలు, అనుభవాల ఆధారంగా రచనలు చేయా లని సూచించారు. సామా జిక విశ్లేషణ, రాజకీయ పరిశీలన, మానవ స్వభావంలోని చిక్కుముడులను తీక్షణంగా చూసే తాత్విక లక్షణం యువ రచయితలకు అవసరమన్నారు. అభ్యుదయ, విప్లవ సాహిత్యంలోనే సామాజిక బాధ్యతకు మూలాలు ఉన్నాయని, నిరంతరం వాటిపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ రచయితల సంఘం, హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆదివారం 'అంతర్వాణి' పేరిట నిఖిలేశ్వర్ సాహిత్య జీవన ప్రయాణంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిఖిలేశ్వర్ తన జీవితంలోని సాహిత్య అనుభవాలను, తనను విప్లవ కవిగా, హేతువాదిగా మార్చిన ఉదంతాలను తెలియజేస్తూ యువరచయితలకు ఎన్నో సూచనలు చేశారు. రాజకీయ వ్యవస్థ మత దురాభిమానంతో చెలరేగిపోతూ, భావవ్యక్తీకరణను అన్ని విధాలుగా అణచివేస్తున్న దశలో యువ రచయితలు, కవులు చాలా ధైర్యంగా నిలదొక్కుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. రచయిత నందిని సిధారెడ్డి మాట్లాడుతూ, కవి నిఖిలేశ్వర్ తన 85 ఏళ్ల జీవితంలో సాహిత్య అనుభవం చాలా గొప్పదని, ఆయనను ప్రేరణగా తనతో పాటు ఎందరో సాహితీ ప్రియులు ఆదర్శంగా తీసుకొని రచనలు చేశారని కొనియాడారు. తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ అధ్యక్షుడు కందుకూరి శ్రీ రాములు, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ సంపత్ కుమార్, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

బీజేపీ నేతను హత్య చేసిన మావోయిస్టులు



చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బీజేపీ నాయకుడిని మావోయిస్టులు ఆదివారం హత్య చేశారు. కాంకేర్ జిల్లా పకంజూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారంరాత్రి ఈ ఘటన జరిగింది. భారతీయ జనతా పార్టీ కాంకేర్ జిల్లా ఉపాధ్యక్షుడు అసీంరాయ్ గతంలో పకంజూర్ పంచాయతీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



చెడ్డ జ్ఞాపకశక్తి వల్ల ఉన్న ప్రయోజనం ఏమిటంటే, చాలాసార్లు అవే మంచి విషయాలను మొదటిసారి విన్నట్టుగా ఆనందించగలగడం!

– ఫ్రెడరిక్ నీషే

సాక్షి

సోమవారం, 8 జనవరి 2024

ఒక ప్రవాహం

మనుషుల మీద లేబుల్స్ వేయడంలో మనకు ఒక సౌలభ్యం ఉంటుంది. దానివల్ల వారిని అంచనా కట్టడానికి ఒక పరిధి ఏర్పడుతుంది. కానీ భూమ్మీద ప్రవాహంలా బతికేవాళ్లు కొందరుంటారు. ఆ ప్రవాహంలో అన్నింటినీ తమలో ఇముడ్చుకుని పోతారు. సాగిపోవడమే వారి లక్షణం. ఆగిపోవడం వారికి తెలియని గుణం. వారు ఏమిటి? అని ప్రశ్న వేసుకున్నప్పుడు, వారు ఏమిటి కాదు? అనే మరో ప్రశ్న ఎదురొస్తుంది. ఆ రెండు ప్రశ్నల మధ్యే వారి జీవితం గురించిన ఒక జవాబు దొరుకుతుంది. 150 ఏళ్ల క్రితం ఫ్రాన్స్‌లోని నార్మండీలో జన్మించిన (1873 జనవరి 28) 'కొలెట్' ఒక సజీవ ప్రవాహం. చాలా కారణాల వల్ల ఫ్రెంచ్ సమాజపు సాహిత్య సాంస్కృతిక జీవితాన్నీ, తద్వారా ప్రపంచాన్నీ ఆమె ప్రభావితం చేశారు. 'చెరి', 'జిజి', 'ద వేగబాండ్', 'ద ప్యూర్ అండ్ ది ఇంప్యూర్' లాంటి రచనలు చేసిన కొలెట్ జీవితం ఆమె రచనలంతే ఆకర్షణీయం.

తన పేరును కేవలం ఏకపదంగా రాసుకున్న 'కొలెట్' పూర్తి పేరు సిడొనీ–గాబ్రియెల్ కొలెట్. ఆమె జీవితంలోని వివాహపు అధ్యాయం పురుషాధిక్య ప్రపంచంలో స్త్రీ ఉనికి పరిమితులను చెబుతుంది. కేవలం కుటుంబాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించడానికి పద్నాలుగేళ్ల పెద్దయినవాడితో వివాహానికి ఒప్పుకొంది. భర్త హెన్రీ గౌథియర్ విల్లర్స్ కలంపేరు 'విల్లీ'. సమాజంలో ప్రతిష్ఠ ఉన్నవాడు. అతడి ప్రఖ్యాతి ఎంతటిదంటే 'ఘోస్టు రైటర్స్'తో పుస్తకాలను రాయిస్తుండేవాడు. ''నీ ప్రాథమిక పాఠశాల జ్ఞాపకాలను కాగితం మీద పెట్టు,'' అని నూతన వధువుకు కూడా చెప్పాడు. మనోరంజకమైనవి ఉంటే వదిలిపెట్టొద్దనీ, వాటిని తాను ఏదోలా వాడుకుంటాననీ కూడా అన్నాడు. కొలెట్ సహజంగానే రైటర్ మెటీరియల్. ఆమె రాతలను విల్లీ ముందు కొంచెం అనుమానించినా, వాటిని 1900లో 'క్లాడైన్ ఎట్ స్కూల్' నవలికగా తెచ్చాడు. ఒక పాఠశాల బాలిక కౌమార దశను వాస్తవికంగా చిత్రించిన ఈ రచనకు వెంటనే పేరొచ్చింది. సాహిత్యంలో కౌమార బాలిక గొంతుక వినిపించింది. ఆత్మ కథాత్మక సాహిత్యానికి పథనిర్దేశత అయ్యింది. వీటి మూల రచయిత్రి కొలెటే అని సాహిత్య లోకం అనంతర కాలపు ఆమె రచనల శైలిని బట్టి నిర్ధారించుకుంది కానీ అప్పటికి అధికారిక రచయిత విల్లీనే. అమ్మకాలు పెరగడంతో భార్య మీద ఒత్తిడి పెట్టాడు. ఒక దశలో గదిలో బంధించి, తర్వాతి ఇన్‌స్టాల్‌మెంట్ ఇచ్చేంతవరకూ విడిచిపెట్టలేదు. ఈ వేధింపులు సహిస్తూనే, కొనసాగింపు నవలికలు 'క్లాడైన్ ఇన్ పారిస్', 'క్లాడైన్ మేరీడ్' రాసింది కొలెట్. క్లాడైన్ పాత్ర ఎంత హిట్టయ్యిందంటే, ఆ థీమ్‌తో సిగరెట్లు, లింజెరీ, పెర్‌ఫ్యూమ్ కూడా విల్లీ ప్రారంభించాడు.

విల్లీ ఆమెను సాహిత్యంలోకి ప్రవేశపెట్టినా, మేలుకొన్నాక, ఆయన్ని జీవితంలోంచి బయటికి నెట్టేసింది కొలెట్. కానీ రాయల్టీల డబ్బులు లేకపోవడంతో స్టేజీ నటిగా పనిచేసింది. 1907లో తనే రాసిన 'ద ఫ్లెష్' సంగీత రూపకంలో స్టేజీ మీద ఎడమ చన్నును ప్రదర్శించడం పెద్ద కల్లోలం సృష్టించింది. ఇక, 'మౌలిన్ రూజ్'లో తన స్నేహితురాలు 'మిస్సీ'ని బహిరంగంగా ముద్దుపెట్టుకోవడం దుమారం లేపింది. ఈ మొదటి ప్రదర్శన తర్వాత పోలీసులు దాన్ని సాగనివ్వలేదు. బహిరంగంగా వాళ్లు తమ లెస్బియన్ బంధం గురించి ప్రకటించడం కూడా అప్పటి సమాజానికి విఘాతంలా తగిలింది. దీనివల్ల ఎవరికీ కంటబడని స్థలాల్లో కొంతకాలం బతకాల్సిన పరిస్థితి వచ్చింది. అయితే, స్వలింగ శృంగార సాహచర్య ప్రదర్శనల తాలూకు ధిక్కార బీజాలు ఇలా మొదలయ్యాయని అనుకోవచ్చు.

కొలెట్ అంటే ఒక స్కాండల్. పరస్పర వైరుధ్యంగా కనబడే ఎన్నో అంశాలు ఆమె జీవితంలో కనబడతాయి. ప్రపంచమంతా యూదుల పట్ల పట్టింపుతో ఉన్నప్పుడు, నాజీలతో జట్టుకట్టి, యూదు వ్యతిరేక భావనలు ఉన్న రచనలు చేశారు. తాను ఎంత స్వేచ్ఛగా బతికినప్పటికీ, ఓటు హక్కు కోరే స్త్రీలను కొరడాతో బాదాలన్నారు. జర్నలిస్టుగా పనిచేశారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో యుద్ధరంగం నుంచి వార్తలు పంపారు. ఒక సాహిత్య పత్రికకు సంపాదకురాలిగా పనిచేసినప్పుడు, ఎంతోమంది యువ రచయితలను ప్రోత్సహించారు. సుమారు యాభై పుస్తకాలను వెలువరించిన కొలెట్, పది గంటల పాటు ఏకధాటిగా కూడా రాసేది. ''కొలెట్ స్త్రీవాది అవునో కాదో నిర్ణయించాల్సింది ఆమె కాదు'' అని ఆమెను స్త్రీవాదిగానే సాహిత్య లోకం తర్వాత గుర్తించింది. సాధారణ మనుషులు కోరుకునే నైతిక చట్రంలోకి ఇమడని కొలెట్ ఒక బైసెక్సువల్. కుమారుడి లాంటి బాలుడితో ప్రణయం కొనసాగించారు. 'మాంసం' అనేది ఆమెకు చాలా ఇష్టమైన మాట. వాంఛకు అది సంకేతం. ''ప్రేమ, నా కలానికి బ్రెడ్ అండ్ బటర్'' అన్నారు. అందం పట్ల ఆమెకు మితిమీరిన పట్టింపు. వృద్ధాప్య ఛాయలు పొడసూపగానే 'ఫేస్–లిఫ్ట్' చేయించుకున్నారు. తన శరీరంలో ఏర్పడిన ముడతలను ద్వేషించారు. పాశ్చాత్య దేశాల్లోనూ విడాకులు తీసుకున్నవాళ్లకు మన్నన లేని కాలంలో, రెండు సార్లు విడాకులు తీసుకున్నారు. ఆ కారణంగా ఆమె మరణించినప్పుడు ధార్మిక క్రతువులు నిరాకరించబడ్డాయి.

''చనిపోయిన తర్వాత కూడా కొలెట్ ఎంత సుదీర్ఘకాలం బతికింది!'' అన్నారు 1967లో జర్నలిస్ట్ జానెట్ ఫ్లానర్. ఆ మాట అన్న యాభై ఏళ్ల తర్వాత కూడా కొలెట్ బతికేవుంది. ఆమె జీవితం ఇప్పటికీ ఆసక్తిగొలుపుతూనే ఉంది. ఆమె మీద పుస్తకాలు, సినిమాలు వస్తూనే ఉన్నాయి. మంచో చెడో కొలెట్ రూపంలో ఒక ఉత్సాహం ఈ భూమ్మీద కొన్నాళ్లు తిరగాడిందని మనం అనుకోవచ్చు. అయినా చెడు అని ఎందుకనాలి!

కొత్త నిర్ణయాలు తీసుకుందాం!

కామెంట్



కరణ్ థాపర్

కొత్త సంవత్సరంలో వ్యక్తులుగా మనం కొన్ని తీర్మానాలు చేసుకుంటాం. అదే విధంగా మనమంతా ఒక దేశంగా కూడా కొన్ని తీర్మానాలు చేసుకోవాలి. పార్లమెంటులో సభా సమయాన్ని దుర్వినియోగం చేయబోమని ఎంపీలూ, చర్చల పేరుతో జనాల మధ్య గొడవలు సృష్టించబోమని టీవీ యాంకర్లూ తీర్మానించుకోవాలి. ట్రాఫిక్ నియమాలను అతిక్రమించకుండా వాహనాలను ధ్యాసగా, జాగ్రత్తగా నడుపుతామని మనం సంకల్పం చెప్పుకోవాలి. కానీ మూణ్నాళ్లకే ఈ తీర్మానాలన్నీ వట్టి ముచ్చటగా మారిపోతే? అసలీ తీర్మానాలు తీర్చేవా, మార్చేవా? దీనికి ఒకటే జవాబు. తీర్చడం, మార్చడం కళ్లకు కనిపించపోవచ్చు. కానీ, అసలంటూ కొత్త నిర్ణయం తీసుకోవటం అన్నదే సంకల్ప సాధనలోని నిబద్ధతకు మొదటి మెట్టు అని గుర్తించాలి.

పూతకొచ్చే తీర్మానాలకు కొత్త సంవత్సరం ప్రియమైన రుతువు అయినప్పటికీ, వాటిల్లో చాలా వరకు ఎక్కువ కాలం జీవించి ఉండవు. గొప్ప ఉత్సాహపు ధ్వనితో మొగ్గ తొడిగి, చప్పుడే కాని పరిహాసపు గాలివానలతో టప్పున నేల రాలేందుకే అవి చిగురిస్తాయి. అయినప్పటికీ, మనమంతా ఒక దేశంగా కొన్ని తీర్మానాలను స్వీకరించాలని నేనిప్పుడు సూచించబోవడం మీకొక ప్రశ్నార్థకం అవొచ్చు. దీనికి చాలా సులభమైన జవాబే ఉంది. చేయాలని అనుకున్న దానిలో నిబద్ధత కొరవడినా, ఏం చేయవలసిన అవసరం ఉన్నదో దానిని ఒక సంకల్పంలా తీసుకోవడమే అసలొక తీర్మానం. కనుక ఈ కొత్త సంవత్సర ఆరంభంలో ఆ మొదటి అడుగు వేద్దాం. 'సంకల్పం' అనే అడుగు.



మొదటిది, ఒకటేంటంటే మన రాజకీయ నాయకులు చేయవలసినది. పార్లమెంటులో ఎంతో విలువైన ప్రజాసమయ దుర్వినియోగానికి పాల్పడే విధంగా తమ ప్రవర్తన ఉండకూడదని వారు తీర్మానం చేసుకోవాలి. వాళ్లు అక్కడ కూర్చున్నందుకు మీకు, నాకు అవుతున్న ఖర్చు నిమిషానికి 2 లక్షల 50 వేల రూపాయలు. ఈ ఖర్చును మనం సంతోషంగానే భరిస్తున్నాం. ఎందుకంటే, నిజాలను నిగ్గు తేల్చేందుకు, ప్రభుత్వ పనితీరును ఎత్తిచూపేందుకు, నిశిత పరిశీలనకు; అవినీతిని, అసమర్థతను బహిర్గతం చేయడానికి... ప్రశ్నలు, చర్చలు తప్పనిసరి అని మనం విశ్వసిస్తాం. అటువంటిది... సభ 'వెల్'లోకి దూసుకెళ్లే, స్పీకర్‌పై రంకెలు వేసే, సభకు గైర్హాజరు అయ్యే ఎంపీలకు మన కష్టార్జితాన్ని ఎందుకు ఖర్చుపెట్టాలి? 16వ లోక్‌సభ (2014–19) సభా సమయం 1,615 గంటలు కాగా, అందులో 16 శాతం సమయాన్ని అంతరాయాలు, వాయిదాల కారణంగా కోల్పోయాం. ఆ కోల్పోయిన సమయానికి అయిన ఖర్చు రూ. 39 కోట్లు.

మన ప్రజాప్రతినిధులుగా, మనం వారికి నిధులు సమకూరుస్తున్నాం కనుక, ఆ విలువకు సమానమైన సేవలను మన ఎంపీలు మనకు అందించాలి. అందుకు మనం అడుగుతున్నదల్లా పార్లమెంటు సమర్థంగా, అర్థవంతంగా పనిచేయాలని! వారి నుండి ఈ కొత్త సంవత్సరం మనకు ఇలాంటి హామీ లభిస్తుందా?

తర్వాత, ప్రెస్! ఇక్కడ నా ఉద్దేశం ప్రెస్ అంటే ప్రధానంగా టెలివిజన్ న్యూస్ చానెళ్లు. టీవీ వీక్షకులు డబ్బు చెల్లిస్తారు కనుక ముఖ్యమైన వార్తల్ని ఆశించే హక్కు వారికి ఉంటుంది. ఏది ముఖ్యమైన వార్తో నిర్ణయించడానికి అనేకమైన ప్రామాణికాలు ఉంటాయన్న దాంట్లో సందేహమేమీ లేదు కానీ, చివరికొచ్చేటప్పటికి ప్రధానంగా ప్రాముఖ్యం, ఔచిత్యం, సమతౌల్యం అనేవి లెక్కలోకి వస్తాయి.

కనుక టీవీ వాళ్లకు నేను చెప్పేదేమిటంటే, దయచేసి మీరు సినిమా తారలు, క్రికెటర్ల పట్ల మీకున్న మక్కువను వదులుకోండి. 'బ్రేకింగ్ న్యూస్' కోసం మీ పరుగులను ముగించండి; బదులుగా కచ్చితత్వం పైన, విశ్లేషణ మీద దృష్టి పెట్టండి; మరీ ముఖ్యంగా... సాగతీతల్ని ఆపేయండి. ఏ వార్తా కథనానికైనా తన సహజమైన నిడివి ఉంటుంది. కేవలం ప్రసార సమయాన్ని భర్తీ చేయడానికి ఆ నిడివిని పొడిగించుకుంటూ పోకండి. గుర్తుంచుకోండి. మేము పెద్దవాళ్లం; మమ్మల్ని పిల్లల్లా చూడకండి; మేము తరచు పిల్లల్లా స్పందిస్తున్నా కూడా





అలాగే, మన యాంకర్లకు ఎవరైనా చర్చల లక్ష్యం జనం మధ్య గొడవలు సృష్టించడం కాదని చెప్పగలరా... ఆ జనం ఒకవేళ గొడవలకు సిద్ధంగా ఉన్నప్పటికీ! చర్చ అనేది ప్రజాభిప్రాయాన్ని రాబట్టేందుకు... అది కూడా ఒక వివేచనతో, వీలైతే తక్కినవారికి భిన్నంగా, పూర్తిగా తమదైన ప్రత్యేకతతో ఉండాలనీ... చర్చకు వచ్చిన అతిథులు తమతో ఏకీభవించేలా యాంకర్లు వారిపై మాటల బల ప్రయోగం చేయకూడదనీ వీక్షకులుగా ఈ కొత్త సంవత్సరంలో మనం ఆశపడదాం.

చివరిగా, మనమంతా ప్రతిజ్ఞ చేయవలసిన అవసరం ఉన్న విషయం – సురక్షితంగా వాహనం నడపడం. పద్ధతిగా, తెలివిడిగా నడపాలి. వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు రద్దీని దాటేందుకు వేరే వైపు మళ్లకండి. ఎర్ర రంగు పడటానికి ముందు ఆరెంజి రంగులోకి సిగ్నల్ మారినప్పుడు మీ అదృష్టంపై నమ్మకంతో జంక్షన్‌లో మీ వాహనాన్ని ముందుకు దూకించకండి. ఇంకొక సంగతి, మీరు మీ కారును పార్క్ చేస్తున్నప్పుడు వేరొకరి గేటుకు కానీ, తోవకు కానీ అడ్డంగా నిలుపుతున్నారేమో గమనించండి. ఇక మన డ్రైవింగ్ ఎలా ఉండాలనే దానికి ఎల్లవేళలా వర్తించే సాధారణ నియమం – రోడ్డుపై మీరే కాకుండా ఇంకా చాలామంది వాహనం నడుపుతూ ఉంటారు కనక – రోడ్డుపై మీకున్నంత హక్కే వారికీ ఉంటుందని గ్రహించడం!

మరీ పాత సంగతి కాదు కానీ, సిగరెట్ తాగడం మొదలుపెట్టాలని నాకొక కొత్త సంవత్సర తీర్మానం ఉండేది. గడియారం సరిగ్గా రాత్రి పన్నెండు కొట్టగానే నా వేళ్ల మధ్య సిగరెట్ వెలుగుతుండేది. మర్నాడు సాయంత్రమంతా ఉమ్మడం, దగ్గడం! 'సిగరెట్ తాగకపోవడం' అనే వ్యసనాన్ని దూరం చేసుకోడానికి నేను ఎంచుకున్న మార్గం అది. అయితే జనవరి చివరినాటికి నా తీర్మానం పట్టు సడలిపోయేది. అది వ్యసనంగా మారుతుందేమోనన్న భయం నా చేత సంతోషంగా సిగరెట్ మాన్పించేది. అలా నేను దానికి దూరంగా ఉండటం జరిగేది.

ఈ సంవత్సరం నేను మరింత పెద్ద సవాలును స్వీకరిస్తున్నాను. టీవీలో ఇంటర్వ్యూ ఇచ్చేందుకు వచ్చే నా అతిథులకు అంతరాయం కలిగించడాన్ని మానుకోవాలని నిర్ణయించుకున్నాను. బదులుగా, వారిని తమ ఊకదంపుడుకు, అదే పనిగా మాట్లాడేందుకు అనుమతిస్తాను. వాళ్లేం మాట్లాడినా, మాట్లాడవలసిన దానిని వాళ్లసలే మాట్లాడకపోతున్నా – మీరు, మిగతా వీక్షకులు అరచి నిరసన తెలియజేసే వరకు వాళ్లకు అడ్డుతగలనే తగలను. 'వద్దు కరణ్, మీరు మీ పాత భౌభౌమనే రాట్‌వైలర్ జాతి శునకం స్టైల్‌కి వచ్చేయండి' అంటూ తొలి విజ్ఞాపన పత్రం నాకు అందినప్పుడు మాత్రమే నేను ఎప్పటిలా నా పాత శైలికి వచ్చేస్తాను.

మరి అలాంటి విజ్ఞాపన పత్రం ఒకటి ఎప్పటికీ రాకపోతే? మా ప్రియమైన పోస్ట్‌మ్యాన్ నేను ఎదురు చూసే క్రిస్మస్, న్యూ ఇయర్ కార్డులన్నిటినీ ఎక్కడో తారుమారు చేసి ఉండొచ్చని అనుకోవాలి. ఏ సంగతీ ఏదో ఒక విధంగా త్వరలోనే మీకు తెలుస్తుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

శక్తికి మించి...



మాల్దీవులు ఎంత శక్తిమంతమైన దేశం అంటే, 1988లో కేవలం 100 గన్‌మెన్లకు అది లొంగిపోయింది. దాన్ని కాపాడటానికి ఇండియన్ ఆర్మీ, నేవీ ఆపరేషన్ కాక్టస్ చేపట్టవలసి వచ్చింది. టూరిజంలో ఆరోగ్యకరమైన పోటీ మంచిదే గానీ మాల్దీవుల ర్యాడికల్స్ తమ మాటలను గమనించుకుంటే మంచిది.

– దివ్య కుమార్ సోథీ, భద్రతాంశాల విశ్లేషకుడు

ఇలా అయితే...



పొద్దున పార్కులో కొందరు పిల్లలు ఆడుతుంటే, ఇంటికెళ్లి చదువుకోవచ్చు కదా అన్నాను. ఓ 8–9 ఏళ్ల పిల్లాడు మేమంతా ఇంట్లోనే చదివామని చెప్పాడు. దేశానికి రాష్ట్రపతి ఎవరు అని అడిగాను. డాక్టర్ జవహర్‌లాల్ నెహ్రూ అన్నాడు. వాళ్ల తండ్రికి ఈ విషయం చెప్పాను. పరిస్థితి బాలేదు అన్నాడు. పిల్లాడిది కాదు, మీది బాలేదు అన్నాను.

– ఎస్.సి. ఆస్థానా, మాజీ పోలీస్ అధికారి

సింపుల్ ప్లాన్



నాకు తగిన బరువు తగ్గే దినచర్య ఇన్నాళ్లకు దొరికింది. ఆగస్ట్ నుంచి 7 కిలోలు తగ్గాను. ఆశ్చర్యకరమైనది – చక్కెర. ఒక్క చక్కెరను పూర్తిగా తొలగించుకున్నందువల్ల నా బరువు తగ్గే ప్రక్రియ వేగవంతమైంది. అలాగే అద్భుతమైన నడక వ్యసనం! రోజుకు 5–6 కిలోమీటర్లు నడవగలనని ఏడాది క్రితం అనుకోలేదు. ఇక, రాత్రి 6:30–7 తర్వాత తినేది లేదంటే లేదు. మొదట్లో కష్టంగా ఉన్నా తర్వాత అలవాటవుతుంది.

– రీతూపర్ణా ఛటర్జీ, జర్నలిస్ట్

అసలు పెట్టుబడి



ఉసేన్ బోల్ట్ 3 ఒలింపిక్స్‌లో 8 బంగారు పతకాలు గెలుచుకున్నాడు. ట్రాక్ మీద 115 సెకన్ల కంటే తక్కువ సమయం పరుగెత్తి 11.9 కోట్ల డాలర్లు ఆర్జించాడు. కానీ ఆ 2 నిమిషాల కోసం అతడు 20 ఏళ్లు శిక్షణ పొందాడు.

– ఎరిక్ సోల్‌హెయిమ్, నార్వే మాజీ దౌత్యవేత్త

స్పష్టత కోసం



పాశ్చాత్య దేశాల్లో చర్చికీ, రాజ్యానికీ మధ్య విభజన తప్పకుండా ఉండాల్సింది. భారత్‌లో మతానికీ, తత్వానికీ మధ్య విభజన తప్పకుండా ఉండాల్సింది. మన ఆలోచన స్పష్టంగా ఉండాలంటే, కొన్నింటిని కలపకూడదు.

– జోసెఫ్ టి.నూనీ, థింకర్

ఇన్‌బాక్స్

యుద్ధం అంటే ఉబలాటమా?

ఉత్తర కొరియా అధ్యక్షునికి మతి భ్రమించినట్టు ఉంది. లేకపోతే యుద్ధానికి సిద్ధంగా ఉండండని తమ దేశ రక్షణ వ్యవస్థను ఆదేశిస్తాడా! యుద్ధాలు ఎటువంటి విపత్కర పరిస్థితులను తెస్తాయో, ఆర్థిక వ్యవస్థ ఏ విధంగా దెబ్బ తింటుందో అతడికి తెలియంది కాదు. ఇటీవల ప్రయోగించిన కొన్ని క్షిపణులు విజయవంతం కావడంతో అతడు ఇటువంటి దుందుడుకు పిలుపులకు ఒడిగట్టినట్లు అర్థమవుతోంది. ఇప్పటికే రష్యా– ఉక్రెయిన్, ఇజ్రాయెల్–హమాస్‌ల మధ్య జరుగుతున్న యుద్ధాలు ప్రపంచాన్ని బెంబేలెత్తిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పరిస్థితుల్లో ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ పిలుపు మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఉత్తర కొరియాకు రష్యా, చైనా వంటి అగ్ర దేశాల అండదండలు ఉన్నాయి. అందుకే అది తనకు ఉన్న శక్తి సామర్థ్యాలను అతిగా ఊహించుకొంటూ అమెరికాపై కాలు దువ్వుతోంది. అమెరికాను యుద్ధంలోకి లాగడానికి దక్షిణ కొరియాపై దాడి చేయాలనేది ఉత్తర కొరియా ఎత్తుగడలా ఉంది.

ఇక్కడ కిమ్ ఒకటి గుర్తు పెట్టుకోవాలి. అభేద్యమైన అగ్రదేశం అమెరికాతో పెట్టుకుంటే అది కొరివితో తల గోక్కున్నట్లే అని గ్రహించాలి. కేవలం ప్రమాదకర రసాయన ఆయుధాలు ఉన్నాయనే అనుమానంతోనే ఇరాక్ లాంటి దేశాలను సర్వ నాశనం చేసింది అమెరికా. తనకు అండగా ఉంటాయని భావిస్తున్న రష్యా, చైనాలు అప్పుడూ ఏమీ చేయలేకపోయిన సంగతిని ఉత్తర కొరియా అధ్యక్షుడు గుర్తుపెట్టుకోవాలి. కిమ్ తమ దగ్గర ఉన్న ఆయుధాలను చూసి రెచ్చిపోతున్నట్లు కనిపిస్తోంది. అయితే అమెరికా దగ్గర ఇంతకన్నా శక్తిమంతమైన ఆయుధాలు ఎన్నో ఉన్న విషయం మరచిపోరాదు. అనవసర ప్రకటనలు చేసి అంతర్జాతీయ అశాంతికి తాను కారకుడు కాకూడదు. ఐక్యరాజ్య సమితి కూడా ఉత్తర కొరియా దూకుడుకు కళ్లెం వేయలేకపోతున్నది. రష్యా– ఉక్రెయిన్, ఇజ్రాయెల్–హమాస్‌ల మధ్య జరుగుతున్న యుద్ధాలను ఆపలేని ఐక్యరాజ్య సమితి నిస్సహాయతను గ్రహించాడు కాబట్టే కిమ్ ఇలా దుందుడుకు ప్రకటనలతో ప్రపంచ శాంతికి అవరోధం కల్పిస్తున్నాడు అనిపిస్తుంది. చర్చల ద్వారానే అన్ని సమస్యలూ పరిష్కరింపబడతాయి. విశ్వం శాంతిగా ఉంటుంది. ఆ రోజు కోసం ఎదురు చూద్దాం.

– కనుమ ఎల్లారెడ్డి; ఆస్టిన్, అమెరికా

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

కొత్త ఏడాదిలో ఎదురు చూడాల్సిన ఘటనలు

వేగంగా మారే ప్రపంచంలో రేపు ఏమవుతుందో ఊహించటం కష్టమే, కానీ కొత్త సంవత్సరం యావత్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తున్న కొన్ని సంఘటనలను మోసుకొస్తోంది. అమెరికా, మెక్సికో ఎన్నికలు కావచ్చు; ఒలింపిక్, పారా ఒలింపిక్ పోటీలు కావచ్చు; ఒకేసారి అటు ఫ్లూను, ఇటు కోవిడ్‌ను సమర్థంగా ఎదుర్కోటానికి టీకా తేవటం కావచ్చు; సంపూర్ణ సూర్యగ్రహణం, చంద్రుని మీదకు మనుషుల్ని పంపేందుకు నాసా ప్రయోగం కావచ్చు. అన్నీ ఆసక్తికరమైనవే!

ఏప్రిల్ 8వ తేదీన మెక్సికో, అమెరికా, కెనడాల్లో సంపూర్ణ సూర్యగ్రహణం ఆవిష్కారం అవుతోంది. 2017 ఆగస్టు 21న భూమికి, సూర్యునికి మధ్య చంద్రుడు ప్రవేశించి సూర్యుణ్ణి కప్పేసింది. 1918 జూన్ 8న కూడా ఇలాంటి అనుభవమే ఎదురైంది. మళ్లీ 2044 దాకా అమెరికన్ ప్రజలకు ఇలాంటి అవకాశం దక్కదని నిపుణులు చెబుతున్నారు. నాసాకు చెందిన 'ఆర్టెమిస్ 2' మిషన్ చంద్రుని మీదకు నవంబర్‌లో నలుగురు వ్యోమగాములను పంపుతోంది. 1972లో అపోలో ఆర్టెమెస్ 2 మిషన్ తర్వాత నాసా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.

ఆరోగ్యం, వైద్య రంగాల్లో కొన్ని పరిణామాలను చూద్దాం. కరోనా కొత్త వేరియంట్లు పుట్టుకొస్తూనే ఉంటాయి. ఇది పూర్తిగా అంతరించిపోయే పరిస్థితులు ఇప్పట్లో లేవనేది కఠిన వాస్తవం. దీర్ఘకాలం కొనసాగే కోవిడ్ కోడ్‌ను విచ్ఛిన్నం చేసే కొత్త వ్యాక్సిన్ల కోసం శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తున్నారు. ఒకేసారి అటు ఫ్లూను, ఇటు కోవిడ్‌ను సమర్థంగా ఎదుర్కోగల టీకా రూపు దిద్దుకుంటోంది. ఇది ఈ ఏడాదే మార్కెట్లో వచ్చే అవకాశం ఉందంటున్నారు. ప్రతి సంవత్సరం లక్షల మంది ప్రాణాలను బలిగొంటున్న మలేరియాను నివారించేందుకు పలు ఆఫ్రికా దేశాలలో యాంటీ వైరల్ వ్యాక్సిన్‌ల పంపిణీకి సన్నాహాలు చేస్తున్నారు. 'ఆర్21/మ్యాట్రిక్స్–ఎం' ఇంతకు ముందు ఉన్న వ్యాక్సిన్ కంటే సమర్థంగా పనిచేస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే సర్టిఫై చేసింది. బ్రెజిల్‌లో 'నాన్ ప్రాఫిట్ వరల్డ్ మస్కిటో ప్రోగ్రామ్' ప్రారంభమవుతోంది. ఇందులో పట్టణ ప్రాంతాల్లో మాడిఫైడ్ మస్కిటోలను విడుదల చేస్తారు. ఈ దోమలు బ్యాక్టీరియాను కలిగి ఉంటాయి. అవి వైరస్ వ్యాప్తి కాకుండా అడ్డుకుంటాయి. దీని ప్రభా వంతో డెంగ్యూ లాంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి ప్రజలు తప్పించుకోవచ్చు.

ఈ ఏడాది క్రీడారంగంలో సమ్మర్ ఒలింపిక్స్, ప్యారిస్‌లో నిర్వహించే పారా ఒలింపిక్స్ ప్రముఖమైనవి. బ్రేక్ డ్యాన్సింగ్ అనేది క్రీడగా తెరముందుకొస్తోంది. స్త్రీ పురుష క్రీడాకారులు సమాన సంఖ్యలో పోటీపడతారు. అమెరికా ఎన్నికల కంటే మెక్సికో ఎన్నికలను ప్రపంచదేశాలు ఆసక్తిగా చూస్తున్నాయి. చరిత్రలో మొట్టమొదటిసారిగా ఇద్దరు మహిళలు అధ్యక్ష స్థానానికి పోటీ పడుతున్నారు. అమెరికాలో 81 ఏళ్ల ప్రస్తుత అధ్యక్షుడు



బైడెన్ డెమోక్రటిక్ అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. నవంబరు 24 ఎన్నికల్లో ఆయన గెలిచి అధికారం చేపట్టి నాలుగేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేయగలిగితే, అధ్యక్ష ఎన్నికల్లో గెలిచిన అతి పెద్ద అమెరికన్ అవుతారు. రిపబ్లికన్ల తరఫున మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పోటీ పడుతున్నారు. గత ఎన్నికల్లో ఓటమిని ఎదుర్కోవటానికి ఆయన చేసిన ప్రయత్నాల కారణంగా ఫెడరల్, స్టేట్ క్రిమినల్ ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ట్రంప్‌తో పాటు ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిసాంటిస్, మాజీ అమెరికన్ రాయబారి నిక్కీ హేలీ, వివేక్ రామస్వామి తదితరులు కూడా రేసులో ఉన్నా, నిక్కీ హేలీకి అవకాశం ఉందన్న ప్రచారం ఉంది. ఇక పోతే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమయిన భారత్ లోనూ మార్చి, ఏప్రిల్‌లో ఎన్నికలు ఉంటాయి. మరోవైపు అధిక జనాభా, ఒత్తిడి, పర్యావరణ ప్రభావం తదితర పరిణామాల కారణంగా ఇండోనేషియా తన రాజధానిని మార్చాలని నిర్ణయించింది. వరద ప్రభావానికి గురవుతూ సముద్రంలోకి జారుతున్న జకార్తాకు బదులుగా బోర్నియాలోని అటవీ ప్రాంతాన్ని ఎంచుకుంది. దీనికి 'నూసాంతర' అని పేరు పెట్టారు. 2019లోనే రాజధాని మార్పు ప్రారంభమైనా, అది 2024లో ఒక రూపాన్ని సంతరించుకుంటుందని భావిస్తున్నారు.

ఇకపోతే ఫేస్ బుక్ (మై స్పేస్) 20వ వార్షికోత్సవాన్నీ, అమెజాన్ 30వ వార్షికోత్సవాన్నీ జరుపుకుంటున్నాయి. పౌరహక్కుల చట్టానికి 60 ఏళ్లు, వింటర్ ఒలింపిక్స్‌కు 100 ఏళ్లు, ఈఫిల్ టవర్‌కు 135 ఏళ్ళు వస్తాయి. వాషింగ్టన్ లోని నేషనల్ ఆర్ట్ గ్యాలరీ, ప్యారిస్ లోని ముస్సే డీఓర్సెల 150 సంవత్సరాల వేడుకకు ఏర్పాట్లు చేస్తున్నారు. 130 మంది రీనాయిర్, మొనట్, డేగస్ లాంటి ప్రసిద్ధ వ్యక్తుల 130 చిత్రాలను ప్రదర్శించనున్నారు. 'ప్యారిస్ 1854 ఇంప్రెషనిస్టు మూవ్‌మెంటు'ను రెండు మ్యూజియమ్‌లలో ప్రదర్శించనున్నారు.

ద్రవ్యోల్బణం నెమ్మదించటం, స్టాక్ మార్కెట్ ఊపు అందుకోవటం తదితర కారణాల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. ఇది ఆశావహ పరిణామంగా చెప్పుకోవాలి. జెన్నీఫర్ లోపెజ్ 20 ఏళ్ల తర్వాత ఓ కొత్త ఆల్బమ్‌ను విడుదల చేస్తోంది.


ఈ ఏడాది గేమర్స్ అందరూ 'ఫైనల్ ఫ్యాంటసీ' పైన ఆసక్తి చూపుతున్నారు. ఈ రంగంలో నిష్ణాతునిగా పేరు గాంచిన జెఫ్ మింటర్... కొత్తగా 40 గేమ్స్‌ను ప్రవేశ పెడుతున్నారు. ఈ ఏడాది లీపు సంవత్సరం... అంటే తెలుసుగా... ఫిబ్రవరిలో 29వ తేదీ కూడా ఉంటుంది. ప్రతి నాలుగేళ్లకోసారి వచ్చే ఈ సందర్భం ఫిబ్రవరి 29న పుట్టిన వ్యక్తులకు పండగే. హ్యాపీ బర్త్ టూ యూ!

– డాక్టర్ పార్థసారథి చిరువోలు
సామాజిక విశ్లేషకుడు

గెలుపు సూత్రం

'ది ఐడియల్ వర్షిపర్, వైల్ నాట్ నెగ్లెక్టింగ్ హిజ్ డ్యూటీ విల్ ప్లే హిజ్ పార్ట్, సెట్టింగ్ రిజల్ట్ ఎసైడ్' అంటుంది గీతను గూర్చి 'వరల్డ్ సివిలైజేషన్' అనే పుస్తకం. మనిషి ఏ పని ప్రారంభించినా 'గెలుపు' కోసమే అనుకుంటే, ఆ పరుగులో పని చేసే విధానం కూడా ప్రధానాంశమే కదా!' చేస్తున్న పనిని 'బాధ్యత మర్చిపోకుండా' నిర్వహిస్తూ 'ఆనందం' పొందమనే గీతాచార్యుని బోధ.

మనిషి జీవితంలో గెలుపునకు అంత ప్రాధాన్యం ఉందా? దానికోసం 'తపన, తాపత్రయం అవసరమా' అని ప్రశ్నించేవారు ఉన్నారు. అవసరమైన (కొత్త) పనిని ప్రారంభించే ముందు 'గెలుపే' కదా ప్రాధాన్యం. అయితే ఇందులో ఆనందం పొందుతూ చేయడం అనేది ప్రధానం. మహాభారత యుద్ధంలో అర్జునుడు క్షత్రియుడు. 'యుద్ధం' (పని) చేస్తేనే 'రాజ్యం' (విజయం) లభిస్తుంది. ఆ సమయంలో అతను ఆనందాన్ని (యుద్ధ కోరిక) చంపేసుకున్నాడు. పిరికితనం, భయం (తన వారనే వ్యామోహం) అతనిని ఆవహించాయి. కార్యోన్ముఖుణ్ణి చేశాడు కృష్ణుడు. అర్జునుడు నడుం బిగించాడు. విజేతగా నిలిచాడు. ప్రతీ మనిషి జీవితంలో ఇందు కోసమే గీతను జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలి.



సంపాదన వేటలో గెలుచుకుంటూ పోతున్న వ్యక్తి వెనుకకు తిరిగి చూసుకుంటే ఓ 'అస్పష్ట విజయం' అతనిని నిరాశలా కమ్మేస్తుంటుంది. అంతిమ లక్ష్యం 'ఆత్మహత్య' అనుకుంటున్నారు. కానీ... ఒక్కసారి 'గీత'ను చేతిలోకి తీసుకొని పేజీలను తిప్పితే పరిష్కారం బోధపడుతుంది.

'గీ' అంటే త్యాగం. 'త' అంటే తత్వ జ్ఞానం. ఈ రెండిటిని బోధించేదే 'గీత'. భగవద్గీత 'కర్మ' సిద్ధాంతాన్ని కానీ, కర్మ సన్యాసాన్ని కానీ చెప్పదు. కర్మఫల త్యాగం గురించి చెబుతుంది. తెలుసుకోవాలనుకునే వారికి 'కావలసినంత' జ్ఞానామృతం 'గీత'లో ఉంది. మనిషి జనన మరణాల మధ్య కాలాన్ని ఆద్యంతం 'ఆనందం'గా, చిద్విలాసంగా, 'విజయవంతంగా' పూర్తి చేసుకునేందుకు అనేకానేక వ్యక్తిత్వ కోర్సు సూత్రాలు ఇందులో ఉన్నాయి. మనిషి తన గొప్పతనాన్ని గుర్తించినంతగా, బలహీనతలను గుర్తించడు. అలా తెలుసుకొని 'మేలుకోమని' 'గీత' చెబుతుంది.

– భమిడిపాటి గౌరీశంకర్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: బ.ద్వాదశి రా.9.17 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: అనూరాధ రా.7.58 వరకు, తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: రా.1.36 నుండి 3.12 వరకు, దుర్ముహూర్తం: ప.12.29 నుండి 1.17 వరకు, తదుపరి ప.2.43 నుండి 3.31 వరకు, అమృతఘడియలు: ఉ.9.13 నుండి 10.51 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.34, సూర్యాస్తమయం: 5.32.

క్లుప్తంగా...

ట్రస్మా రాష్ట్ర అధ్యక్షునిగా మధుసూదన్



ట్రస్మా నూతన కమిటీ అధ్యక్షుడు మధుసూదన్ తదితరులకు సన్మానం

అంబర్‌పేట (హైదరాబాద్): తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షునిగా సాదుల మధుసూదన్ ఎన్నికయ్యారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) సర్వసభ్య సమావేశం జరిగింది. యాదగిరి శేఖర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ట్రస్మా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా సాదుల మధుసూదన్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రమేష్‌రావు, కోశాధికారిగా రాఘవేందర్ రెడ్డి ఎన్నికయ్యారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శివరాత్రి యాదగిరి, అధికార ప్రతినిధిగా జయసింహా గౌడ్, కన్వీనర్‌గా రమణారావు, ముఖ్య సలహాదారుగా నారాయణ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

- టీయూడబ్ల్యూజే–హెచ్143 రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాలలో పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యతో పాటు, రూ.10 లక్షల ఆరోగ్య భద్రత కల్పించే హెల్త్‌కార్డు విషయమై ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేద్దామని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే–హెచ్143) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ అన్నారు. ఉప్పల్ భగాయత్‌లో ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలపై ప్రస్తుత ప్రభుత్వంతో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని టీయూడబ్ల్యూజే–హెచ్143 రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానించింది. రాష్ట్రంలోని 33 జిల్లాలనుంచి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గం పాల్గొన్న సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతి సాగర్, ఉపాధ్యక్షులు రమేష్ హజారే, బీఆర్ లెనిన్, అబ్దుల్లా, ఆదినారాయణ, తెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ కుమార్, ఐజేయూ జాతీయ కార్యదర్శి రాజమౌళి చారి, కార్యవర్గ సభ్యుడు అవ్వారీ భాస్కర్ హాజరయ్యారు.

టెమ్జు రాష్ట్ర అధ్యక్షునిగా విష్ణువర్ధన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: 20 ఏళ్లుగా టీవీ రంగంలో వివిధ హోదాల్లో పనిచేసిన ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన మెదక్ ఉమ్మడి జిల్లా టీయూడబ్ల్యూజే నాయకునిగా కొనసాగుతున్నారు. ఆయనతోపాటు టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారిగా పి.యోగానందం ఎన్నికయ్యారు. ఆయన ఇప్పటివరకు హైదరాబాద్ అధ్యక్షునిగా పనిచేశారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

- 26 మంది ప్రయాణికులకు గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం



చెట్టును ఢీకొన్న బస్సు

హసన్‌పర్తి: వరంగల్ నుంచి సిరిసిల్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పడంతో 26 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, మరో 23 మందికి స్వల్ప గాయాలయ్యాయి. కరీంనగర్–1 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదివారం సాయంత్రం వరంగల్ నుంచి సిరిసిల్ల వైపు 55 మంది ప్రయాణికులతో బయల్దేరింది. 7.30 గంటల సమయంలో హసన్‌పర్తి పెద్ద చెరువు వద్ద ముందు ఆగి ఉన్న బస్సును తప్పించే క్రమంలో అదుపు తప్పి తాటి చెట్టుకు ఢీకొంది. ఈ ఘటనలో 26 మంది గాయపడ్డారు. వీరిలో ఒక గర్భిణీతోపాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, ఎస్సై అశోక్ ప్రమాద స్థలానికి చేరుకుని గాయపడిన గర్భిణీతోపాటు మరో ఇద్దరిని అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అనంతరం మరో రెండు 108 అంబులెన్స్‌లలో క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకెళ్లారు. గాయపడిన వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

సాహితీ ఇన్‌ఫ్రా బురిడీ రూ.1,110 కోట్లు!

సొమ్మంతా వ్యక్తిగత అవసరాలకు వినియోగం

- క్రైమ్స్ జాయింట్ సీపీ వెల్లడి
- ప్రీలాంచ్ పేరుతో జనాల నుంచి వసూలు
- 9 ప్రాజెక్టులకు సంబంధించి 2,728 మంది బాధితులు

సాక్షి, హైదరాబాద్: ప్రీలాంచ్ పేరుతో సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా (ఎస్ఐవీఐపీఎల్) ప్రజల నుంచి వందల కోట్లు వసూలు చేయడంపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సాహితీ ఇన్‌ఫ్రా సుమారు 2,728 మంది బాధితుల నుంచి రూ.1,110 కోట్లు వసూలు చేసినట్లు తేలింది. హైదరాబాద్ జాయింట్ సీపీ (క్రైమ్స్) ఏవీ రంగనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో ఈ వివరాలు వెల్లడించారు. నగరంలోని అమీన్‌పూర్, నానక్‌రాంగూడ, మాదాపూర్, కొంపల్లి, బంజారాహిల్స్, నిజాంపేట, బాచుపల్లి వంటి ప్రాంతాలలో 9 నివాస, వాణిజ్య ప్రాజెక్టులను నిర్మిస్తున్నామని కొనుగోలుదారులను మాయమాటలతో నమ్మించినట్టు బయటపడింది. అసలు భూములను కొనుగోలు చేయకుండానే, నిర్మాణ అనుమతులు తీసుకోకుండానే ముందస్తుగా డిపాజిట్లు వసూలు చేసినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో సాహితీ ఇన్‌ఫ్రాపై హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్లతో పాటు మెదక్ జిల్లాలోని పలు ఠాణాలలో మొత్తం 50 కేసులు నమోదు కాగా.. ఇప్పటికే సంస్థ ఎండీ బూదాటి లక్ష్మీనారాయణ సహా 22 మందిని అరెస్టు చేశారు.

ఒక ప్రాజెక్టు సొమ్ముతో అనేకం..: టీఎస్‌–రెరా నిబంధనల ప్రకారం ఒక ప్రాజెక్టులో కస్టమర్ల నుంచి వసూలు చేసిన సొమ్మును ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతా తెరిచి అందులో డిపాజిట్ చేయాలి. ఆ ప్రాజెక్టు నిర్మాణ పనులకు మాత్రమే వాటిని వినియోగించాలి. కానీ లక్ష్మీనారాయణ శార్వాణి ప్రాజెక్టులో ప్రీలాంచ్ విక్రయాల కింద జనాల నుంచి వసూలు చేసిన రూ.504 కోట్ల సొమ్మును ఇతర ప్రాజెక్టులకు మళ్లించాడు. ఈ ప్రాజెక్టుల నుంచి కూడా రూ.కోట్లలో డబ్బు వసూలు చేసిన నారాయణ.. ఒక్కటంటే ఒక్కప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదు. శార్వాణి ఎలైట్ ప్రాజెక్టు కంటే ముందు సాహితీ సంస్థ మూడు ప్రాజెక్టులను ప్రారంభించింది. మాదాపూర్‌లోని గుట్టల బేగంపేటలో కార్తికేయ పనోరమ, మాదాపూర్‌లో కృతి బ్లోసమ్, మోకిలాలో సుధీక్ష ప్రాజెక్ట్‌లను పూర్తి చేసేందుకు ఎలైట్ ప్రాజెక్ట్ పేరుతో డిపాజిట్లను సేకరించాడు.

అమీన్‌పూర్‌లో కొనుగోలు

అమీన్‌పూర్ గ్రామంలోని సర్వే నంబరు 343లో ఉన్న 23 ఎకరాలలో 18 ఎకరాలు ఫీనిక్స్ కంపెనీలో జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ (జేడీఏ) కింద ఉండగా.. మిగిలిన ఐదెకరాలలో రెండు ఎకరాలు ఓమిక్స్ గ్రూప్, మూడు ఎకరాలను సాహితీ సంస్థ నేరుగా భూ యజమానుల నుంచి కొనుగోలు చేసింది. ఇందులోనే సాహితీ శార్వాణి ఎలైట్ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నామని, 10 టవర్లు ఒక్కోటి 32 అంతస్తులలో ఉంటుందని కస్టమర్లను నమ్మించారు. 2019–22 మధ్య కాలంలో నిర్మాణ పనులను పూర్తి చేయకుండానే దాదాపు 1,752 మంది కొనుగోలుదారుల నుంచి రూ.504 కోట్లు వసూలు చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న జాయింట్ సీపీ రంగనాథ్

ఏ ప్రాజెక్టులో ఎంత వసూళ్లంటే..

ప్రాజెక్టు పేరు	ప్రాంతం	కస్టమర్ల సంఖ్య	సొమ్ము (రూ.కోట్లలో)
శార్వాణి ఎలైట్	అమీన్‌పూర్	1,752	504
స్వధా	నానక్‌రాంగూడ	69	65
శిష్టా అడోబ్	కొంపల్లి	248	79
గ్రీన్	కొంపల్లి	153	40
రోలింగ్ హిల్స్	గచ్చిబౌలి	269	135
మహితో సెంట్రో	బంజారాహిల్స్	44	22
ఆనంద్ ఫార్ట్యూన్	నిజాంపేట	120	50
సుధీక్ష	మోకిలా	30	22
రూబీకాన్	బాచుపల్లి	43	6.9

రెండు పులుల మధ్య కొట్లాట

- ఆడ పులి మృతి
- కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజన్ పరిధిలో ఘటన
- సీసీఎఫ్ శాంతారాం వెల్లడి



ఘటనాస్థలంలో విచారణ జరుపుతున్న అటవీశాఖ అధికారులు

కాగజ్‌నగర్ రూరల్: రెండు పులులు పరస్పరం దాడి చేసుకున్న ఘటనలో ఓ ఆడ పులి మృతి చెందింది. కుము రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలో ఈ సంఘటన జరిగింది. చీఫ్ ఫారెస్టు కన్జర్వేటర్ శాంతారాం ఆదివారం మీడియాకు ఈ వివరాలు వెల్ల డించారు. నాలుగు రోజుల క్రితం రెండు పులులు పరస్పరం దాడికి దిగాయని, ఓ పశువుల కాపరి తమకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టామని తెలిపారు. ఈ ఘటనలో సుమారు రెండు సంవత్సరాల వయసున్న ఆడ పులి మృతి చెందిందన్నారు. 200 మీటర్ల విస్తీర్ణంలో పులుల మధ్య కొట్లాట జరిగినట్లు ఆనవాళ్లను గుర్తించామని వివరించారు. మృతి చెందిన పులికి సంబంధించిన శాంపిళ్లను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపిస్తున్నామని చెప్పారు. రిపోర్టు రాగానే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. విషప్రయోగం వల్ల పులి మృతి చెందిందనే ఆరోపణలు సరికావన్నారు. సాధారణంగా ఒక పులి ఆవాసం ఉండే ప్రాంతంలోకి మరో పులి వచ్చినప్పుడు ఘర్షణ జరుగుతుందని తెలిపారు. ఈ తరహా ఘర్షణతోనే పులి మృతిచెందిందని శాంతారాం వెల్లడించారు.

తమ్ముడా.. నీతోనే నేను

- తమ్ముడి మృతిని తట్టుకోలేక.. ఆగిన అక్క గుండె
- తండ్రి మరణాన్ని తట్టుకోలేక కూతురి మృతి



ఇబ్రహీం



మోదీన్ బీ

మహబూబాబాద్ రూరల్/జడ్చర్ల: తమ్ముడి మరణాన్ని తట్టుకోలేక అక్క గుండె ఆగిపోతే... తండ్రి మరణవార్త విన్న కూతురు కన్నుమూసింది. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఈ విషాదాల వివరాలివి. మహబూబాబాద్ మండల పరిధి పర్వతగిరికి చెందిన ఎం.డి.ఇబ్రహీం (72) అనారోగ్యంతో శనివారం మధ్యాహ్నం ఇంటివద్ద మృతి చెందారు. అదే గ్రామంలోనే ఉంటున్న ఇబ్రహీం అక్క షేక్ మోదీన్ బీ (75) వెంటనే తమ్ముడి ఇంటికి చేరుకుని మృతదేహంపై పడి రోదించారు. కొద్దిసేపట్లోనే ఆమె గుండెపోటుకు గురై తమ్ముడి మృతదేహంపై పడిపోయారు. గమనించిన బంధుమిత్రులు ఆమెను కదిలించే ప్రయత్నం చేయగా స్పందన లేకపోవటంతో ప్రథమ చికిత్స చేశారు. అనంతరం వైద్యానికి మహబూబాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అక్కాతమ్ముడి మృతదేహాలకు నివాళులర్పించారు.

నాన్న ఇక లేడని..



దామోదర్



సునీత

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని సత్యనారాయణస్వామి కాలనీలో నివసిస్తున్న టూరిస్టు ట్రావెల్ నిర్వాహకుడు దామోదర్ (72) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. జడ్చర్లలోని శ్రీసాయినగర్ కాలనీలో నివసిస్తున్న అతని కూతురు సునీత (49) విషయం తెలుసుకుని తండ్రి ఇంటికి వెళ్లి బోరున విలపించింది. ఈ క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. సునీత నారాయణపేట జిల్లా మక్తల్ రుద్రసముద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని. సునీతకు భర్త శ్రీనివాసులు, ఒక కూతురు ఉన్నారు.

జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గం



జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ యూనిట్ నూతన కార్యవర్గం

లక్డీకాపూల్ (హైదరాబాద్): తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ అధికారుల సంఘం హైదరాబాద్ యూనియన్ అధ్యక్షునిగా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బిలావత్ కాశ్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సైఫాబాద్‌లోని అటవీ భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ నూతన కార్య వర్గాన్ని ఎన్నుకుంది. ఉపాధ్యక్షునిగా ఎఫ్‌బీవో సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎఫ్ఎస్‌వో నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగేంద్రబాబు, జాయింట్ సెక్రటరీగా ఎఫ్‌బీవో ఎం.సునీత, కోశాధికారిగా ఎఫ్‌బీవో ఎండి యూసుఫ్‌లు ఎన్నికయ్యారు.

ఉరివేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

- రంజోల్ గురుకుల పాఠశాలలో ఘటన



స్వప్న మృతదేహం

జహీరాబాద్ టౌన్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని రంజోల్ గురుకుల పాఠశాలలో ఉరివేసుకొని ఓ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు, గురుకుల అధికారుల కథనం ప్రకారం.. మండలంలోని తుంకుంట గ్రామానికి చెందిన బ్యాగరి రాజు కుమార్తె స్వప్న (17) రంజోల్ బాలికల సాంఘిక సంక్షేమ గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆదివారం తోటి విద్యార్థులతో కలిసి స్టడీ క్లాస్‌కు హాజరైంది. తరగతి గదిలో స్నేహితులు ఆమెతో జోక్ చేయడంతో బుక్ తెచ్చుకుంటానని హాస్టల్‌లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్వప్న ఎంతకూ తిరిగి రాకపోవడంతో తోటి విద్యార్థులు గదిలోకి వెళ్లిచూడగా ఆమె ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. విషయం ఉపాధ్యాయులకు చెప్పడంతో ఆమెను కిందకు దించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందింది. కాగా, స్వప్న మృతి పట్ల తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి గేటు ముందు ఆందోళనకు దిగారు. స్వప్న మృతిపై న్యాయ విచారణ జరపాలని, ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ. 50 లక్షల పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

వైభవంగా కొమురవెల్లి మల్లన్న కళ్యాణం

- ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు సురేఖ, పొన్నం
- వివిధ రాష్ట్రాలనుంచి వేలాది మంది భక్తుల రాక
- వచ్చే ఏడాదికి అమ్మవార్లకు బంగారు కిరీటాలు: కొండా సురేఖ



మల్లన్న కళ్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో వస్తున్న మంత్రులు పొన్నం, కొండాసురేఖ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొమురవెల్లిలో మల్లికార్జున స్వామి కళ్యాణం ఆదివారం అంగరంగా వైభవంగా జరిగింది. స్వామివారి కళ్యాణ వేడుకలను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కళ్యాణ వేదికతో పాటు పరిసర ప్రాంతాలు మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. వీరశైవ ఆగమ శాస్త్ర ప్రకారం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని పీఠాధిపతి సిద్ధలింగ రాజదేశికేంద్ర శివాచార్యమహాస్వామి ఆధ్వర్యంలో కళ్యాణం జరిగింది. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జనగామ శాసన సభ్యుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. స్వామి వారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ గర్భగుడిలోని స్వామి వారి మూల విరాట్టును దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ స్వామి వారి కృపతో తమ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అములు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిందని అన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ వచ్చే సంవత్సరం జరిగే కళ్యాణం నాటికి మేడలమ్మ, కేతమ్మ అమ్మవార్లకు బంగారు కిరీటాలు చేయించాలని ఆలయ ఈవోను ఆదేశించినట్లు తెలిపారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, మంత్రి సురేఖ కుటుంబ సమేతంగా 'పట్నం 'వేసి కొమురవెల్లి మల్లికార్జున స్వామి మొక్కును తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

న్యాయవాదులు సమాజహితానికి పాటుపడాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్



సమ్మేళనంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్

కరీంనగర్ క్రైం: న్యాయవాదులు సమాజంలో మార్పు కోసం కృషి చేయాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో జస్టిస్ కుమారయ్య లా కాలేజీలో చదివిన న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దీనికి జస్టిస్ వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, న్యాయవాద వృత్తిలో స్థిరపడాలని అనుకునేవారు ప్రతీ సవాలును ఎదుర్కోవాలని అన్నారు. న్యాయవాదులు అణగారిన వర్గాల అభివృద్ధికి, సమాజ చైతన్యానికి తమవంతు చేయూతనివ్వాలని సూచించారు. న్యాయ దృక్పథంతో సమాజహితానికి పాటుపడాలన్నారు. ప్రజలకు సత్వర న్యాయం లభించేలా చూడటం న్యాయవాదుల బాధ్యత అని, జనం న్యాయవ్యవస్థపై విశ్వాసం కోల్పోతే ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదమని పేర్కొన్నారు. అనంతరం న్యాయవాదులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి, న్యాయమూర్తి కె.వెంకటేశ్, జస్టిస్ కుమారయ్య లా కాలేజీ ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ డా.కె.జలజ, డైరెక్టర్ జి.కృష్ణ ప్రసాద్, ఆత్మీయ సమ్మేళన కన్వీనర్ కిరణ్‌కుమార్, సీనియర్ న్యాయవాది ఏవీ.రమణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మరింత 'సహకారం'

- ప్యాక్స్ కేంద్రంగా ఎరువుల నుంచి విత్తనాల దాకా అన్నీ సరఫరా
- వన్ స్టాప్ షాప్ అమలులోకి తెచ్చే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: ఎరువుల నుంచి విత్తనాలు, పురుగుల మందులు ఇలా అన్నీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోనే అందుబాటులోకి రానున్నాయి. రైతులకు అవసరయ్యే సేవలు విస్తరించేందుకు 'వన్‌స్టాప్ షాప్' విధానం తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల కేంద్రప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాస్ (పీఎంకేఎస్‌కే) పథకంలో భాగంగా దీనిని ప్రవేశపెట్టింది. ఇది ఇక్కడ కూడా అమలులోకి వస్తే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను 'వన్‌స్టాప్ షాప్' కేంద్రాలుగా మార్చుతారు.

ఒకేచోట అన్ని సేవలు...

దేశవ్యాప్తంగా లక్ష ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (ప్యాక్స్) ఉన్నాయి. వాటిల్లో 73,098 ప్యాక్స్‌లు ఎరువుల లైసెన్స్ కలిగి ఉన్నాయి. మిగిలిన వాటిని కూడా లైసెన్స్ పరిధిలోకి తీసుకొస్తారు. తెలంగాణలో 1,423 ప్యాక్స్ ఉన్నాయి. అందులో 1,261 చురుగ్గా పనిచేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 16,915 ఎరువుల రిటైల్ దుకాణాలుండగా, 14,870 చురుగ్గా పనిచేస్తున్నాయి. అన్ని ప్యాక్స్‌లను ఎరువుల వ్యాపారంలోకి తీసుకొచ్చి అవన్నీ చురుగ్గా పనిచేసేలా కృషి చేయాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. ప్రస్తుతం ప్యాక్స్‌ల ద్వారా రైతులకు యూరియా, డీఏపీ వంటి ఎరువులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇకనుంచి వాటిల్లో అన్ని రకాల ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా అన్ని రకాల వ్యవసాయ ఉపకరణాలు అందించాలనేదే ఉద్దేశం.

నాణ్యమైన సేవలు అందించవచ్చు

దేశంలో సహకార వ్యవసాయ పద్ధతులు అనుసరించడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని అంటున్నారు. ప్రైవేట్‌లో ఎరువులు, పురుగు మందులు, విత్తన వ్యాపారుల ద్వారా అనేకచోట్ల కల్తీ, నకిలీ రాజ్యమేలుతోంది. ఆ దందాకు చెక్ పెట్టాలంటే 'వన్‌స్టాప్ షాప్' విధానం మేలని కేంద్రం చెబుతోంది. ప్యాక్స్ ద్వారా యూరియా వెళ్లడం వల్ల బ్లాక్ మార్కెట్ జరగకుండా చూసుకోవచ్చు. అంతేగాకుండా కల్తీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు రైతులకు అంటగట్టకుండా నిరోధించవచ్చు. తక్కువ ధరల్లో రైతులకు వ్యవసాయ పనిముట్లు , సేంద్రీయ ఎరువులు కూడా ఇవ్వొచ్చు. భవిష్యత్‌లో ప్యాక్స్ ద్వారానే మార్కెటింగ్ వసతి కల్పించే ఆలోచనలో కూడా ఉన్నారు. దీనిపై పూర్తిస్థాయి అధ్యయనాలు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. అయితే ప్యాక్స్‌ల్లో అనేకం అప్పుల్లో కూరుకుపోయాయని, అవి ప్యాక్స్ రాజకీయాల్లో మునిగిపోవడం వల్ల వాటిల్లో కొన్ని అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నాయన్న చర్చ జరుగుతోంది. వాటిని అన్ని రకాలుగా బలోపేతం చేస్తే 'వన్‌స్టాప్ షాప్' విధానం విజయవంతమవుతుందని అధికారులు అంటున్నారు.

ఆటో డ్రైవర్లకు జీవన భృతి కల్పించాలి

- బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు డిమాండ్



ఇందిరా పార్క్ వద్ద ఆటోడ్రైవర్ల ధర్నా

కవాడిగూడ (హైదరాబాద్): తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 15 వేల జీవన భృతిని ప్రకటించాలని, ఆటో మోటార్ రవాణా కార్మికులకు ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద ఆటోడ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ 'ఆటో డ్రైవర్ల ఆరాటం– ఆకలి కేకల పోరాటం' పేరుతో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, తెలంగాణలో సుమారు 8 లక్షల మంది ఆటో డ్రైవర్లు ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యాన్ని అందిస్తూ ఉపాధి పొందుతున్నారని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల 80 శాతం మంది ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయారని అన్నారు. కుటుంబ పోషణ, నెలవారి వాయిదాల చెల్లింపులు కట్టలేక హైదరాబాద్ నగరంలో సతీశ్‌గౌడ్ అనే ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డారని, దీనితో ఆయన కుటుంబం రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకముందే ప్రభుత్వం ఆటో డ్రైవర్ల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కనీస వేతనాల బోర్డు చైర్మన్ పి.నారాయణ, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బు కోసం ముగ్గురు కన్నబిడ్డల కిడ్నాప్

- జడ్చర్లలో ఓ తండ్రి దుర్మార్గం

జడ్చర్ల: డబ్బు కోసం సొంత పిల్లలనే కన్నతండ్రి కిడ్నాప్ చేసిన ఉదంతం మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో చోటుచేసుకుంది. సీఐ రమేష్ బాబు కథనం ప్రకారం పట్టణంలోని గౌరీశంకర్ కాలనీకి చెందిన రఫీ, హబీబున్నీసా భార్యాభర్తలు. ఆదివారం రఫీ తన ముగ్గురు పిల్లలను మోటార్ సైకిల్‌పై ఎక్కించుకొని వెళ్లి పోయాడు. ఆ తర్వాత భార్యకు ఫోన్ చేసి పిల్ల లను కిడ్నాప్ చేశానని.. తనకు డబ్బు కావాలని డిమాండ్ చేశాడు. దీంతో ఆమె వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు వెంటనే స్పందించి రఫీ ఫోన్‌ను ట్రాక్ చేసి హైదరాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. హైదరాబాద్ పోలీసులు యాకుత్‌పుర రైల్వేస్టేషన్ సమీపంలో రఫీని అదుపులోకి తీసుకోగా పిల్లల వివరాలు తెలియాల్సి ఉంది.

డ్రగ్స్ విక్రేత అరెస్టు

బంజారాహిల్స్: డ్రగ్స్ విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలివీ..మాసబ్‌ట్యాంక్‌లోని ఓ కార్యాలయంలో సిస్టం ఎనలిస్ట్‌గా పనిచేస్తున్న ఉడతల వెంకటేశ్వర్లు సన్‌సిటీలో ఉంటున్నాడు. కొంతకాలంగా జల్సాలకు అలవాటు పడ్డ ఈయన అక్రమంగా డ్రగ్స్‌ను తీసుకువస్తూ అవసరమైన కస్టమర్లకు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఫిలింనగర్ ఎస్ఐ విజయ్‌కుమార్ సంబంధిత పోలీసు సిబ్బందితో కలిసి ఫిలింనగర్‌లోని సినార్‌వ్యాలీ వద్ద డ్రగ్స్‌తో ఉండగా పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. గోవా నుంచి ఈ డ్రగ్‌ను తెప్పించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. తాను డ్రగ్స్ తీసుకోవడమే కాకుండా ఇతరులకు విక్రయించేందుకు కూడా ప్రయత్నిస్తున్నట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది.

క్లుప్తంగా...

80 ఏళ్లొచ్చినా రిటైర్మెంట్‌కు సిద్ధంగా లేరు: పవార్‌పై అజిత్

ముంబై: ఎన్సీపీ నేత, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ తన చిన్నాన్న, సీనియర్ నేత శరద్ పవార్‌నుద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. కొందరు నేతలు 80లు దాటినా రిటైరయ్యేందుకు సిద్ధంగా లేరంటూ ఎద్దేవా చేశారు. ''మహారాష్ట్ర ప్రభుత్వోద్యోగులు 58 ఏళ్లకే రిటైరవుతారు. 75 ఏళ్లు వచ్చేసరికి చాలా మంది వృత్తిగత జీవితంలో చురుగ్గా ఉండటం తగ్గిస్తుంటారు. కానీ, కొందరు మాత్రం 84 ఏళ్లు వచ్చినా విరమణ తీసుకునేందుకు సిద్ధంగా లేరు'' అంటూ థానెలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో అజిత్ చెణుకులు విసిరాన్నారు. ఆయన పలువురు ఎన్సీపీ ఎమ్మెల్యేలతో కలిసి శివసేన–బీజేపీ ప్రభుత్వంలో చేరిన విషయం తెలిసిందే. నేషనలిస్ట్ కాంగ్రెస్ పేరును, ఎన్నికల గుర్తును తనకే కేటాయించాలంటూ కోర్టుకెక్కారు.

మీ సంగతి చూసుకోండి
అఖిలేశ్ వ్యాఖ్యలపై మాయావతి ధ్వజం

లక్నో: బీఎస్పీపై ఇష్టారాజ్యంగా విమర్శలు చేసే ముందుకు ఆత్మపరిశీలన చేసుకోవాలని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌కు మాయావతి సూచించారు. బీఎస్పీని ఇండియా కూటమిలో చేర్చుకుంటారా అని మీడియా ప్రశ్నించగా ఎన్నికల తర్వాత పొత్తులు మార్చే అలవాటున్న మాయావతి పార్టీని ఎవరు నమ్ముతారని అఖిలేశ్ ప్రశ్నించారు. వీటిపై మాయా మండిపడ్డారు. బీజేపీని బలోపేతం చేస్తూ, వారితో అంటకాగుతున్న అఖిలేశ్ ప్రతిష్ట మంటగలిసిందని విమర్శించారు. 2019 ఎన్నికల ముందు, తర్వాత ప్రధాని మోదీని నాటి ఎస్పీ చీఫ్ ములాయం సింగ్ యాదవ్ ఆశీర్వదించారని గుర్తు చేశారు.

కుటుంబీకుణ్ని కొట్టిన బాలుడు...
దారి మళ్లిన విమానం

విన్నీపెగ్: ఎయిర్ కెనడా విమానంలో ఓ 16 ఏళ్ల బాలుడు తమ కుటుంబసభ్యుడిని కొట్టడం ఆ విమానాన్ని దారి మళ్లించేందుకు దారితీసింది. విమానం టొరంటో నుంచి కాల్గరీకి బయలుదేరాక గ్రాండ్ ప్రయరీస్‌కు చెందిన 16 ఏళ్ల బాలుడు తమ కుటుంబానికే చెందిన ఓ వ్యక్తిని తీవ్రంగా కొట్టాడు. వారి గొడవను విమాన సిబ్బంది, తోటి ప్రయాణికులు అడ్డుకున్నారు. గాయపడిన వ్యక్తికి సిబ్బంది చికిత్స అందించారు. ఘటనకు కారణాలు తెలియాల్సి ఉంది. అనంతరం విమానాన్ని విన్నీపెగ్‌కు అధికారులు దారి మళ్లించి, ఆ బాలుడిని అధికారులకు అప్పగించారు. ఇదంతా పూర్తయ్యేవరకు దాదాపు మూడు గంటలపాటు ప్రయాణికులు నిరీక్షించాల్సి వచ్చింది. అనంతరం ఆ విమానం గమ్య స్థానం వైపు బయలుదేరిందని ఎయిర్ కెనడా తెలిపింది.

కార్గిల్‌లో నైట్ ల్యాండింగ్

విజయవంతంగా దిగిన సి-130జే • భారత వాయుసేన అరుదైన రికార్డు

భారత వాయుసేన (ఐఏఎఫ్) అరుదైన ఘనత సాధించింది. సముద్ర మట్టానికి ఏకంగా 10,500 అడుగుల ఎత్తున హిమాలయ పర్వతాలపై ఉన్న కార్గిల్ అడ్వాన్స్‌డ్ ల్యాండ్ గ్రౌండ్‌పై సి-130జే సూపర్ హెర్క్యులస్ రవాణా విమానాన్ని రాత్రి పూట సురక్షితంగా ల్యాండింగ్ చేసింది. దీనికి సంబంధించి వాయుసేన 'ఎక్స్'లో పోస్టు చేసిన వీడియో వైరల్‌గా మారింది. ఐఏఎఫ్ బాహుబలిగా చెప్పే ఈ విమానం పాక్ సరిహద్దులో నియంత్రణ రేఖ(ఎల్‌ఓసీ) సమీపంలోని ఈ ఎయిర్ స్ట్రిప్‌పై రాత్రి సమయంలో దిగడం ఇదే తొలిసారి! గరుడ్ కమాండోలకు శిక్షణలో భాగంగా ఇటీవలే ఈ విన్యాసం నిర్వహించినట్లు వాయుసేన వర్గాలు వెల్లడించాయి. అంతేగాక ఐఏఎఫ్ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించడానికి రక్షణపరంగా వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు వివరించాయి. నిజానికి రక్షణ శాఖలో రవాణా విమానాన్ని ఇలా రాత్రి పూట ల్యాండింగ్ చేయడం అత్యంత అరుదు. కొండలపై ఉన్న రన్‌వేపై భారీ విమానాన్ని క్షేమంగా దించడం అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ. హిమాలయ పర్వతాల్లో వాయుసేన ఆధ్వర్యంలో ఎయిర్‌స్ట్రిప్‌లు సేవలందిస్తున్నాయి. ఎల్ఏసీ సమీపంలో దౌలత్ బేగ్ ఓల్డీ అడ్వాన్స్‌డ్ ల్యాండింగ్ గ్రౌండ్(ఏఎల్‌జీ) సముద్ర మట్టానికి 16,700 అడుగుల ఎత్తులో ఉంది. ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఎయిర్‌ఫీల్డ్ కావడం గమనార్హం. వాయుసేన వద్ద 12 సి-130జే విమానాలున్నాయి. ఇవి సైనికుల తరలింపు, సహాయక సామగ్రి రవాణాలో ఉపయోగపడుతున్నాయి. **- న్యూఢిల్లీ**



మోదీపై మాల్దీవుల మంత్రుల నోటి దురుసు...
సర్వత్రా దుమారం

తీవ్ర నిరసన తెలిపిన కేంద్రం | సినీ తదితర ప్రముఖుల ఖండన | ఊపందుకున్న 'బాయ్‌కాట్ మాల్దీవ్స్'

- ఆ దేశానికి మనోళ్ల హాలిడే ట్రిప్పులు రద్దు
- నష్ట నివారణ చర్యలకు దిగిన మాల్దీవులు
- విమర్శలు చేసిన ముగ్గురు మంత్రులపై వేటు

మాలె/న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై మాల్దీవుల మంత్రుల అనుచిత వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. వాటిపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ, సినీ ప్రముఖులు, సెలబ్రిటీలు ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నారు. కేంద్రం కూడా వాటిపై తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చింది. మంత్రుల వ్యాఖ్యలకు నిరసనగా వేలాది మంది భారత పర్యాటకులు మాల్దీవులకు ప్లాన్ చేసుకున్న హాలిడే ట్రిప్పులను రద్దు చేసుకుంటున్నారు. ఆ దేశ పర్యాటకానికి మన టూరిస్టులే ఆయువుపట్టు. పైగా భారత్‌తో వ్యూహాత్మక బంధం మాల్దీవులకు అత్యంత కీలకం. దాంతో ఈ వివాదంపై ఆ దేశం హుటాహుటిన స్పందించింది. భారత ప్రభుత్వ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ముగ్గురు మంత్రులను సస్పెండ్ చేసినట్లు ఆదివారం ప్రకటించింది. వారి వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగతమని, వాటితో ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టతనిచ్చింది. ''భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రజాస్వామ్యయుతంగా, బాధ్యతాయుతంగా ఉండాలే తప్ప, విద్వేషాన్ని, ప్రతికూల ప్రభావాన్ని కలిగించేలా ఉండొద్దు. అంతర్జాతీయ భాగస్వామ్య దేశాలతో సంబంధాలను దెబ్బతీయొద్దు'' అని పేర్కొంది. మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసేవారిపై కఠిన చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేసింది. సస్పెండైన మంత్రులు మరియం షియునా, అబ్దుల్లా మజూం మజీద్, మల్షా షరీఫ్ అని తెలుస్తోంది.

అసలేమైంది...?

ప్రధాని మోదీ ఇటీవల లక్షద్వీప్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. లక్షద్వీప్‌ను పర్యాటక ధామంగా మార్చాలంటూ ఆ సందర్భంగా ఆయన వీడియో, ఫొటోలు షేర్ చేశారు. అవి ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారాయి. పలువురు నెటిజన్లు లక్షద్వీప్‌ను మాల్దీవులతో పోల్చారు కూడా! దీనిపై మాల్దీవుల మంత్రి షియునా వ్యంగ్యంగా స్పందించారు. మోదీని జోకర్‌గా, తోలుబొమ్మగా పేర్కొంటూ ట్వీట్లు చేశారు. మంత్రులు మజీద్, మల్షా కూడా ఇవే రకమైన వ్యాఖ్యలు చేశారు. పర్యాటకంలో మాల్దీవులతో లక్షద్వీప్ ఏ మాత్రమూ సరితూగదంటూ ఎద్దేవా చేశారు. ''భారత్‌లో హోటల్ గదులు అసహ్యంగా ఉంటాయి. మా దేశంతో లక్షద్వీప్‌కు పోలికేమిటి?'' అంటూ మాల్దీవుల ఎంపీ జహీద్ రమీజ్ కూడా నోరు పారేసుకున్నారు. ఈ వ్యాఖ్యలపై మాల్దీవుల్లోని భారత హైకమిషన్ కార్యాలయం అధికారులు నిరసన తెలిపారు. దుమారం నేపథ్యంలోవారి వ్యాఖ్యలను 'ఎక్స్' నుంచి తొలగించారు. మంత్రుల వ్యాఖ్యలను మాల్దీవుల మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ తీవ్రంగా ఖండించారు. ''భారత్ మనకు కీలక మిత్రదేశం. మాల్దీవుల భద్రత, అభివృద్ధిలో చాలా కీలకం. అలాంటి దేశాధినేతను ఉద్దేశించి నీచమైన భాష వాడటం తగదు'' అన్నారు. ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని కొత్త అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జుకు హితవు పలికారు. ఇంతగా నిరసనలు వ్యక్తమవుతున్నా మరియం మాత్రం ఆన్‌లైన్ వేదికలపై అక్కసు వెళ్లగక్కడం ఆపలేదు. దాంతో పలువురు భారత నెటిజన్లు 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' అంటూ పిలుపునిస్తున్నారు!


ఇటీవల లక్షద్వీప్ పర్యటన సందర్భంగా బీచ్ ఒడ్డున ప్రధాని మోదీ

బుకింగులు రద్దు

మోదీపై విమర్శల ప్రభావం మాల్దీవుల పర్యాటక రంగంపై తీవ్రంగా పడుతోంది. భారత పర్యాటకులు ఇప్పటికే 8 వేల పై చిలుకు హోటల్ బుకింగులు, 2,500కు పైగా విమాన టిక్కెట్లను రద్దు చేసుకున్నట్లు సమాచారం. మాల్దీవుల్లో ఇటీవలి ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన ముయిజ్జుకు చైనా అనుకూలునిగా, భారత వ్యతిరేకిగా పేరుంది. చైనాతో బంధాన్ని బలోపేతం చేసుకునేందుకు జనవరి 8 నుంచి నాలుగు రోజుల పాటు ఆ దేశంలో పర్యటనకు వెళ్తున్నారు.

సెలబ్రిటీల ఖండన


మాల్దీవుల మంత్రుల నోటి దురుసును క్రికెటర్ సచిన్ టెండూల్కర్, బాలీవుడ్ నటులు అక్షయ్ కుమార్, సల్మాన్ ఖాన్, జాన్ అబ్రహం, శ్రద్ధా కపూర్ తదితరులు తీవ్రంగా తప్పుబట్టారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. వారి విద్వేష వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించాయని అక్షయ్ అన్నారు. ''మాల్దీవులకు ఏటా భారీగా పర్యాటకులను పంపే భారత్‌పై అలా మాట్లాడటం దారుణం. పొరుగువారితో స్నేహంగా మెలగాలనే అనుకుంటాం కానీ ఇలాంటి ద్వేషాన్ని మనమెందుకు సహించాలి? నేనెన్నోసార్లు మాల్దీవుల్లో పర్యటించా. ప్రతిసారీ ఆ దేశాన్ని ప్రశంసించా. కానీ మన ఆత్మగౌరవమే ఫస్ట్. ఇకపై మన దీవుల్లో పర్యటిస్తూ మన పర్యాటకానికి దన్నుగా నిలుద్దాం'' అని పిలుపునిచ్చారు. లక్షద్వీప్‌లో అందమైన, పరిశుభ్రమైన బీచుల్లో ప్రధాని మోదీని చూడటం ఎంతో బాగుంది. మన దేశంలోనే ఇంత అద్భుతమైన బీచ్‌లుండటం గర్వకారణం'' అని సల్మాన్ ఖాన్ పేర్కొన్నారు. ''అతిథి దేవోభవ సందేశంతో భారత్ ఇచ్చే అద్భుతమైన ఆతిథ్యం, విస్తారమైన మన సముద్ర తీరాలను చూడాలే తప్ప వర్ణించలేం. ఇందుకోసం లక్షద్వీప్‌కు వెళ్లాల్సిందే'' అంటూ జాన్ అబ్రహం బీచ్ ఫొటోలను షేర్ చేశారు. సుందరమైన లక్షద్వీప్ బీచ్‌ల అందాలను చూసేందుకు ప్లాన్ చేసుకుంటున్నట్లు నటి శ్రద్ధా కపూర్ తెలిపారు. సచిన్ కూడా ఇటీవలి లక్షద్వీప్ పర్యటన సందర్భంగా అక్కడ తాను క్రికెట్ ఆడిన వీడియో, బీచ్ ఫొటోలను షేర్ చేశారు.

లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి...
13 నుంచి మోదీ శ్రీకారం!
బిహార్‌లో తొలి బహిరంగ సభ

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. పార్టీలన్నీ అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కదన రంగంలోకి దూకబోతున్నారు. ఈ నెల 13వ తేదీ నుంచి లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ఆయన శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిసింది. మొట్టమొదటి బహిరంగ సభను బిహార్‌లో నిర్వహించబోతున్నారు. బిహార్‌లోని చంపారన్ జిల్లా బేటియా సిటీలో భారీ బహిరంగ సభలో మోదీ పాల్గొంటారని బీజేపీ వర్గాలు ఆదివారం వెల్లడించాయి. అదేవిధంగా బిహార్‌లో పలు ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేస్తారని తెలిపాయి. బిహార్‌లో మొత్తం 40 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. అన్ని స్థానాలను గెలుచుకొనేందుకు బీజేపీ వ్యూహాలు రచిస్తోంది. ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బిహార్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. జనవరి, ఫిబ్రవరిలో రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో బేటియా, బెగుసరాయ్, ఔరంగాబాద్ సభల్లో మోదీ ప్రసంగించనున్నారు. బిహార్‌లో గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే 39 స్థానాలు దక్కించుకుంది. కాంగ్రెస్ పార్టీకి ఒకే ఒక్క స్థానం లభించింది.

..ఆ స్ఫూర్తితోనే నేర న్యాయ చట్టాలు

జైపూర్: 'పౌరుడు ప్రథమం.. గౌరవం ప్రథమం.. న్యాయం ప్రథమం' స్ఫూర్తితోనే మూడు నేర న్యాయ చట్టాలను తీసుకొచ్చినట్లు మోదీ చెప్పారు. ఆదివారం జైపూర్‌లో డీజీపీలు, ఐజీల 58వ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ చట్టాలతో దేశ నేర న్యాయ వ్యవస్థలో గుణాత్మక మార్పు వస్తుందన్నారు. మహిళ భద్రత, వారి హక్కుల పరిరక్షణకు కొత్త చట్టాల్లో పెద్దపీట వేశామన్నారు. ''మహిళల భద్రతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టండి. వారు ఎక్కడైనా, ఎప్పుడైనా స్వేచ్ఛగా పని చేసుకొనే వాతావరణముండేలా చూడండి'' అని సూచించారు. వికసిత భారత్‌లో భాగంగా పోలీసు వ్యవస్థ సైతం ఆధునికత సంతరించుకుని ప్రపంచ స్థాయి రక్షణ దళంగా మారాలన్నారు. అరేబియా సముద్రంలో సముద్రపు దొంగల చెర నుంచి భారత వాణిజ్య నౌకను క్షేమంగా విడిపించిన నావికాదళంపై మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ఆదిత్య ఎల్1 మిషన్ విజయవంతంగా గమ్యాన్ని చేరుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



నవీ ముంబైని ముంబైతో కలిపే అటల్ సేతు ఇది. దీని పొడవు ఏకంగా 21.8 కిలోమీటర్లు. భారత్‌లో సముద్రంపై నిర్మించిన అతి పొడవైన బ్రిడ్జి ఇదే. జనవరి 12న ప్రధాని మోదీ దీన్ని ప్రారంభించనున్నారు.

ఢిల్లీ స్కూళ్లకు మరో 5 రోజులు సెలవులు

న్యూఢిల్లీ: ఢిల్లీలో చలి తీవ్రత పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలకు ఈ నెల 12వ తేదీ వరకు సెలవులను పొడిగించింది. ఢిల్లీలో పాఠశాలలకు సోమవారంతో శీతాకాల సెలవులు ముగియాల్సి ఉంది. 'ఢిల్లీలో చలి వాతావరణ పరిస్థితులు కొనసాగుతుండటంతో నర్సరీ నుంచి అయిదో తరగతి వరకు ప్రభుత్వ స్కూళ్లను మరో అయిదు రోజుల పాటు మూసి ఉంచాలని నిర్ణయించాం'అని విద్యాశాఖ మంత్రి అతిషి ఆదివారం 'ఎక్స్'లో తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు తమ విద్యార్థుల కోసం ఆన్‌లైన్ తరగతులు నిర్వహించుకోవచ్చని తెలుపుతూ విద్యాశాఖ సర్క్యులర్ జారీ చేసింది. 6 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థుల కోసం ఉదయం 8 గంటలు–సాయంత్రం 5 గంటల మధ్యలోనే తరగతులు నడపాలని కోరింది.

సూపర్ మార్కెట్ల తిండి...
సర్వం ప్లాస్టిక్‌మయం!



- వాటి నిండా థాలేట్స్, బైస్ఫెనాల్ రసాయనాలు
- క్యాన్సర్, మధుమేహం, వంధ్యత్వం, స్థూలకాయ సమస్యలు
- 'కన్జ్యూమర్ రిపోర్ట్స్' అధ్యయనంలో వెల్లడి

ఆధునిక యుగంలో సర్వం ప్లాస్టిక్‌మయం.. మనం తీసుకొనే ఆహారం కూడా ఇందుకు మినహాయింపు కాదు. కంటికి కనిపించని సూక్ష్మ రూపంలో ప్లాస్టిక్ రేణువులు ఆహారంలో చేరుతున్న సంగతి తెలిసిందే అయినా ఆరోగ్యానికి హాని కలిగించే ప్రమాదకరమైన రసాయనాలు ఉంటున్నాయని తేలడం ఆందోళన కలిగిస్తోంది. ఆహారంలో ప్లాస్టిక్ పరిమాణంపై 'కన్జ్యూమర్ రిపోర్ట్స్' అనే స్వచ్ఛంద సంస్థ ఒక అధ్యయనం నిర్వహించింది. సూపర్ మార్కెట్లలో లభ్యమయ్యే రెడీమేడ్ ఆహారంతోపాటు ఫాస్ట్‌ఫుడ్‌ను ప్రయోగశాలలో క్షుణ్నంగా పరీక్షించింది. ఆహార తయారీ సమయంలోనే అందులో ప్లాస్టిక్ కలుస్తున్నట్లు గుర్తించింది...

- ఫాస్ట్‌ఫుడ్స్‌తోపాటు సూపర్ మార్కెట్లలో లభించే 85 రకాల ఆహార పదార్థాలను పరీక్షించగా, 84 పదార్థాల్లో థాలేట్స్ అనే ప్లాస్టిక్ రసాయనం ఆనవాళ్లు ఉన్నట్లు వెల్లడయ్యింది. ప్లాస్టిక్ ఎక్కువ కాలం మన్నికగా ఉండడానికి ఈ కెమికల్‌ను ఉపయోగిస్తుంటారు. పోలార్ సెల్ట్‌జెర్ కంపెనీ తయారు చేసిన రాస్‌బెర్రీ లైమ్ అనే పండ్ల రసంలో ప్లాస్టిక్ లేదని తేలింది.
- తాము పరీక్షించిన వాటిలో 79 శాతం ఆహార నమూనాల్లో బైస్ఫెనాల్–ఏ(బీపీఏ) అనే మరో ప్లాస్టిక్ రసాయనం ఉన్నట్లు తేలిందని 'కన్జ్యూమర్ రిపోర్ట్స్' ప్రకటించింది. కానీ, 2009 నాటితో పోలిస్తే ఇప్పుడు ఆహార పదార్థాల్లో ఈ కెమికల్ పరిమాణం తక్కువే ఉన్నట్లు వెల్లడించింది.
- ఆహారంలో థాలేట్స్ స్థాయి ఎంతవరకు ఉంటే క్షేమం అనేదానిపై సైంటిస్టులు ప్రమాణాలేవీ నిర్దేశించలేదు. అవి ఎంత తక్కువగా ఉన్నప్పటికీ ఆరోగ్యానికి ముప్పేనని చెబుతున్నారు.
- థాలేట్స్, బైస్ఫెనాల్స్ శరీరంలో ఈస్ట్రోజెన్, ఇతర హార్మోన్ల ఉత్పత్తి, నియంత్రణను అస్తవ్యస్తం చేస్తాయి.
- ఇలాంటి రసాయనాలు కలిసిన ఆహారం తీసుకుంటే పుట్టుక లోపాలు, క్యాన్సర్, మధుమేహం, వంధ్యత్వం, స్థూలకాయం, నరాల సంబంధిత వ్యాధులతో పాటు పలు ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముందని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు.
- చీరియోస్, గెర్బర్ బేబీ ఫుడ్, యోప్లాయిట్ యోగర్ట్‌తోపాటు వెండీస్, బర్గర్ కింగ్, మెక్‌డొనాల్డ్స్ వంటి ప్రఖ్యాత కంపెనీల బర్గర్లు, చికెన్ నగ్గెట్స్, ఫ్రైలలో థాలేట్స్, బైస్ఫెనాల్స్ ఉన్నట్లు గుర్తించారు.
- ఆహారంలో ప్లాస్టిక్‌ల నియంత్రణ కోసం ప్రభుత్వాలు మరిన్ని చర్యలు చేపట్టాలని, నిబంధనలను కఠినతరం చేయాలని 'కన్జ్యూమర్ రిపోర్ట్స్' ప్రతినిధి జేమ్స్ రోజర్స్ సూచించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

90 ఏళ్ల మృత్యుంజయురాలు

టోక్యో: జపాన్‌లో ఇటీవల సంభవించిన భారీ భూకంపం తీవ్ర విషాదం మిగిల్చింది. వంద మందికిపైగా జనం మరణించారు. వందలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శిథిలాలను తొలగిస్తున్నారు. 90 ఏళ్లకుపైగా వయసున్న ఓ వృద్ధురాలు శిథిలాల నుంచి ప్రాణాలతో క్షేమంగా బయటపడడం ఆశ్చర్యం కలిగించింది. ఇషికావా జిల్లాలోని సుజు సిటీలో భూకంపం వల్ల కూలిపోయిన రెండంతస్తుల భవన శిథిలాలను తొలగిస్తుండగా ఆదివారం సాయంత్రం ఈ వృద్ధురాలు బయటకు వచ్చింది. ఆహారం, నీరు లేక బలహీనంగా మారిన బాధితురాలిని వెంటనే ఆసుపత్రికి తరలించి, చికిత్స ప్రారంభించారు. ఏకంగా 124 గంటలపాటు ఆమె ఈ శిథిలాల కిందే ఉండిపోయింది. బాధితురాలి ఆరోగ్యం మెరుగ్గానే ఉందని, మాట్లాడగలుతోందని, ఆమె కాళ్లకు గాయాలయ్యాయని వైద్యులు చెప్పారు. జపాన్‌లో ఆరు రోజుల క్రితం సంభవించిన భూకంపంలో కనీసం 126 మంది మృత్యువాతపడ్డారని స్థానిక అధికారులు వెల్లడించారు.

ఇజ్రాయెల్ దాడుల్లో జర్నలిస్టుల మృతి



రఫా: గాజాస్ట్రిప్‌పై ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడులు కొనసాగిస్తూనే ఉంది. ఆదివారం దక్షిణ గాజాపై జరిగిన దాడుల్లో ఇద్దరు పాలస్తీనా జర్నలిస్టులు మరణించారు. వీరిలో అల్–జజీరా సీనియర్ కరస్పాండెంట్ వాయిల్ దాహ్‌దౌ కుమారుడు హమ్జా దాహ్‌దౌ కూడా ఉన్నాడు. మరో జర్నలిస్టు కూడా మృతి చెందాడు. ఇజ్రాయెల్ దాడుల్లో వాయిల్ దాహ్‌దౌ కుటుంబంలో ఇప్పటిదాకా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఆయన భార్య, ఇద్దరు కుమారులు, మనవడు ఇప్పటికే చనిపోగా, ఆదివారం మరో కుమారుడు బలయ్యాడు. దాహ్‌దౌ సైతం గాయాలపాలయ్యాడు. అయినప్పటికీ తన విధులు నిర్వర్తిస్తూనే ఉన్నాడు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధ వార్తలను ప్రపంచానికి అందిస్తున్నాడు. గాజాలో అసలేం జరుగుతోందో ప్రపంచం తెలుసుకోవాలని, అందుకోసం తన ప్రాణాలైనా ధారపోస్తానని వాయిల్ దాహ్‌దౌ చెప్పాడు. తన కుటుంబం మొత్తం బలైపోయినా తన సంకల్పం సడలిపోదని స్పష్టం చేశాడు. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ఇప్పటిదాకా 22,800 మందికిపైగా పాలస్తీనియన్లు మృత్యువాత పడ్డారు.

కొత్తగా 756 కరోనా కేసులు

న్యూఢిల్లీ: దేశంలో ఒక్క రోజు వ్యవధిలో మరో 756 కరోనా కేసులు నమోదు కాగా, యాక్టివ్ కేసుల సంఖ్య 4,049కి చేరుకున్నట్లు ఆదివారం కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. అదే సమయంలో, కేరళ, మహారాష్ట్రల్లో ఇద్దరేసి చొప్పున, జమ్మూకశ్మీర్ ఒక్కరు కోవిడ్ బాధితులు చనిపోయారని పేర్కొంది. యాక్టివ్ కేసుల్లో అత్యధికంగా హోం ఐసోలేషన్‌తోనే నయమవుతున్నట్లు వివరించింది.

అమెరికా వ్యాపారవేత్త వల్ల...
స్టోర్ రూంలో నిద్రించాను

ఇన్ఫోసిస్ తొలినాళ్ల కష్టాలపై నారాయణమూర్తి



న్యూఢిల్లీ: అది ఇన్ఫోసిస్ అప్పుడప్పుడే నిలదొక్కుకుంటున్న తరుణం. న్యూయార్క్‌కు చెందిన డేటా బేసిక్స్ కార్పొరేషన్ దాని పెద్ద కస్టమర్లలో ఒకటిగా ఉండేది. దాని అధిపతి డాన్ లైల్స్‌కు ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి అంటే నచ్చేది కాదు. ఓసారి ఆయనతో భేటీ కోసం న్యూయార్క్ వెళ్లిన నారాయణమూర్తి ఆ రాత్రి డాన్ నివాసంలోనే నిద్ర పోవాల్సి వచ్చింది. ఇంట్లో నాలుగు బెడ్రూములున్నా నారాయణమూర్తి అంటే కిట్టని డాన్ మాత్రం ఆయన్ను తన సంస్థ స్టోర్ రూంలో పడుకొమ్మన్నాడు! అదీ, కనీసం కిటికీ కూడా లేని చోట, అట్ట పెట్టెల మధ్య పడున్న ఓ పెద్ద బాక్స్‌పై! డాన్ వల్ల అప్పటిదాకా ఎన్ని ఇబ్బందులు పడ్డా ఇన్ఫోసిస్ కోసం భరించిన తనకు ఈ అవమానకర ఘటన మాత్రం ఎప్పటికీ గుర్తుండిపోయిందంటారు నారాయణ మూర్తి. ''అతిథి దేవుడితో సమానమని మా అమ్మ చెప్పేవారు. అనుకోకుండా ఎవరైనా వస్తే అమ్మ తాను తినకుండా వారికి వడ్డించేవారు. పస్తు పడుకునేవారు'' అంటూ గుర్తు చేసుకున్నారు. 'యాన్ అన్‌కామన్ లవ్: ది అర్లీ లైఫ్ ఆఫ్ సుధా అండ్ నారాయణ మూర్తి' పుస్తకంలో ఇలాంటి ఆసక్తికర విషయాలెన్నో ఉన్నాయి. భారతీయ అమెరికన్ రచయిత్రి చిత్రా బెనర్జీ దివాకరుని రాసిన ఈ పుస్తకాన్ని జగ్గర్‌నాట్ బుక్స్ ప్రచురించింది. ఇన్ఫోసిస్ ఆవిర్భావం నుంచి వారి వివాహం, తల్లిదండ్రులవడం తదితర పరిణామాలన్నీ అందులో ఉన్నాయి. సుధా మూర్తి మంచి ఇంజనీర్ అయినా ఇన్ఫోసిస్‌లో చేరడం నారాయణ మూర్తికి తొలుత అస్సలు ఇష్టం లేదట. కుటుంబ యాజమాన్యాల్లోని సంస్థల ఇబ్బందులు ఆయన కళ్లారా చూడటమే అందుకు కారణమని రచయిత్రి వివరించారు. వారిద్దరిదీ అసాధారణ ప్రేమ కథ అని చెప్పుకొచ్చారు. సోషలిజాన్ని బాగా ఇష్టపడే మూర్తి రష్యన్ ప్రపంచ భాష అవుతుందని నమ్మేవారట. రెండేళ్లపాటు రష్యన్ తెగ నేర్చుకున్నారట. సుధా మూర్తి మాత్రం ఇంగ్లిషే ప్రపంచ భాష అవుతుందని చెప్పేవారట.

బంగ్లా పీఠంపై మళ్లీ హసీనాయే

- ప్రధానిగా వరుసగా నాలుగోసారి ఎన్నిక
- ఆమె పార్టీ అవామీలీగ్‌కు మూడింట రెండొంతుల మెజారిటీ

ఢాకా: బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో అంతా ఊహించినట్టుగానే పాలక అవామీ లీగ్ నెగ్గింది. ఆదివారం పోలింగ్ జరగ్గా రాత్రికల్లా తొలి దశ ఫలితాలు వెలువడ్డాయి. 300 స్థానాలకు గాను ఇప్పటికే 200 చోట్ల నెగ్గి అవామీ లీగ్ మూడింట రెండొంతుల మెజారిటీ సాధించింది. దాంతో ప్రధానిగా షేక్ హసీనా వరుసగా నాలుగోసారి పగ్గాలు చేపట్టనున్నారు. ప్రధాన ప్రతిపక్షం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీతో పాటు విపక్షాలన్నీ బహిష్కరించిన ఈ ఎన్నికలపై జనం పెద్దగా ఆసక్తి చూపలేదు. దాంతో కేవలం 40 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించారు. సాయంత్రం పోలింగ్ ముగియగానే ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించారు. బంగ్లాదేశ్‌లో 2018 సాధారణ ఎన్నికల్లో 80 శాతానికి పైగా ఓటింగ్ నమోదైంది. ఈసారి అది ఏకంగా సగానికి పడిపోవడం గమనార్హం. మొత్తం 300 నియోజకవర్గాలకు గాను 299 చోట్ల పోలింగ్ నిర్వహించారు. ఒక స్థానంలో అభ్యర్థి మరణించడంతో ఎన్నిక వాయిదా వేశారు. 27 పార్టీల నుంచి 1,500 మందికిపైగా అభ్యర్థులు బరిలో నిలిచారు. 436 మంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేశారు. హసీనా 2009 నుంచి అధికారంలో కొనసాగుతున్నారు.


ఓటేస్తున్న బంగ్లాదేశ్ ప్రధాని హసీనా

భారత్ పొరుగుదేశం కావడం అదృష్టం

ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ–జమాత్–ఇ–ఇస్లామీ కూటమికి ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం లేదని ప్రధాని షేక్ హసీనా విమర్శించారు. ఓటు వేసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం కల్పించామని చెప్పారు. భారత్ తమకు అత్యంత నమ్మకమైన మిత్రదేశమని చెప్పారు. భారత్ లాంటి దేశం పొరుగున ఉన్నందుకు తాము చాలా అదృష్టవంతులమని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ స్వాతంత్ర్య ఉద్యమానికి భారత్ ఎంతగానో సహకరించిందని చేశారు. 1975 ఆగస్టులో తన తండ్రిని, తల్లిని, ముగ్గురు సోదరులను, ఇతర కుటుంబ సభ్యులను సైనికాధికారులు దారుణంగా హత్య చేశారని పేర్కొన్నారు.


ఇంటర్నేషనల్ కైట్స్ ఫెస్టివల్ సందర్భంగా ఆదివారం అహ్మదాబాద్‌లో పతంగిని ఎగురవేస్తున్న గుజరాత్ ముఖ్యమంత్రి భూపేశ్ పటేల్

సాక్షి
కరీంనగర్

సోమవారం | 8 | జనవరి | 2024

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి(కరీంనగర్): సోమవారం ఉదయం 10 గంటల–మధ్యాహ్నం 1 గంట వరకు 11 కేవీ మంకమ్మతోట ఫీడర్ మంకమ్మతోట, పొన్నం కాంప్లెక్స్, కశ్మీర్‌గడ్డ, గోపాల్‌రావు బిల్డింగ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. 33 కేవీ టవర్ లైన్ వర్క్, 11 కేవీ కమాన్ ఫీడర్ లక్ష్మీనగర్, మధుగా ర్డెన్ ఏరియా, గాయత్రినగర్, పాషామహల్ ప్రాంతాలకూ సరఫరా ఉండదని ఏడీఈ నరేందర్ తెలిపారు.



ఎల్‌ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీకి నీటి విడుదల కొనసాగుతోంది. రెండు గేట్ల ద్వారా ఆదివారం 4,700 క్యూసెక్కులు తరలుతోంది. ప్రాజెక్టులో 18.76 టీఎంసీల నీరు ఉంది.

గరిష్టం/కనిష్టం
29.8/16.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పొడి వాతావరణం ఏర్పడుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

టీచర్ల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



కరీంనగర్: టీచర్ల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించేలా చొరవ చూపాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె శ్రీనివాస్, అట్ల శ్రీనివాసరెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందించారు. అర్ధంతరంగా నిలిచిపోయిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల చేపట్టాలని, పదోన్నతులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. అలాగే, 317 బాధిత టీచర్ల సమస్యలు పరిష్కరించాలని, 13 జిల్లాల స్పౌజ్ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని విన్నవించారు.

టీఆర్‌టీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



కరీంనగర్: టీఆర్‌టీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కరీంనగర్‌లోని మీసేవ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్, కార్యదర్శులు దయాకర్, సర్వర్, భానుప్రకాశ్, మైనారిటీ కన్వీనర్ అబిబుర్ రెహమాన్, జిల్లా అధ్యక్షుడు ఖాజా మంజూర్ అలీ, ప్రధాన కార్యదర్శి చింతపల్లి అశోక్‌రావు, పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రేగుల పాటి రమణారావు, నాయకులు పాల్గొన్నారు.

'అద్దం నా చిరునామా కాదు' పుస్తకం..



కరీంనగర్ కల్చరల్: ప్రముఖ కవయిత్రి తోట నిర్మలారాణి రచించిన అద్దం నా చిరునామా కాదు అనే పుస్తకాన్ని బహు భాషావేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్ ఆదివారం ఆవిష్కరించారు. కరీంనగర్‌లోని విద్యుత్ ఇంజినీర్ల సంఘం భవనంలో తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నిర్మలారాణి మహిళలు అనుభవిస్తున్న అణచివేత, పీడనను ప్రపంచానికి చాటిచెబుతూ గొప్ప కవిత్వాన్ని ఆవిష్కరించారని తెలిపారు. తెరవే జాతీయ అధ్యక్షుడు, ప్రముఖ కవి జూకంటి జగన్నాథం మాట్లాడుతూ.. స్త్రీవాదంలో గత ఐదు దశాబ్దాలుగా వస్తున్న పరిణామాలను వివరించాలని, కవులు ప్రభుత్వానికి గుడ్డిగా వత్తాసు పలకకుండా ప్రశ్నించాలని అన్నారు. వేదిక కరీంనగర్ అధ్యక్షుడు సీవీ.కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ కవి, విమర్శకుడు శ్రీరామ్ పుప్పాల, తెరవే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర్ల వెంకటేశ్వర్లు, గాజోజు నాగభూషణం, అన్నవరం దేవేందర్, బెల్లంకొండ ప్రసేన్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

'గిరిజన' హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి



కరీంనగర్: హాస్టల్ విద్యార్థినులకు కుళ్లిన కూరగాయలు, నీళ్ల సాంబార్‌తో భోజనం పెడుతున్నారని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి ఆరోపించారు. ఆదివారం కరీంనగర్‌లోని రాంనగర్ గిరిజన మహిళా కళాశాల హాస్టల్‌ను సందర్శించారు. భోజనంలో నాణ్యత పాటించకపోవడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని విద్యార్థినులు చెప్పడం బాధ కలిగించిందన్నారు. వార్డెన్ సమయపాలన పాటించకపోవడం వల్ల కిందిస్థాయి సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కవడం వల్లే భోజనంలో నాణ్యత లోపిస్తోందని, గిరిజన సంక్షేమశాఖ అధికారి హాస్టల్‌ను సందర్శించకపోవడం వల్లే ఇదంతా జరుగుతోందని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హాస్టల్ వార్డెన్ హసీనాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. నాయకులు ప్రకాశ్, దేవిక, మౌనిక, కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగం.. ప్రహసనం

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు భారంగా ప్రాక్టికల్స్ నిర్వహణ
- పాత పరికరాలు, రసాయనాలే దిక్కు
- మూడేళ్లుగా విడుదల కాని నిధులు
- వచ్చే నెల 1 నుంచే ప్రయోగ పరీక్షలు
- మార్కులు తగ్గుతాయని ఆందోళన
- జిల్లాలో సైన్స్, ఒకేషనల్ విద్యార్థులు 22,106 మంది



'ఇంటర్మీడియట్ సైన్స్ విద్యార్థులకు వార్షిక పరీక్షల్లో వచ్చే మార్కులు ఎంత ముఖ్యమో.. ప్రాక్టికల్స్‌లో సాధించేవి కూడా అంతే.. సాధారణంగా సైన్స్ గ్రూపులు, ఒకేషనల్ కోర్సులు చదువుతున్న వారికి ప్రయోగ పరీక్షలను ఏటా ఫిబ్రవరిలో నిర్వహిస్తారు. ఇందుకోసం ముందు నుంచే విద్యార్థులను సన్నద్ధం చేయాల్సి ఉంటుంది. అప్పుడే మంచి ఫలితాలు వస్తాయి. కానీ, ప్రాక్టికల్స్‌కు ప్రభుత్వం నుంచి మూడేళ్లుగా నిధులు రాకపోవడంతో నామమాత్రంగా కొనసాగుతున్నాయన్న విమర్శలున్నాయి.'

కరీంనగర్: ఇంటర్మీడియట్ విద్యార్థులకు సంబంధించి ప్రాక్టికల్ పరీక్షలకు ఇంటర్ బోర్డు షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మేరకు ఫిబ్రవరి 1 నుంచి ప్రయోగ పరీక్షలు నిర్వహించాలి. అదే నెల చివరలో వార్షిక పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో నిధులేక ప్రభుత్వ కళాశాలల్లో పరిస్థితి అధ్వానంగా ఉంది. ప్రాక్టికల్స్‌కు కావాల్సిన పరికరాలు, కెమికల్స్, ఇతరత్రా సామగ్రికి ప్రభుత్వం నిధులివ్వడం లేదు. విద్యార్థులతో ముందుగానే సాధన చేయించాల్సిన అధ్యాపకులు పరీక్షలప్పుడే ప్రాక్టికల్స్ చేయిస్తున్నారు. దీంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారు. కరీంనగర్ జిల్లాలో 22,106 మంది ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. మొత్తం 11 ప్రభుత్వ, 6 టీఎస్ సోషల్ వెల్ఫేర్ కళాశాలలు, 9 మైనారిటీ, 6 ఎంజేపీ, 11 మోడల్ స్కూళ్లు, 6 కేజీబీవీ, 55 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి.

పరికరాలు, రసాయనాలు కొనుగోలు చేయలే

ఇంటర్మీడియట్ విద్యార్థులకు కీలకమైన ప్రాక్టికల్స్ నిర్వహణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు భారంగా మారింది. ఏటా ఆయా కాలేజీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అరకొర వసతులు, శిథిలావస్థలో ఉన్న ల్యాబ్‌లలో తుప్పుపట్టిన పరికరాలతోనే విద్యార్థులు ప్రాక్టికల్స్ చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఎలాంటి పరికరాలు, రసాయనాలు కొనుగోలు చేయలేదు. పాత వాటితోనే ప్రయోగ పరీక్షలు నిర్వహించేందుకు ఇంటర్ విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. ఏటా ప్రైవేటు కళాశాలల విద్యార్థులతో పోలిస్తే ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు ప్రాక్టికల్స్‌లో తక్కువ మార్కులను సాధిస్తున్నారు. వీటి ప్రభావం ఎంసెట్ ర్యాంకులపై పడుతుందని ఆందోళన చెందుతున్నారు.

6 నెలలుగా నిర్వహణ బిల్లుల్లేవు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సిబ్బంది, నిధుల్లేక సమస్యల నిలయంగా మారాయి. గ్రామీణ ప్రాంత కళాశాలల పరిస్థితి అగమ్యగోచరం. జిల్లాలోని 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారు 7 వేల మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులున్నారు. కళాశాలల నిర్వహణకు ప్రభుత్వం ఏటా ప్రతీ విద్యార్థికి రూ.38 చొప్పున అందిస్తుంది. కానీ, గత 6 నెలలుగా ఆ బిల్లుల రాకపోవడంతో శానిటైజర్లు, రిజిస్టర్లు, చాక్‌పీస్‌లు ఇతరత్రా వస్తువుల కొనుగోలుకూ ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది.

2013–14లో కొన్ని సరఫరా..

సూక్ష్మదర్శినితోపాటు కణజాలాలు, స్లైడ్స్‌కు సంబంధించిన పరికరాలను 2013–14 సంవత్సరంలో సరఫరా చేశారు. ఇప్పటికీ వాటితోనే ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు ఒకటి, రెండు రోజుల ముందే అధ్యాపకులు విద్యార్థులకు ప్రయోగ క్లాసులు చెబుతున్నారన్న ఆరోపణలున్నాయి. కొన్నిచోట్ల స్థానికంగా రసాయనాలు కొనుగోలు చేస్తున్నారు. కరోనా కారణంగా రెండేళ్లు ప్రాక్టికల్స్ నిర్వహించలేదు. గతేడాది నిర్వహించినా బిల్లులు ఇంకా విడుదల కాలేదు.

ఉన్నతాధికారులకు నివేదించాం

గతేడాది నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్‌కు సంబంధించి నిధులు ఇంకా విడుదల కాలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. పరికరాలు, రసాయనాల కొనుగోలు అంశాన్ని వారి దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ విద్యాసంవత్సరం విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇటీవలే ఒక్కో విద్యార్థికి రూ.38 చొప్పున కళాశాలల నిర్వహణకు నిధులు ట్రెజరీకి చేరాయి. కాలేజీలకు అందాల్సి ఉంది.

– జగన్మోహన్‌రెడ్డి, డీఐఈవో

గుట్టల చుట్టూ గుంతలే

- వరంగల్–కరీంనగర్ బైపాస్ పేరిట ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు
- రోడ్డు నిర్మాణ కంపెనీ, అక్రమార్కుల తీరు
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు
- సింగాపూర్, తుమ్మన్నపల్లి, మందాడిపల్లి, సిర్సపల్లి గ్రామాల్లో పరిస్థితి



సిర్సపల్లి శివారు గుట్టల వద్ద మట్టి తవ్వకాలు

హుజూరాబాద్‌రూరల్: డబ్బు సంపాదనే ధ్యేయంగా కొందరు అక్రమార్కులు మట్టిని కొల్లగొడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వరంగల్–కరీంనగర్ బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని చూపుతూ నిర్మాణ కంపెనీ పరిమితికి మించి మట్టి తరలిస్తోందని అంటున్నారు. వ్యవసాయ క్షేత్రాల సమీపంలో భారీ గుంతలు ఏర్పడుతుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

నాలుగు గ్రామాల శివారులో..

సింగాపూర్ గ్రామ శివారు నుంచి చిన్నపాపయ్యపల్లి శివారు మీదుగా వరంగల్–కరీంనగర్ బైపాస్ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఇందులో భాగంగా సింగాపూర్, తుమ్మన్నపల్లి, మందాడిపల్లి, సిర్సపల్లి గ్రామాల శివారులో భారీగా అక్రమ మట్టి దందా సాగుతోందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. ఈ బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడుతున్న కంపెనీ అనుమతి తీసుకున్న పరిమితికి మించి ఇష్టారాజ్యంగా మట్టి తరలిస్తోందని పేర్కొంటున్నారు. సిర్సపల్లి శివారు గుట్టల ప్రాంతంలో సర్వే నంబర్ 495, 496, 497 భూముల నుంచి మట్టి దందా జోరుగా సాగుతోందని చెబుతున్నారు. ఇదే అదునుగా అక్రమార్కులు మందాడిపల్లి–సిర్సపల్లి మధ్యలోని గుట్టల నుంచి తుమ్మన్నపల్లి, మందాడిపల్లి, కొత్తపల్లి మీదుగా ఎస్సారెస్పీ కెనాల్ వెంట మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రీపగలు తేడా లేకుండా ఈ దందా కొనసాగుతోందని, తవ్వకాల మూలంగా గుట్టల చుట్టూ భారీ గుంతలు ఏర్పడ్డాయని అంటున్నారు. వాటికి సమీపంలో వ్యవసాయ క్షేత్రాలు ఉన్న రైతులు లబోదిబోమంటున్నారు.

సాగు ప్రశ్నార్థకం



రాత్రీపగలు తేడా లేకుండా పరిమితికి మించి ఎక్కువ లోతుగా తవ్వుతూ మట్టిని తరలిస్తున్నారు. భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. సమీపంలోనే ఉన్న మా భూముల్లో సాగు ప్రశ్నార్థకంగా మారింది. మట్టిని తరలించేవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఆరెపల్లి స్వరూప, మహిళా రైతు, మందాడిపల్లి

నీటి నిల్వలు పడిపోతున్నయ్



మట్టి తరలిస్తున్న వాహనాలతో రైతుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. వ్యవసాయ భూముల పక్కనే లోతుగా గుంతలు తీస్తుండటంతో నీటి నిల్వలు పడిపోతున్నయ్. పంటల పరిస్థితి ఏమిటి? అక్రమ మట్టి తరలింపును అధికారులు అడ్డుకోవాలి.

– గడ్డి పోచయ్య, రైతు, మందాడిపల్లి

పట్టించుకోవడం లేదు



రోడ్డు నిర్మాణం చేపడుతున్న కంపెనీని మట్టి తరలింపుపై ప్రశ్నిస్తే ఉన్నతాధికారుల అనుమతులు ఉన్నాయంటోంది. పరిమితికి మించి తవ్వకాలు జరుపుతోంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి.

– ఆరెపల్లి ఎల్లయ్య, సర్పంచ్, మందాడిపల్లి

విద్యావలంటీర్లను నియమించాలి



మాట్లాడుతున్న నరేందర్‌రావు



తిరుపతిరావు

- తపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు ఐల్నేని నరేందర్‌రావు

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపట్టే వరకు విద్యావలంటీర్లను నియమించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర సహాధ్యక్షుడు ఐల్నేని నరేందర్‌రావు కోరారు. ఆదివారం కరీంనగర్‌లోని సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు పీఆర్సీ ఫిట్‌మెంట్, మూడు డీఏలు, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు తక్షణమే పదోన్నతులతో కూడిన బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతీ తరగతికి ఒక టీచర్‌ను కేటాయిస్తూ కొత్త నియామకాలు చేపట్టాలని పేర్కొన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత కోసం స్కావెంజర్లను వెంటనే నియమించాలని కోరారు. అనంతరం ప్రధాన కార్యదర్శి ఎన్నిక నిర్వహించగా అన్నమనేని తిరుపతిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకుడిగా మహిపాల్ రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కట్ట రాజేశ్వర్, రాష్ట్ర కార్యదర్శులు అంబటి వేణుకుమార్, బాధ్యులు బొట్ల రామస్వామి, రంగారావు, రాధిక సుధాకర్, ఉదయ్‌కిరణ్‌రావు, శ్రీనివాసరాజు, కరుణాకర్ రావు, శ్రీనివాస్, పవన్‌కుమార్, ఐలయ్య, సంపత్ కుమార్, రవి, వేణుగోపాల్, సంపత్ పాల్గొన్నారు.

'ప్రజాపాలనతో బీఆర్‌ఎస్ నాయకుల బెంబేలు'

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి సాగిస్తున్న ప్రజాపాలనను చూసి బీఆర్‌ఎస్ నాయకులు బెంబేలెత్తిపోతున్నారని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి కొత్తకొండ శంకర్ ఒక ప్రకటనలో విమర్శించారు. పార్టీ సమీక్షల పేరిట ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేటీఆర్‌లు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పదేళ్ల పాలనలో కనీసం రేషన్ కార్డులు ఇప్పించలేని వారికి ప్రజాపాలన కార్యక్రమం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు.

రోడ్లను తవ్వారు.. వదిలేశారు

- అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్ల తీరు
- 2 నెలలుగా స్థానికుల ఇబ్బందులు
- నగరంలో నిబంధనలు పాటించడం లేదన్న ఆరోపణలు

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కనీస నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలున్నాయి. డ్రైనేజీలు, రోడ్లు తదితర పనులు జరుగుతున్న సందర్భంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు నగరంలో ఎక్కడా కనిపించడం లేదు. ఆయా పనుల కోసం రోడ్లను తవ్వుతున్న కాంట్రాక్టర్లు తర్వాత వాటిని అలాగే వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 6వ డివిజన్ కాపువాడలోని పలు వీధుల్లో డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ల కోసం తవ్వకాలు చేపట్టారు. ఇది జరిగి 2 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు శాశ్వతంగా సీసీరోడ్లు నిర్మించలేదు. కనీసం డస్ట్ పోయలేదు. దీంతో వాహనాలు తిరగడం దేవుడెరుగు నడిచి వెళ్లేందుకూ ప్రజలు నానాతంటాలు పడుతున్నారు. ముఖ్యంగా వద్ధులు కాలు కదపడం కూడా కష్టంగా మారింది. రాత్రివేళల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. పైగా తవ్వకాల్లో ఏర్పడిన పెద్ద గుంతలను అలాగే వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కాంట్రాక్టర్లు తమ పని అయిపోయిందని వెళ్లిపోవడం, పర్యవేక్షించాల్సిన స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని, లేదంటే తాత్కాలికంగా మరమ్మతు చేయించాలని డిమాండ్ చేస్తున్నారు.



కాపువాడలో తవ్వి వదిలేసిన అంతర్గత రోడ్డు

రాజీవ్‌చౌక్‌లో అగ్ని ప్రమాదం

- రూ.10 లక్షలకు పైగా ఆస్తి నష్టం

కరీంనగర్ క్రైం: కరీంగనర్ రాజీవ్‌చౌక్‌లోని ఓ షాపులో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో రూ.10 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక శాఖ అధికారులు అంచనా వేశారు. వారి వివరాల ప్రకారం.. రాజీవ్‌చౌక్‌లో టి.సరితారెడ్డి మణిదీప్ ఫ్యాబ్రిక్ హౌస్ నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా షాపులో మంటలు చెలరేగాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఫైర్ అధికారులు వెంటనే తమ సిబ్బందితో వచ్చి, ఆర్పివేశారు. కానీ, అప్పటికే దుకాణంలోని దుస్తులు చాలా వరకు కాలిపోయాయి. షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. డివిజన్ ఫైర్ ఆఫీసర్ టి.వెంకన్న, స్టేషన్ ఆఫీసర్ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పాడి పరిశ్రమకు చేయూత

- గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల పెంపకానికి ప్రోత్సాహం
- దాణా, పశుగ్రాసం కూడా..
- ఆసక్తి గల యువత, రైతులకు 50 శాతం రాయితీ
- జాతీయ పశు అభివృద్ధి పథకం అమలు చేస్తున్న కేంద్రం



పాడి గేదెలు



పెరటి కోళ్లు

కరీంనగర్ అర్బన్: పశుజాతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ జాతీయ పశు అభివృద్ధి పథకాన్ని అమలు చేస్తోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పశు సంపద లేకపోవడాన్ని గుర్తించి, పాడి రంగం అభివృద్దే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించింది. ఈ మేరకు గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల పెంపకమే కాకుండా వాటికి అవసరమైన దాణా, పశుగ్రాసానికి ప్రాధాన్యతనిచ్చింది. ఆసక్తి ఉన్న రైతులు, యువతకు 50 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. కాగా, పశుసంవర్ధక, పశువైద్య శాఖల పర్యవేక్షణలో ఈ పథకం అమలవుతోంది.

ప్రాజెక్టు నివేదికే ప్రామాణికం..

పశుజాతుల అభివృద్ధిపై ఆసక్తి కలిగిన రైతులు, యువత తాము చేపట్టనున్న ప్రాజెక్టుకు సంబంధించి నివేదిక సమర్పించాలి. దాని ఆధారంగా యూనిట్ విలువలో 50 శాతం నిధులను జాతీయ పశు అభివృద్ధి పథకం కింద కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుంది. చిన్నస్థాయి నుంచి రూ.కోటి వరకు విలువైన యూనిట్లకు కూడా ఇందులో అవకాశం కల్పించారు. బ్యాంకు రుణాల ఆధారంగానూ ఈ పథకాన్ని వినియోగించుకునే వెసులుబాటు ఉంది.

వ్యక్తులు, సమూహాలకు అమలు..

వ్యక్తులు, సమూహాలైనా సరే వినియోగించుకునేలా ఈ పథకాన్ని రూపొందించారు. స్వయం సహాయక బృందాలు, జేఎల్‌జీ గ్రూపులు, రైతు ఉత్పత్తి సంఘాలు దీన్ని ఉపయోగించుకునే అవకాశముంది. యూనిట్ల నిర్వహణకు అవసరమైన నిధుల్లో 50 శాతాన్ని డిపాజిట్ల ద్వారా బ్యాంకుల నుంచి చూపించవచ్చు. ఆ తర్వాత ప్రాజెక్టు రిపోర్టును పరిశీలించి, యూనిట్లకు సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయనుంది. ప్రాజెక్టు స్థాయి ఆధారంగా నిధులను విడతల వారీగా విడుదల చేయనున్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా ఇది జరగనుందని పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. మండల పశువైద్యులను సంప్రదించి, పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

దరఖాస్తు ఇలా..

పథకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మార్చి 31, 2025 వరకు గడువు ఉంది. రాష్ట్రీయ గోకుల్ మిషన్‌కు nddb.coop.in ద్వారా, గొర్రెలు, మేకలు, కోడి పిల్లల ఉత్పత్తి పథకాల కోసం nlm.udhyamimitra.com ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. నెలకొల్పనున్న యూనిట్ ప్రాజెక్టు రిపోర్టు, బ్యాంకు రుణ మంజూరు ముందస్తు పత్రం, పలు వ్యక్తిగత ధ్రువపత్రాలతోపాటు మరికొన్ని పత్రాలను ఆన్‌లైన్‌లో దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అన్నీ సవ్యంగా ఉంటే యూనిట్‌ను మంజూరు చేసి, రాయితీ డబ్బులను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.

'సదరం' మండలాల వారీగా నిర్వహించాలి



సప్తగిరికాలనీ(కరీంనగర్): ప్రతినెలా ప్రభుత్వం నిర్వహించే సదరం స్లాట్ బుకింగ్‌ను 10 నుంచి 50 మందికి మాత్రమే చేసుకునే అవకాశం ఉంటోందని, దీనివల్ల వందలాది మంది దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారని తెలంగాణ దివ్యాంగ పట్టభద్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి లక్ష్మయ్య అన్నారు. మండలాల వారీగా సదరం క్యాంపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కరీంనగర్‌లో జరిగిన సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. దివ్యాంగులకు రుణాలు ఇవ్వాలన్నారు. అనంతరం సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. నాయకులు జగదీశ్వరాచారి, పర్శరాములు, నాగరాజు, స్వరూప, సంపత్, సంగీత, పద్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో గంగపుత్ర సంఘం అధ్యక్షుడి మృతి


శివకుమార్ (ఫైల్)

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ బెస్త గంగ పుత్ర సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దేశ శివ కుమార్ గుండెపోటుతో మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్‌లోని జ్యోతినగర్‌కు చెందిన శివకుమార్‌కు ఆదివారం తెల్లవారుజామున గుండెపోటు వచ్చింది. కుటుంసభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయారు. ఆయన మృతదేహానికి ఎంపీ బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నగర మేయర్ సునీల్‌రావు, మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, సంఘం పట్టణ అధ్యక్షుడు కూర ధర్మరాజు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చారు.

ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు చోరీ



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని ఇరుకుల్ల, చెర్ల భూత్కూర్ గ్రామాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి, లోపలి సామగ్రి చోరీ చేశారు. ట్రాన్స్‌కో ఏఈ నరేశ్ వివరాల ప్రకారం.. ఇరుకుల్ల శివారులో వ్యవసాయ బావులకు సంబంధించిన 16 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కింద పడి ఉండటాన్ని ఆదివారం ఉదయం గమనించిన మొగ్దుంపూర్ రైతు వేల్పుల లచ్చయ్య అధికారులకు సమాచారం అందించాడు. ఏఈ నరేశ్, లైన్‌మెన్ మోబిన్‌పాషా, జేఎల్‌ఎం కిరణ్ సంఘటన స్థలానికి వెళ్లారు. స్థానిక రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఆ సమయంలో చెర్లభూత్కూర్‌లో సైతం ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టారని అక్కడి రైతు జడ వీరమల్లు సమాచారంతో వెళ్లి, పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు, ఆయిల్, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారని ఏఈ పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

భూతగాదాలో అన్నపై తమ్ముడి దాడి


గాయపడ్డ నారాయణ

చందుర్తి(వేములవాడ): భూతగాదాతో గొడవపడ్డ అన్నపై తమ్ముడు దాడి చేసిన సంఘటన చందుర్తి మండలం కట్టలింగంపేటలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. కట్టలింగంపేటకు చెందిన కోరుట్ల నారాయణ, కోరుట్ల చంద్రయ్యలు అన్నదమ్ములు. కొద్ది నెలలుగా ఇద్దరి మధ్య భూతగాదాలు నడుస్తున్నాయి. ఆదివారం పొలం గట్టును ట్రాక్టర్ కేజ్ వీల్స్‌తో తొక్కించాడని అన్నదమ్ములు గొడవకు దిగారు. అన్న దాడి చేసేందుకు యత్నించగా తమ్ముడు కర్రతో కొట్టాడు. ఈ దాడితో గాయపడ్డ అన్న నారాయణ ఫిర్యాదుతో తమ్ముడిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రంగస్వామి తెలిపారు.

‘సాక్షి’ స్పెల్‌బీకి అనూహ్య స్పందన

రీజినల్ స్థాయి పరీక్షకు 150 మందికిపైగా హాజరు

ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం

కాజీపేట : విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ‘సాక్షి’ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రీజినల్ స్థాయి స్పెల్ బీ పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. కాజీపేట శివారు తాళ్లపద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో చేపట్టిన ఈ పరీక్షకు తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల నుంచి 150 మందికిపైగా విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ‘సాక్షి’ వరంగల్ బ్రాంచ్ మేనేజర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ మొదటిసారిగా రీజినల్ స్థాయి పోటీ పరీక్ష వరంగల్‌లో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల ఇంగ్లిష్ పరంగా నాలెడ్జ్ పెరుగుతుందని చెప్పారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసే ప్రయత్నంలో ‘సాక్షి’ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాఫి, అసోసియేట్ స్పాన్సర్‌గా గ్లాట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్ రాజమండ్రి వ్యవహరిస్తున్నారని చెప్పారు. కాగా, తమ స్కూళ్లలో కూడా ఇలాంటి పోటీ పరీక్షలు నిర్వహించాలనుకుంటే ఆయా పాఠశాలల యాజమాన్యాలు 9505514424 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ‘సాక్షి’ వరంగల్ బ్యూరో ఇన్‌చార్జ్ గడ్డం రాజిరెడ్డి, టీవీ కరస్పాండెంట్ తుమ్మ శ్రీధర్‌రెడ్డి, ఈవెంట్స్ మేనేజర్ ఎస్.సుమన్‌గుప్తా, ఎడిషన్ ఇన్‌చార్జ్ లింగయ్య, తాళ్లపద్మావతి ప్రిన్సిపాల్ అఫ్జల్ ఉన్నీసా, సృజన్, రాకేష్, యామిని, మహేందర్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలో పాల్గొన్న విద్యార్థుల మనోగతం ఇలా ఉంది..


సోమిడిలోని తాళ్ల పద్మావతి కళాశాలలో ‘సాక్షి’ స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఇంగ్లిష్‌పై ఆసక్తి పెరిగింది..



స్పెల్‌బీ పోటీల్లో పాల్గొనే ఉద్దేశంతో కొత్త పదాలు నేర్చుకోవడం మొదలు పెట్టిన తరువాత ఇంగ్లిష్ భాషపై ఇంకా ఆసక్తి పెరిగింది. కొత్త పదాలు కనిపించినప్పుడు వాటి స్పెల్లింగ్ పునశ్చరణ చేసుకుంటున్నా.

- పి.అధితి, రావూస్ టెక్నో స్కూల్, కరీంనగర్

ప్రయోజనకరంగా ఉంది



మాతృభాషతో పాటు ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తేనే లక్ష్యాలను చేరుకుంటాం. తరగతి పుస్తకాలతో పాటు దిన పత్రికలు చదువుతూ ఇంగ్లిష్ నేర్చుకుంటున్నా. నా ప్రయత్నానికి స్పెల్‌బీ పరీక్ష ఎంతో ప్రయోజనకరంగా ఉంది.

- మదియా, శ్రీఅరవిందో హైస్కూల్, జనగామ

భాష సులువు అనిపిస్తోంది..



స్పెల్‌బీ ఇంగ్లిష్ పరీక్ష రాయడం వల్ల భాష సులువు అనిపిస్తోంది. ఉచ్చారణ బాగా వస్తోంది. పదాలు గుర్తు పెట్టుకోవడం, కొత్త పదాలు వెతకడం వల్ల ఇంగ్లిష్‌పై పట్టు సాధించొచ్చు. ‘సాక్షి’కి కృతజ్ఞతలు.

- నిహారిక శర్మ, లిటిల్ ఫ్లవర్ హై స్కూల్, మిర్యాలగూడ

పోటీ పరీక్షలతో ఎంతో మేలు



‘సాక్షి’ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్‌బీ పోటీలు నాలో నూతనోత్సాహం నింపాయి. ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించడానికి చక్కటి మార్గం. పాఠశాల స్థాయి **నుంచే పోటీ పరీక్ష**లకు హాజరైతే ప్రతిభ పెరుగుతుంది.

- కె.కార్తికేయ, జయ ఐఐటీ ఒలంపియాడ్ స్కూల్, సూర్యాపేట

మరికొన్ని పదాలు నేర్చుకున్నా..



స్పెల్‌బీ పోటీల్లో పాల్గొనడం వల్ల ఇంగ్లిష్‌లో మరికొన్ని కొత్త పదాలు నేర్చుకోవడంతోపాటు ఆ పదాలు పలికే విధానం తెలుసుకున్నా. ఇప్పుడు **ఎలాంటి భయం** లేకుండా ఇంగ్లిష్ మాట్లాడొచ్చనే నమ్మకం పెరిగింది.

- ఎం.సాయిప్రియ, సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, కరీంనగర్

ప్రతిభను సానబెట్టేందుకు..



విద్యార్థుల్లోని ప్రతిభను సానబెట్టేందుకు, పోటీతత్వం పెంచేందుకు స్పెల్‌బీ, ఇంగ్లిష్ పరీక్షలు ఉపయుక్తంగా ఉంటాయి. విద్యార్థులకు స్పెల్లింగ్‌లో **పట్టు పెరుగుతుంది.** ఇలాంటి పరీక్షలు ఎంతో దోహదపడతాయి.

- బి.సాన్వి, ఒయాసిస్ హైస్కూల్, స్టేషన్‌ఘన్‌పూర్

పిల్లలు ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తున్నారు



‘సాక్షి’ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ ఇంగ్లిష్ పోటీ పరీక్షలు పిల్లలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. భాషపై నెలకొన్న భయాన్ని దూరం చేసేందుకు ఈ పరీక్షలు ఉన్నాయి. ఈ పోటీలకు మా కళాశాల వేదికగా మారడం సంతోషంగా ఉంది.

- తాళ్ల మల్లేశం, తాళ్ల పద్మావతి విద్యా సంస్థల చైర్మన్

ఉపాధ్యాయుల సహకారం బాగుంది..



స్పెల్‌బీ పరీక్ష రాయడం వల్ల ఉత్సాహం రెంట్టింపు అయింది. ఇంగ్లిష్‌పై నాలో ఉన్న పట్టుదలను గుర్తించిన ఉపాధ్యాయులు ఈ పోటీ పరీక్షలో పాల్గొనేలా ప్రోత్సహించారు. ఫైనల్స్‌కు వెళ్తాననే నమ్మకం మరింత పెరిగింది.

- వంశిక, ఎంజేపీ, బాలికల ఉన్నత పాఠశాల, కమలాపూర్

ఏర్పాట్లు బాగున్నాయి



పిల్లలు ఇంగ్లిష్ భాషపై చక్కటి ప్రతిభ కనబర్చడంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచడానికి స్పెల్‌బీ ఎంతో ఉపయోగపడుతుంది. పరీక్ష ఏర్పాట్లు **బాగున్నాయి. మరిన్ని** పోటీ పరీక్షలు నిర్వహించాలి.

- సురేష్‌కుమార్, ఖమ్మం

మరింత పట్టు పెరిగింది..



‘సాక్షి’ ఏర్పాటు చేసిన పోటీ పరీక్షలకు హాజరుకావడం వల్ల గ్రామర్ సులభంగా నేర్చుకున్నా. ఇంగ్లిష్ భాషపై పట్టు పెరగడంతోపాటు ఎలా మాట్లాడాలనే **విషయం అర్థమైంది.** ఉత్సాహంగా పరీక్ష రాశా.

- రిషిత, రామన్ స్కూల్, సోమిడి

ఉపాధ్యాయుల సహకారంతో..



ఉపాధ్యాయుల సహకారంతో ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టు సాధించా. ఆ తరువాత మాట్లాడడం నేర్చుకున్నా. స్పెల్‌బీ పోటీలకు హాజరవుతూ భాషపై మరింత పట్టు సాధించా.

- ఎస్.జస్వంత్, త్రివేణి స్కూల్, ఖమ్మం

శ్రమకు ఓర్చి పిల్లలను తీసుకొచ్చా..



‘సాక్షి’ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంగ్లిష్ స్పెల్‌బీ పోటీలకు హాజరుకావాలనే తలంపుతో శ్రమకు ఓర్చి పిల్లలను తీసుకొచ్చా. ఇలాంటి పరీక్షలు రాయడం వల్ల పిల్లల్లో పోటీతత్వం అలవడుతుందనే భావనతో వచ్చాం.

- అర్చన, జనగామ

ఇంగ్లిష్‌పై భయం పోయింది



ఇంగ్లిష్‌పై నెలకొన్న భయం పోగొట్టడంలో ‘సాక్షి’ స్పెల్‌బీ పరీక్ష ఉపయోగపడింది. ఇంగ్లిష్ అంటే కష్టంకాదని, ఎంతో సులభంగా నేర్చుకోవచ్చనే భావన కలిగింది. సహ విద్యార్థులతో పోటీపడి పరీక్షకు సన్నద్ధమయ్యా.

- బి.సాయిపల్లవి, ఏకశిల పబ్లిక్ స్కూల్, జనగామ

రాజన్నకు జనహారతి


రాజన్నను దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు


రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్నను ఆదివారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో అభిషేకాలు, గర్భగుడి దర్శనాలు రద్దు చేశారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన కోడెమొక్కులు, నెలువెత్తు బెల్లం పంపిణీ, అమ్మవారికి కుంకుమపూజ, ఇతర మొక్కులు చెల్లించుకున్నారు. ఏఈవోలు శ్రీనివాస్, ప్రతాప నవీన్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్, శ్రీరాములు, గోలి శ్రీనివాస్ ఏర్పాట్లను పరిశీలించారు.

శ్వాసకోశ సమస్యలపై జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ వినయ్

కరీంనగర్ టౌన్: దైనందిన జీవితంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే శ్వాసకోశ సమస్యలకు పరిష్కారం ఉంటుందని ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ వినయ్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల మైదానంలో స్థానిక మెడికవర్ ఆస్పత్రి, ఐఎంఏ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ టాక్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చలికాలంలో శ్వాసకోశ సమస్యలు ఎక్కువగా వస్తుంటాయని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అస్తమా పేషెంట్లు చలి, దుమ్ము, ధూళి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సంచరించాల్సి వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రపంచాన్ని వణికించిన కరోనాకు వ్యాక్సినేషన్ వచ్చిన కారణంగా ప్రాణాపాయ ముప్పు తప్పి, సీజనల్ వ్యాధిగా మారిందని తెలిపారు. వాకర్స్ అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవి మల్లారెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ రోహిణి, మార్కెటింగ్ హెడ్ కరుణాకర్, హెచ్‌ఆర్ మేనేజర్ ఈశ్వర్, ఆపరేషన్స్ మేనేజర్ సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫింగర్‌ప్రింట్ స్కానర్ బుక్ చేస్తే రాళ్లు వచ్చాయి

- ఫింగర్‌ప్రింట్ స్కానర్ బుక్ చేసిన యువకుడు
- పార్సిల్‌లో వచ్చిన రాళ్లు


రాళ్లు వచ్చాయని చెబుతున్న వికాస్

కోనరావుపేట(వేములవాడ): ఆన్‌లైన్‌లో ఫింగర్‌ప్రింట్ స్కానర్ బుక్ చేస్తే రాళ్లు వచ్చిన సంఘటన కోనరావుపేట మండలం కనగర్తిలో వెలుగుచూసింది. బాధితుడు తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన కొల్లూరి వికాస్ ఆన్‌లైన్‌లో ఫింగర్‌ప్రింట్ స్కానర్ కోసం జనవరి 1న బుక్ చేశాడు. 12న డెలివరీ ఇస్తామని షాపింగ్ సంస్థ స్పష్టం చేయగా.. ఆదివారమే పార్సిల్ ఇంటికొచ్చింది. డెలివరీ బాయ్‌కి రూ.2,718 చెల్లించి పార్సిల్ తీసుకున్నాడు. పార్సిల్ తెరిచి చూడగా రాళ్లు కనిపించడంతో కంగుతినడం యువకుడి వంతైంది. మోసం జరిగిందని వెంటనే డెలివరీ బాయ్‌కి చెప్పగా ఐటమ్ రిటర్న్ పెట్టమంటూ వెళ్లిపోయాడు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


ప్రభాకర్‌రావు(ఫైల్)

పెద్దపల్లి రూరల్: హనుమంతునిపేట గ్రామానికి చెందిన గన్నమనేని ప్రభాకర్‌రావు (51) ఆదివారం రైల్వే వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ద్విచక్ర వాహనంపై పెద్దపల్లి వైపు వస్తున్న ప్రభాకర్‌రావును గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడని ఎస్సై మల్లేశ్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి..


రాజయ్య (ఫైల్)

కరీంనగర్ క్రైం: ఆర్టీసీ బస్సు ఢీకొని, ఓ వ్యక్తి మృతి చెందినట్లు కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని విద్యారణ్యపురికి చెందిన బత్తిని రాజయ్య(76) ఆదివారం మధ్యాహ్నం స్కూటీపై గాంధీచౌక్ వైపు వెళ్తున్నాడు. మంచిర్యాల చౌరస్తా సమీపంలో మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆటోలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గల్ఫ్‌లో రోడ్డు ప్రమాదంలో ఒకరు..

- మర్రిపల్లిలో విషాదం


అరిగెల శశికుమార్ (ఫైల్)

వేములవాడరూరల్: ఉన్న ఊరిలో ఉపాధి లేక గల్ఫ్ బాట పట్టిన వలసకార్మికుడు అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు. వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లికి చెందిన అరిగెల శశికుమార్(32) సౌదీ అరేబియాలో ఉపాధి పొందుతున్నాడు. గత నెల 19న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దాదాపు 19 రోజుల తర్వాత శశికుమార్ మృతదేహంతో స్వగ్రామానికి చేరడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతునికి భార్య, కొడుకు, కూతురు, తల్లిదండ్రులు ఉన్నారు.

దొంగకు దేహశుద్ధి


స్థానికుల అదుపులో సతీశ్

సిరిసిల్లక్రైం: సిరిసిల్లలోని వివిధ దుకాణాల్లో దొంగతనానికి పాల్పడుతున్న దొంగను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద కొద్దిరోజులుగా రాత్రి వేళల్లో షాప్‌ల వద్ద ఉన్న సామగ్రి చోరీకి గురవుతుంది. దీనిపై స్థానికులు నిఘా పెట్టారు. సుభాష్‌నగర్‌కు చెందిన సతీశ్‌ను ఆదివారం రాత్రి స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

కుక్కల దాడిలో ఆవు, గేదె మృత్యువాత


జేసీబీ సహాయంతో ఆవును పూడుస్తున్న రైతులు

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని వన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కేలోత్‌తండాలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పిచ్చి కుక్కలు మూకుమ్మడిగా దాడి చేయడంతో రెండు మూగజీవాలు మృతిచెందాయి. కేలోత్‌తండాకు చెందిన రైతులు కేలోత్ నవీన్, గుగులోత్ దేశాయి వారి ఇళ్ల ముందు కట్టేసుకున్న ఆవు, గేదెలపై కుక్కలు దాడి చేశాయి. కుక్కల దాడిలో అవి ప్రాణాలు కోల్పోయాయి. చనిపోయిన రెండు జీవాలను జేసీబీ సహాయంతో పూడ్చివేశారు .

యువకుడి ఆత్మహత్య

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట పట్టణానికి చెందిన చిలివేరి ధనుష్(18) ఆత్మహత్యకు చేసుకున్నాడు. సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ధనుష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులకు వెళ్లి, చికిత్స పొందినా నయం కాలేదు. దీంతో మనస్తాపానికి గురై, ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన సిరికోట రవీంద్రచారి(52) అప్పుల బాధతో నాలుగు రోజులక్రితం పురుగుల మందు తాగాడు. కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయాడు. మృతుడు గ్రామంలోని వెల్డింగ్‌షాపు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. రవీంద్రచారి భార్య నవ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సదాకర్ తెలిపారు.

ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక పోటీలు



కరీంనగర్ స్పోర్ట్స్: ఖోఖో సంఘం కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సీనియర్స్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలకు స్పందన వచ్చింది. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 150 మంది మహిళలు, పురుషులు హాజరయ్యారు. ఉదయం పోటీలను జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజవీరు క్రీడాకారులను పరిచయం చేసుకొని, ప్రారంభించారు. ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో చాంపియన్‌గా నిలవాలని ఆకాంక్షించారు. ఖోఖో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నటరాజ్ రవి, వై.మహేందర్‌రావు, సభ్యులు రవీందర్, దాసరి ప్రసాద్, యోగి సంతోష్, కర్ణాకర్, శేఖర్, శివకుమార్, రాజబాబు, రవళి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


వంశీ


శివ

కరీంనగర్ స్పోర్ట్స్: రాజస్థాన్‌లో ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి జూనియర్స్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్ జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డవేని మధు, జిట్టవేణి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వంశీ, శివ రాణించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, పెటా అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, యూనిస్ పాషా, సంఘం బాధ్యులు కలిగేటి శ్రీనివాస్, జట్టుపల్లి అశోక్, రాజ్‌కుమార్, అనుపరెడ్డి, వీర్‌పాల్ రెడ్డి, భాస్కర్, ఐతరవేని శ్రీనివాస్, వడ్లూరి రాజేందర్, సీనియర్ క్రీడాకారులు ఆదివారం అభినందించారు.

సమీకృత మార్కెట్‌కు సమస్యలు

- పునాదుల్లోనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు
- రెండేళ్లు సమీపిస్తున్నా పనుల్లో పురోగతి శూన్యం
- కొత్తపల్లిలో అర్ధంతరంగా నిలిచిన పనులు

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణ శివారులో నిర్మించతలపెట్టిన సమీకృత మార్కెట్‌కు సమస్యలు తప్పడం లేదు. తెలంగాణ సీడ్ కంపెనీకి చెందిన 127 సర్వే నెంబర్‌లోని రెండెకరాల స్థలంలో రూ.2కోట్ల వ్యయంతో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినా.. పునాదుల్లోనే నిలిచాయి. రాష్ట్ర ప్రభుత్వ పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ పర్యవేక్షణలో ఈ పనులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ నిబంధనల మేరకు కొత్తపల్లి సమీకృత మార్కెట్‌ను ఆరు నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాల్సి ఉంది. అయితే నిర్మాణ పనులు ఆలస్యమవడంతో.. కాంట్రాక్టర్ అలసత్వాన్ని తీవ్రంగా పరిగణించిన అప్పటి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) సదరు కాంట్రాక్టర్ అగ్రిమెంట్‌ను రద్దు చేస్తూ ఇంకో కాంట్రాక్టు సంస్థకు పనులు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయినా ఆ నిర్మాణ సంస్థ ముందుకు రాకపోవడంతో తిరిగి పాత వారుణ్య కన్‌స్ట్రక్షన్స్‌కే పనులు అప్పగించారు. పనులు ప్రారంభించి రెండేళ్లు సమీపిస్తున్నా.. ఎలాంటి పురోగతి లేకపోవడంతో ఈ మార్కెట్ నిర్మాణంపై నీలినీడలు అలుముకున్నాయి. అయితే ఈ కాంట్రాక్టు సంస్థకు సకాలంలో బిల్లులు రాకపోవడంతోనే పనులను అర్ధంతరంగా నిలిపివేసినట్లు తెలిసింది. దీంతో కొత్తపల్లి సమీకృత మార్కెట్ పనులు ఇప్పట్లో ప్రారంభమయ్యేలా కనిపించడం లేదు. కొత్త ప్రభుత్వమైనా ఈ పనులపై దృష్టి సారించి పనులను పునః ప్రారంభించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేట్ తరహాలో..

కొత్తపల్లి పట్టణ శివారులో ఆధునిక హంగులతో సమీకృత మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈ మార్కెట్‌లో 26 కూరగాయల(వెజిటేరియన్) దుకాణాలు, 26 మటన్, చికెన్, చేపల(నాన్‌వెజ్) దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు. అదేవిధంగా ఈ దుకాణాల సముదాయంలో వెజ్, నాన్‌వెజ్‌కు వేర్వేరుగా కోల్డ్ స్టోరేజీల సదుపాయాన్ని ఏర్పాటు చేయాలనుకున్నారు. దీనివల్ల కూరగాయలు, మాంసం స్టోరేజీ చేసుకునే అవకాశముంటుంది. మార్కెట్‌కు వచ్చే వినియోగదారులకు మంచినీటి వసతితో పాటు పార్కింగ్ స్థలాన్ని సైతం ఏర్పాటు చేసేలా డిజైన్ చేశారు. మార్కెట్‌కు వచ్చే వినియోగదారుడికి కూరగాయలు, మాంసం, చేపలు ఒకేచోట దొరికేలా మార్కెట్‌ను నిర్మించాలని నిర్ణయించారు. డిజిటల్ బోర్డులతో ధరలు, భద్రతకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా వినియోగదారులను ఆకర్షించేందుకు సమీకృత మార్కెట్‌ను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్తపల్లి పట్టణంతో పాటు రేకుర్తి, సీతారాంపూర్, చింతకుంట, మల్కాపూర్, లక్ష్మీపూర్, బద్దిపల్లి, వెలిచాల, వెదిర, దేశ్‌రాజ్‌పల్లి, షానగర్, కొక్కెరకుంట, కురిక్యాల, గంగాధర గ్రామాల నుంచి నిత్యం కరీంనగర్‌కు వచ్చే వ్యాపారులు, వినియోగదారులకు ఈ మార్కెట్ ఎంతో ఉపయోగపడనుంది.


కొత్తపల్లి శివారులో నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు

నోటీసులిచ్చాం

కొత్తపల్లి సమీకృత మార్కెట్ పనులు అర్ధంతరంగా నిలిపివేసిన వారుణ్య కన్‌స్ట్రక్షన్ కంపెనీకి నోటీసులిచ్చాం. పనులు వెంటనే ప్రారంభించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించాం.

– ఎస్.సంపత్‌రావు, ఈఈ, పబ్లిక్ హెల్త్

క్లుప్తంగా

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం


ప్లాంట్ ప్రారంభిస్తున్న వైద్యులు

కరీంనగర్‌టౌన్: తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్(తానా) ఆధ్వర్యంలో భగత్‌నగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం తానా ప్రతినిధులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తానా ప్రెసిడెంట్ డాక్టర్ వి.రాకేశ్, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, డాక్టర్ మహేశ్, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ శ్రీధర్, అయ్యప్ప దేవాలయ ఈవో కాంతారెడ్డి, రాజేశ్వరశర్మ, చాణక్యశర్మ, శ్రీనివాసశర్మ, మూర్తిశర్మ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కరీంనగర్: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మలిదశ తెలంగాణ ఉద్యమకారులు సయ్యద్ నయీమ్ రూపొందించిన క్యాలెండర్‌ను మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ ఆదివారం మల్టీప్లెక్స్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మేయర్ వై.సునీల్‌రావు, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్‌కుమార్, నాయకులు రవీందర్‌రెడ్డి, చీటి రాజేందర్, మధుసూదన్, పావని, నాగరాజు, సంప్, ఆనంద్, మారుతి, హరిప్రసాద్, వేణు, సాజిద్, జమీల్, ప్రభావతి, రేణుక, శోభ, మౌలానా హుస్సేన్, ఎండీకే మాజిద్, సయిద్, వహీద్, ఇమామ్‌భాయ్, సలీమ్‌భాయ్, తగ్దీర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం


బహుమతులు అందుకున్న విద్యార్థులు

కరీంనగర్: హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సరస్వతినగర్‌లోని కపిల్ బాలకుటీర్‌లో ఉంటూ సరస్వతి శిశుమందిర్‌లో చదువుతున్న విద్యార్థులకు ఈనెల 12న నిర్వహించే స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించామని సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ తెలిపారు. యావత్ ప్రపంచానికి దిశానిర్దేశం చేసి ఎంతోమందికి ఆదర్శప్రాయుడిగా నిలిచిన మహోన్నత వ్యక్తి వివేకానందుడని అన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ధనపురి సాగర్, బాలకుటీర్ మేనేజర్ గీకూరి శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హమ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

అఖిల భారత సమాఖ్య ఉపాధ్యక్షుడికి సన్మానం


జగదీశ్వర్‌ను సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు

కరీంనగర్ అర్బన్: అఖిల భారత ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మారం జగదీశ్వర్‌ను పశుసంవర్ధక శాఖ అధికారులు ఆదివారం ఘనంగా సన్మానించారు. సదరు శాఖ కార్యాలయంలో డీవీహెచ్‌వో డా.బండారి నరేందర్, ఏడీ వై.జయరాములు, ఆఫీస్ మేనేజర్ మహేందర్, గూడ ప్రభాకర్‌రెడ్డి తదితరులు సన్మానించారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామానికి చెందిన కనకం వెంకటస్వామిని చల్లూరు గ్రామానికి చెందిన తిరుపతి అనే వ్యక్తి కులం పేరుతో దూషించాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. వెంకటస్వామి ఇంటి నిర్మాణం చేపడుతుండగా తిరుపతితో పాటు కొంత మంది వచ్చి భూమి నాదని కులం పేరుతో దూషించాడని ఫిర్యాదు చేశాడని తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సైకి సన్మానం

వీణవంక: వీణవంక ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన వంశీకృష్ణను మండలంలోని పలువురు నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఘనంగా సన్మానించారు.

తిమ్మాపూర్ అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడిగా వంశీ


వంశీని సన్మానిస్తున్న నాయకులు

తిమ్మాపూర్: మండల కేంద్రంలో అంబేడ్కర్ సంఘం తిమ్మాపూర్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఈమేరకు సంఘం నాయకులు సమావేశమై నూతన అధ్యక్షుడిగా బొర్ర వంశీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వంశీ ఓటేసిన సంఘం సభ్యులకు కతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో సంఘ అభివృద్ధికి , అంబేడ్కర్ ఆలోచన, అడుగుజాడల్లో నడవడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాతంగి లక్ష్మణ్, శంకర్, అశోక్, రమేష్, మల్లయ్య, బొర్ర రవి, నగునూరి బాపు, రాజు, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

పైసల వసూళ్లను అడ్డుకున్న గ్రామస్తులు

వీణవంక: మామిడాలపల్లి గ్రామంలో కొందరు వ్యక్తులు ఇసుక లారీలను ఆపి డబ్బులు వసూళ్లు చేస్తుండటంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. గతంలో ఇసుక లారీలు ఢీకొని గ్రామానికి చెందిన వారు చనిపోతే కనీసం అడ్డుకోలేదని, ఇప్పుడు ఎందుకు వసూళ్లు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాముడి అక్షింతలు పంపిణీ


కొత్తపల్లి: అక్షింతలు పంపిణీ చేస్తున్న సభ్యులు

కొత్తపల్లి: అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వారు పంపిన పూజిత అక్షింతల వితరణ కార్యక్రమం ఆదివారం సీతారాంపూర్‌లోని సూర్యనగర్ కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇంటింటా..

కరీంనగర్‌రూరల్: దుబ్బపల్లి, తీగలగుట్టపల్లిలో ఆదివారం అయోధ్య శ్రీరాముడి అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు. రామ జన్మభూమి ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులు శ్రీరాముడి చిత్రపటం, అక్షింతల కలశంతో తీగలగుట్టపల్లిలోని మానికేశ్వరీనగర్, అన్విత గార్డెన్ ఏరియాలో రామనామం జపిస్తూ ఇంటింటా తిరుగుతూ అక్షింతలను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గాండ్ల శ్రీనివాస్, రంగారెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


తీగలగుట్టపల్లిలో అక్షింతలతో భక్తులు

మానకొండూర్ మండలంలో..

మానకొండూర్: మండలంలోని చెంజర్ల, గంగిపల్లి, గట్టుదుద్దెనపల్లి గ్రామాలలో అయోధ్య రాములోరి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. అవకాశాన్ని ప్రజలు, భక్తులు సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోళ్ల వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ గడ్డి గణేశ్, ఎదులాపురం అశ్వన్‌తేజ్, తంశెట్టి రాజేశ్, సాయిరి రమేశ్, రమణారెడ్డి, భాస్కరాచారి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పంటల సాగుపై సర్వే

- వివరాలు సేకరిస్తున్న ఏఈవోలు
- క్రాప్‌బుకింగ్ యాప్‌లో నమోదు

కరీంనగర్‌రూరల్: యాసంగి సీజన్ పంటల సాగు వివరాల నమోదు ప్రక్రియను వ్యవసాయాధికారులు ప్రారంభించారు. గత నెల 28 నుంచి ఈ నెల 6వరకు ప్రజాపాలన గ్రామసభలుండటంతో పంటల సాగు వివరాల సేకరణను ప్రభుత్వం వాయిదా వేసింది. ప్రభుత్వ ఆదేశాలతో శుక్రవారం నుంచి కరీంనగర్ మండలంలో పంటల సాగు వివరాలను ఏఈవోలు స్వర్ణలత, అనుజ్ఞ, ప్రణయ్, పైడితల్లి సేకరిస్తున్నారు. తమ క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటల వద్దకు ఏఈవోలు వెళ్లి వివరాలను క్రాప్ బుకింగ్ యాప్‌లో నమోదు చేస్తున్నారు.

పొలం వద్దకు వెళ్తేనే..

క్రాప్ బుకింగ్ కోసం ఏఈవోలు ఉపయోగిస్తున్న సెల్‌ఫోన్‌లో ఏఈవో యాప్ పొలం వద్దకు వెళ్తేనే పనిచేస్తోంది. పొలానికి దాదాపు 50 మీటర్ల దూరం వెళ్తే రైతుల పేర్లు, సర్వే నంబర్ల వివరాలు యాప్‌లో కన్పిస్తాయి. రైతు వారీగా ఏ పంట సాగు చేశారు, ఏ రకం విత్తనం వేశారు, సాగునీటి సౌకర్యం తదితర వివరాలను నమోదు చేస్తారు. ఇప్పటివరకు మొత్తం 740 మంది రైతులకు చెందిన 963 ఎకరాల్లోని పంటల వివరాలను క్రాప్‌బుకింగ్ యాప్‌లో నమోదు చేశారు. చామనపల్లి క్లస్టర్ పరిధిలో 109 మంది రైతులకు చెందిన 142 ఎకరాలు, దుర్శేడ్ పరిధిలో 393 రైతుల 507 ఎకరాలు, మొగ్ధుంపూర్‌లో 217 రైతుల 286, నగునూరులో 21మంది రైతులకు చెందిన 27.10 ఎకరాలున్నాయి.


గోపాల్‌పూర్‌లో పంటల సర్వే చేస్తున్న ఏఈవో పైడితల్లి

యాసంగిలో సాగయ్యే పంటల వివరాలు

పంట	ఎకరాలు
వరి	12,185
మొక్కజొన్న	275
పెసర	10
కందులు	24
కూరగాయలు	285

పక్కాగా పంటల వివరాలు నమోదు

సర్వే నంబర్లవారీగా పంటల వివరాలను క్రాప్ బుకింగ్ యాప్‌లో పక్కాగా నమోదు చేయడం జరుగుతోంది. క్లస్టర్ల పరిధిలోని గ్రామాల్లో సాగు చేసిన పంటలను ఏఈవోలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి వివరాలు నమోదు చేస్తున్నారు. ప్రస్తుతం వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. – **బి.సత్యం, మండల వ్యవసాయ అధికారి**

చేనులోనే తెల్ల బంగారం

రైతులు తెల్ల బంగారంగా భావించే పత్తి చేన్లలోనే ఉండిపోతోంది. కూలీల కొరతతో రైతులు పత్తి ఏరడం లేదు. ప్రస్తుతం కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో యాసంగి సీజన్ వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీలందరూ నాటేసేందుకు పోతుండటంతో.. పత్తి ఏరేందుకు ఎవరూ దొరకని పరిస్థితి ఏర్పడింది. కూలీల కొరత కారణంగా పలు గ్రామాల్లో చేన్లలోనే పత్తి తెల్లగా మెరుస్తూ కనిపిస్తోంది.

- కరీంనగర్‌రూరల్


ఇరుకుల్లలో పత్తి పంట



నృత్యం చేస్తున్న విద్యార్థులు


నృత్యం తిలకిస్తున్న ప్రసాద్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు

పారమితలో సత్యోత్సవం

కొత్తపల్లి: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో సత్యోత్సవం అనే పేరుతో ఘనంగా వార్షిక వేడుకలు నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త, పారమిత, ఎక్స్‌ప్లోరికా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాద్‌రావు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్యమేవ జయతే అనే అంశం ఆధారంగా జరిగిన సత్యోత్సవం అనే ఈ వార్షికోత్సవంలో విద్యార్థులు తమ అద్భుత ప్రదర్శనలతో అలరించారు. నృత్యాలు, పాటలు, నాటకాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ విద్యాసంవత్సరంలో స్కాలర్‌షిప్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు మొదటి బహుమతి రూ.50,000, ద్వితీయ బహుమతి రూ.35,000, తృతీయ బహుమతి రూ.25,000 4, 5 స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10,000 మొత్తం రూ.5,20,000 నగదు బహుమతులను డా.ఇ.ప్రసాద్‌రావు అందజేశారు. ఈ విద్యాసంవత్సరంలో విద్య, ఇతర కళల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులను నగదు, జ్ఞాపికలతో అభినందించారు. డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, వినోదరావు, రాకేశ్ ప్రసాద్, ప్రాచీ, వి.యు.ఎం.ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు రితేష్ మెహత, ప్రోగ్రామ్ హెడ్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు రాము, రబీంద్ర పాత్రో, హరిప్రియ, సరిత తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

విద్యానగర్(కరీంనగర్): క్రీడలు మానసిక వికాసానికి దోహదపడతాయని జిల్లా మహిళ, శిశు సంక్షేమాధికారి సరస్వతి అన్నారు. కరీంనగర్ జగిత్యాల రోడ్‌లోని ది ప్లే స్కూల్‌లో ఆదివారం క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. చిన్నారులకు క్రీడల పట్ల ఆసక్తి పెంచాలన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వం పెరుగుతుందని అన్నారు. చిన్నారుల ఆటాపాట అలరించాయి. చిన్నారుల తల్లిదండ్రులకు కూడా వివిధ ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. డీవైఎస్‌వో కీర్తి రాజవీరు, పాఠశాల చైర్మన్ పోల్సానీ సుధాకర్‌రావు, కార్యదర్శి రమాదేవి, ప్రిన్సిపాల్ ప్రభాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సరస్వతి


చిన్నారుల ప్రదర్శన

లోకేశ్ మాకొద్దు 'బాబూ'..!

చినబాబు పర్యటనలతో పార్టీ పరువు పోతోందని తమ్ముళ్ల గగ్గోలు

- ఆయన ప్రసంగాలు, వ్యవహారశైలి బాగోలేదని ఆందోళన
- అందుకే వ్యూహాత్మకంగా పాదయాత్ర తర్వాత లోకేశ్ పర్యటనలకు చంద్రబాబు చెక్
- 'రా కదలిరా', జయహో బీసీ వంటి ముఖ్య కార్యక్రమాలకూ దూరం
- మంగళగిరికే పరిమితమై అప్పుడప్పుడు లోకల్‌గా చక్కర్లు



సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీకి 'లోకేశ్' తలనొప్పి పట్టుకుంది. ఆ పేరు వింటేనే ఆ పార్టీ నేతలు బెంబేలెత్తిపోతున్నారు. ఆయనవల్ల పార్టీ పరువుతో పాటు తమ పరువు పోతోందని లబోదిబోమంటున్నారు. తమ నియోజకవర్గాలకు ఆయన రాకుండా చూడాలని ముఖ్య నేతలకు బహిరంగంగానే వేడుకుంటున్నారు. లోకేశ్ ప్రసంగాలు, వ్యవహారశైలి వల్ల ఉన్న ఓట్లుకూడా పోయే పరిస్థితి ఉందని వారు మొత్తుకుంటున్నారు. లోకేశ్ మాట్లాడేటప్పుడు అన్నీ తప్పులు మాట్లాడడం, తెలుగు పదాలు సరిగా ఉచ్ఛరించలేకపోవడం వల్ల సోషల్ మీడియాలో లోకేశ్ తొలినుంచి విపరీతంగా ట్రోల్ అవుతున్న విషయం తెలిసిందే. అవగాహనా రాహిత్యంతో ఏదో ఒకటి మాట్లాడేయడం వల్ల ఆయనవల్ల పార్టీ అనేక సార్లు ఇరకాటంలో పడింది. ప్రజలను ఆకర్షించలేక పోగా ఆయన చేష్టలు, డైలాగులవల్ల పార్టీకి నష్టమే తప్ప ఎలాంటి లాభంలేదనే భావన మొదటి నుంచి పార్టీ నేతల్లో బలంగా నాటుకుపోయింది. కానీ, తానే పార్టీని మొత్తం నడిపిస్తున్నట్లు లోకేశ్ బిల్డప్ ఇస్తూ పర్యటనలు చేసి తమకు ఎక్కడలేని ఇబ్బందికర పరిస్థితులు సృష్టించారని పార్టీ నేతలు చెబుతున్నారు. ఇదే విషయాన్ని చంద్రబాబుకు పలువురు ముఖ్యులు అనేకసార్లు చెప్పినా ఆయన విని ఊరుకునే వారే తప్ప ఎలాంటి స్పందన ఉండేది కాదు. ఇప్పుడు ఎన్నికల సమీపించడంతో నేతలు ఈ విషయాన్ని గట్టిగా చెబుతుండడంతో పార్టీ శ్రేణుల ఒత్తిడికి చంద్రబాబు తలొగ్గక తప్పలేదు. దీంతో ప్రస్తుత పరిస్థితుల్లో లోకేశ్‌ను జిల్లా పర్యటనలకు దూరంగా ఉంచాలని చంద్రబాబు నిర్ణయించారు. దీంతో కొద్దిరోజులుగా లోకేశ్ జిల్లాల పర్యటనలు చేయడం లేదు. పార్టీ ముఖ్య కార్యక్రమాలకు సైతం ఆయన్ను రానీయడంలేదు. యువగళం పాదయాత్ర తర్వాత లోకేశ్ జిల్లా పర్యటనలు, పార్టీ ముఖ్య కార్యక్రమాలకు సైతం దూరంగా ఉంటున్నారు.

పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్‌తో కనువిప్పు..

నిజానికి.. లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్ అయింది. దీనికోసం తెలుగుదేశం పార్టీ నాయకులు, శ్రేణులు పడ్డ కష్టాలు అన్నీఇన్నీ కావు. సోషల్ మీడియా, ఎల్లో మీడియాలో ఆయనకు ఎంత ప్రచారం కల్పించినా బూడిదలో పోసిన పన్నీరైంది. ఆయన సభలకు జనాన్ని సమీకరించలేక నేతలు చేతులెత్తేశారు. డబ్బులిచ్చినా, ప్రలోభాలకు గురిచేసినా లోకేశ్ సభలంటే జనం వచ్చే పరిస్థితిలేదని పార్టీ నేతలు తరచూ వాపోయేవారు. ఈ సమయంలో.. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు అరెస్టవడంతో లోకేశ్ తన పాదయాత్రను అర్థాంతరంగా నిలిపివేశారు. తనను కూడా అరెస్టుచేస్తారనే భయంతో ఢిల్లీ వెళ్లి అక్కడే మకాం వేశారు. ఆ సమయంలో పాదయాత్ర కొనసాగించాలని పార్టీ నేతలు ఎంత ఒత్తిడి చేసినా అరెస్టు భయంతో ఆయన జనాల్లోకి రాలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆయన తల్లి భువనేశ్వరితో తూతూమంత్రంగా 'నిజం గెలవాలి' పేరుతో ఒక కార్యక్రమం మొదలుపెట్టినా దానికీ ఆదరణ లభించలేదు. చంద్రబాబు జైలు నుంచి బయటకు వచ్చాక లోకేశ్ తన పాదయాత్ర రూటుమార్చేసి, నడవలేక చేతులెత్తేసి చివరికి మమ అనిపించారు.

లోకేశ్ మంగళగిరికే పరిమితం..

ఈ పరిస్థితుల్లో.. లోకేశ్‌ను తెరవెనుక నుంచే ఎన్నికలకు పని చేయించాలని ముఖ్య నేతలు సూచించినట్లు సమాచారం. ఆయన పార్టీ కార్యక్రమాలు నిర్వహించడంవల్ల నష్టమని వ్యూహకర్తలు కూడా తేల్చిచెప్పినట్లు తెలిసింది. దీంతో లోకేశ్‌ను ప్రస్తుతం మంగళగిరికి మాత్రమే పరిమితం చేశారు. ముఖ్యమైన పార్టీ కార్యక్రమాలకు సైతం ఆయన రావడంలేదు. చంద్రబాబు చేపట్టిన 'రా కదలిరా' కార్యక్రమాలకు ఆయన దూరంగానే ఉంటున్నారు. ఇటీవల నిర్వహించిన 'జయహో బీసీ' కార్యక్రమానికి సైతం చిన్నబాబు దూరంగా ఉన్నారు. గత ఎన్నికల్లో తాను పోటీచేసి ఓడిపోయిన మంగళగిరి నియోజకవర్గంలోనే ఆయన అడపాదడపా తిరుగుతున్నారు. అక్కడ డబ్బులిచ్చి కొందరు నాయకుల్ని మేనేజ్ చేస్తూ బిల్డప్ ఇచ్చుకోవడం.. చోటామోటా నేతలకు కండువాలు కప్పి పార్టీలో చేరినట్లు చెప్పుకోవడం, స్థానికంగా చిన్నపాటి సమావేశాలతోనే ఆయన సరిపెట్టుకుంటున్నారు. అది కూడా కొంత సమయం మాత్రమే. ఎక్కువగా ఆయన హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. వచ్చే ఎన్నికల్లో అయినా ఎమ్మెల్యేగా గెలవాలని సూచిస్తూ ఆయన్ను మంగళగిరిపైనే ఎక్కువ దృష్టి కేంద్రీకరించేలా చేయడంలో పార్టీ నేతలు ఓ రకంగా సఫలమయ్యారు. తద్వారా లోకేశ్ గండం నుంచి ప్రస్తుతానికి గట్టెక్కామని వారు భావిస్తున్నారు. తమ నియోజకవర్గాలకు ఆయన రాకుండా చూసుకుంటూ కొంతవరకైనా పరువు నిలుపుకోగలిగామని సంబరపడుతున్నారు.

మొత్తం మీద యువగళం పాదయాత్రవల్ల టీడీపీకి మైలేజ్ సంగతి ఎలా ఉన్నా అభాసుపాలైన ఘటనలే ఎక్కువ జరిగాయి.

'ఇక్కత్'కు ఇక్కట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

పటిష్టమైన చర్యలు తీసుకోవాలని చేనేత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

బ్రాండ్ ఇమేజ్‌పై దెబ్బ

పట్టుదారానికి రంగులద్ది డిజైన్‌లు కట్టి నేసే ఇక్కత్ పట్టు చీరకు ఓ బ్రాండ్ ఇమేజ్ ఉంది. ఈ చీరలకు మహిళల్లో విశేష ఆదరణ ఉంది. పోచంపల్లి కేంద్రంగా తయారయ్యే పట్టు చీరలకు అంతర్జాతీయంగా గుర్తింపు కూడా ఉంది. అలాంటి పట్టు చీరల డిజైన్లను నిబంధనలకు విరుద్ధంగా ప్రింట్ చేసి తక్కువ ధరలకు బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. దీంతో చీర ధర పడిపోవడం, ఏది అసలీనో ఏది నకిలీనో గుర్తించలేకపోవడం, ఆన్‌లైన్‌లో మోసాలు జరగడం లాంటివి కూడా చోటు చేసుకుంటున్నాయి. గత రెండేళ్లుగా గుజరాత్‌లోని సూరత్ కేంద్రంగా పోచంపల్లి డిజైన్లతో ప్రింటెడ్ పాలిస్టర్ చీరలు బహిరంగ మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ఈ చీరలు రూ.600 నుంచి రూ.1000 లోపే లభిస్తుండటంతో కొనుగోలుదారులు ఆకర్షితులవుతున్నారు.

భారీగా పడిపోయిన అమ్మకాలు: ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో 12,000 మంది చేనేత కళాకారులకు జియో ట్యాగ్ ఉంది. అంటే ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రతినెలా ఒక జియో ట్యాగ్ కళాకారుడితోపాటు మరో ఇద్దరు అనుబంధ కళాకారులు ఉంటారు. అంటే సుమారు 36 వేల మంది నేరుగా వృత్తిలో ఉన్నారు. నెలకు ఒక చేనేత కుటుంబం ఐదు చీరలు తయారు చేస్తుంది. ఇలా తయారైన చీరలతో గతంలో నెలకు రూ. 40 కోట్ల వ్యాపారం జరిగేది. ప్రస్తుతం ప్రింటెడ్ చీరలు రాకతో రూ.20 కోట్లకు అంటే సగానికి సగం వ్యాపారం పడిపోయిందని నేతన్నలు చెబుతున్నారు.

మూట వ్యాపారం దాకా విస్తరణ: పోచంపల్లి ప్రింటెడ్ పట్టు చీరలు ఇప్పుడు గ్రామాల్లో మూట వ్యాపారం దాకా వచ్చాయి. గతంలో పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్‌లోనే లభించే ప్రింటెడ్ చీరలు ఇప్పుడు పల్లెల్లోనూ అమ్ముతున్నారు. ప్రింటెడ్ చీరల అమ్మకాలను అరికట్టాల్సిన యంత్రాంగం చేతులెత్తేయడంతో పోచంపల్లి చీరల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని స్థానిక సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

ప్రింటెడ్ చీరలను అదుపు చేయాలి



జీఐ పొందిన ఇక్కత్ చేనేత చీరలను పోలిన ప్రింటెడ్ చీరల తయారీని ప్రభుత్వం అరికట్టాలి. ఇటీవల పోచంపల్లికి వచ్చిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కేంద్ర జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రచనా సాహు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాం. గుజరాత్‌లో ప్రింటెడ్ చీరల తయారీని, షాపింగ్ మాల్స్‌లో అమ్మకాలను నిరోధించాలి. కల్యాణ లక్ష్మి నగదు సహాయంతోపాటు పోచంపల్లి పట్టు చీరను వధువుకు ఇవ్వాలి. ఇక్కత్ వృత్తిని కాపాడాలి.

– తడ్క రమేష్, చేనేత సంఘం నాయకులు, పోచంపల్లి

మాల్స్‌పై మరిన్ని దాడులు చేస్తాం

పోచంపల్లి పట్టు చీరలను పోలిన ప్రింటెడ్ చీరలు సూరత్ నుంచి వస్తున్నాయి. షాపింగ్ మాల్స్‌లో అమ్ముతున్నారన్న విషయాన్ని గుర్తించి దాడులు చేస్తున్నాం. ప్రతి డిజైన్‌ను కాపీతో ప్రింట్ చేసి చీరలను విక్రయిస్తున్నారు. చేనేత వృత్తిదారులకు ఇది తీరని నష్టం కలిగిస్తోంది. త్వరలో మరిన్ని దాడులు చేయబోతున్నాం.

– వెంకటేశ్వర్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి

పాతబస్తీలో యువతిపై గ్యాంగ్‌రేప్

- రాత్రివేళ ఎంజీబీఎస్ బయట ఎత్తుకెళ్లిన ఇద్దరు దుండగులు
- సోదరుడితో గొడవపడి సూర్యాపేట నుంచి వచ్చిన బాధితురాలు

చాంద్రాయణగుట్ట: హైదరాబాద్ పాతబస్తీలోని బండ్లగూడలో అమానుష ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులతో గొడవపడి రాత్రిపూట సూర్యాపేట నుంచి నగరానికి వచ్చిన ఓ యువతిపై ఇద్దరు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన చాంద్రాయణగుట్టలోని బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేటకు చెందిన యువతి (21) తన సోదరుడు, తల్లితో కలసి అక్కడే ఉంటోంది. ఈ నెల 6న సోదరుడితో గొడవ జరగడంతో అతడు ఆమెపై చేయిచేసుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన యువతి.. సూర్యాపేటలో బస్సెక్కి ఎంజీబీఎస్‌లో రాత్రి 10:40 గంటలకు దిగింది. బయటకు వచ్చిన ఆమె టీ తాగి రోడ్డు దాటుతుండగా అటుగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమెను ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. ఏదైనా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలని యువతి తెలిపింది. అయితే తాము కూడా అటే వెళ్తున్నామంటూ బైక్ ఎక్కాలని కోరారు. అయితే తాను ఆటోలో వస్తానని చెప్పినా వినకుండా యువతిని బైక్‌పై ఎక్కించుకున్నారు. ఆపై సిద్దంబర్ బజార్‌కు తీసుకెళ్లి ఐస్‌క్రీమ్ తినిపించి చాంద్రాయణగుట్ట బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గోడౌన్‌కు తీసుకెళ్లారు. ఆమెను కొట్టి బలవంతంగా ఒకరి తర్వాత మరొకరు అత్యాచారానికి పాల్పడ్డాడు. వారి చెర నుంచి తప్పించుకున్న బాధితురాలు.. బయటకు పరుగుతీసి కేకలు వేయడంతో స్థానికులు గమనించారు. దీంతో నిందితులు పరారయ్యారు. సమాచారం అందుకున్న బండ్లగూడ పోలీసులు అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో ఘటనాస్థలికి చేరుకొని బాధితురాలిని స్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు స్వీకరించారు. కాగా, నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

'ఇందిరమ్మ'లోకి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు!

గత ప్రభుత్వం ప్రారంభించిన ఇళ్లు దాదాపు 2.28 లక్షలు.. వాటిల్లో పూర్తయినవి 1.53 లక్షలు

గత బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలోకి మార్చి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని భావిస్తోంది. దాదాపు 1.23 లక్షల రెండు పడక గదుల ఇళ్లు ఇంకా లబ్ధిదారులకు కేటాయించాల్సి ఉంది. వాటిని భవిష్యత్తులో ఇందిరమ్మ పథకం కింద దరఖాస్తు చేసిన పేదలకు కేటాయించే దిశగా అడుగులు పడుతున్నాయి.

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వివిధ పథకాల లబ్ధి కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. దాదాపు కోటికిపైగా దరఖాస్తులు రాగా, వాటిల్లో ఇళ్లకు సంబంధించే 15 లక్షలకుపైగా వచ్చి ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ దరఖాస్తుదారుల్లో అర్హులను గుర్తించిన తర్వాత ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే పూర్తయినవి కొన్ని, వివిధ దశల్లో ఉన్నవి కొన్ని, ప్రారంభించాల్సినవి కొన్ని.. ఇలా 1.23 లక్షల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఉన్నాయనేది అధికారుల లెక్క. వాటిని ఆయా ప్రాంతాల లబ్ధిదారులకు కేటాయించాలని ప్రభుత్వం భావిస్తోంది.

బీఆర్ఎస్ పూర్తి చేసిన ఇళ్లు 1.53 లక్షలు..

పేదలకు దేశంలో ఎక్కడా లేని తరహాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఉచితంగా అందించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదిస్తూ రెండు పడక గదుల ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ పథకం కింద 2.90 లక్షల ఇళ్లను నిర్మించాలని నిర్ణయించగా, 2.28 లక్షల ఇళ్లకు టెండర్లు ఖరారు అయ్యాయి. వాటిల్లో 1.53 లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. వీటిల్లో నుంచి నగరం, శివారు ప్రాంతాల్లో 66 వేల ఇళ్లను, ఇతర జిల్లాల్లో మరో 40 వేల ఇళ్లను మొత్తంగా లక్షా 6వేల ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇంకా 47వేల ఇళ్ల నిర్మాణం పూర్తయినా ఎవరికీ పంపిణీ చేయలేదు. ఇక నిర్మాణాలు పూర్తి చేసుకునే దిశలో మరో 40 వేల ఇళ్లున్నాయనీ, కాంట్రాక్టర్లతో అగ్రిమెంటు పూర్తి అయి, పనులు మొదలుపెట్టిన ఇళ్లు మరో 36 వేల వరకు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. మొత్తంగా ఈ 1.23లక్షల ఇళ్లను ఇప్పుడు ఇందిరమ్మ పథకంలోకి మార్చి, తాజాగా అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు పంపిణీ చేయాలన్న దిశలో ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలుస్తోంది.

ఇంకా రూ.నాలుగున్నర వేల కోట్లు కావాలి

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల యూనిట్ కాస్ట్ 5.40 లక్షల మేర ఉన్నందున ఈ ఇళ్ల నిర్మాణానికి భారీగా ఖర్చు అవుతోంది. ఇప్పుడు వివిధ స్థాయిలో నిలిచి ఉన్న ఇళ్లను పూర్తి చేసేందుకు ఇంకా రూ.4500 కోట్లు అవసరమని గృహనిర్మాణ మండలి అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించారు. ఇందిరమ్మ పథకం కింద ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇందిరమ్మ ఇళ్లతో పోలిస్తే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ వ్యయం కొంత ఎక్కువే అయినా, ఇప్పటికే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం భారీగా ఖర్చు చేసి ఉన్నందున మిగతా అసంపూర్తి ఇళ్లను కూడా పూర్తి చేయాల్సి ఉంది. ఇక కొత్తగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రారంభించే వీలు లేనందున ఉన్నవాటిని పూర్తి చేసి వాటిని వదిలించుకోవాలని భావిస్తోంది. ఆ ఇళ్లను పూర్తి చేస్తే వాటికి మంచి డిమాండే ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. గతంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అనుసరించిన విధానం ద్వారా ఈ ఇళ్లను కూడా కేటాయించాలని యోచిస్తున్నారు.

'గిరి' క్రీడాకారుల విజయోత్సవం



క్రీడాకారులు, ట్రోఫీతో ఎమ్మెల్యే, పీవో, సీఎండీ, అధికారులు

ఉట్నూర్‌రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ నెల 4నుంచి 6వతేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాల్లో తొలిసారి చాంపియన్‌షిప్ సాధించి ఉట్నూర్‌కు వచ్చిన క్రీడాకారులకు ఆదివారం ఉదయం తోటి విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. ఐబీ చౌరస్తా వద్ద పటాకులు కాల్చారు. క్రీడాకారులపై పూలవర్షం కురిపించారు. వారికి పూలమాలలు వేసి మిఠాయి తినిపించారు. డీజే పాటల మధ్య ట్రోఫీని ప్రదర్శిస్తూ క్రీడాకారులు, అధికారులు నృత్యాలు చేశారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి చాహత్‌బాజ్‌పాయ్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, డీడీ దిలీప్‌కుమార్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏసీఎంవో జగన్ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏజెన్సీలో క్రీడల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఐటీడీఏ పీవో మాట్లాడుతూ.. రాష్ట్ర గిరిజన క్రీడోత్సవాల్లో ఐటీడీఏ ఉట్నూర్ క్రీడాకారులు తొలిసారి ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించడం ఆనందంగా ఉందని తెలిపారు. అధికారులు, పీఈటీలు, కోచ్‌లను అభినందించారు. త్వరలో జరగనున్న ఐఎస్ఎల్ క్రీడల్లోనూ సత్తా చాటాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు చందన్, కృష్ణారావు, ప్రేందాస్, గిరిజన సహాయ క్రీడల అధికారులు రమేశ్, హే మంత్, రవీందర్, శ్రీనివాస్, గోపాల్, జల్పతి పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి



పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



నృత్యం చేస్తున్న వలంటీర్లు

భైంసా: చదువుకుంటూనే సమాజ సేవలో భాగస్వాములు కావాలని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్ సూచించారు. ఆదివారం ట్రిపుల్‌ఐటీలో ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) ఓరియంటేషన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ట్రిపుల్‌ఐటీలో ఐదు యూనిట్లు కేటాయించి 500 మంది విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సంఘ సేవలో పాలుపంచుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలకు గుర్తింపుగా ధ్రువీకరణ పత్రాలు అన్ని యూనివర్సిటీలు అందిస్తున్నాయని చెప్పారు. ఉద్యోగ నియామకాలు, ఇతర సందర్భాల్లో ఇవి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్‌లో చేరినవారు క్రమశిక్షణతో పాటు సామాజిక చైతన్యం కలిగి జీవితంలో ముందుకువస్తారని వివరించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాకేశ్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రామారావు, రాములు, శ్రావణ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రాదేవికి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: పుష్యమాసం సమీపిస్తుండడంతో మండలకేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. తమ ఆరాధ్య దైవాన్ని దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లా నుంచి ఆదివాసీలు భారీగా తరలివస్తున్నారు. ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ మహారాజ్ సూర్యరావ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

పెర్సపేన్ ఉత్సవాలు వైభవంగా నిర్వహిద్దాం

ఇంద్రవెల్లి: పుష్యమాసంలో నిర్వహించే కుల దేవత (పెర్సపేన్) ఉత్సవాలను వైభవంగా నిర్వహిద్దామని నిర్వాహకులు జుగ్నాక్ మహదు, జుగ్నాక్ జైతు అన్నారు. మండలంలోని వాల్గొండ పంచాయతీ పరిధి పొల్లుగూడలో ఉమ్మడి జిల్లా జుగ్నాక్ వంశీయుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుల దేవత ఉత్సవాలపై చర్చించారు. అలాగే సతిక్ దేవత ఆలయ ప్రారంభోత్సవం మేలో నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ పోల్లు, ఇంద్రవెల్లి మాజీ సర్పంచ్ సుంకట్‌రావ్, గ్రామస్తులు శంకర్, భరత్, జాలింరావ్, నాందేవ్, కాశీరాం, తదితరులున్నారు.



పొల్లుగూడలో సమావేశమైన ఉమ్మడి జిల్లా జుగ్నాక్ వంశీయులు

సరి 'హద్దుల్లోనే' మావోయిస్టులు

- కనుమరుగవుతున్న పార్టీ కార్యకలాపాలు
- పొరుగు రాష్ట్రాల్లోనే అగ్రనేతల మకాం
- ప్రశాంత జీవనంలో ప్రభావిత ప్రాంతాలు



మంథని: నక్సలైట్ల ఆగడాలు, పోలీసుల మెరుపు దాడులతో సుమారు నాలుగు దశాబ్దాల పాటు దద్దరిల్లిన ఉత్తర తెలంగాణలోని దండకారణ్య ప్రాంతం ప్రస్తుతం ప్రాజెక్టుల నిర్మాణంతో పచ్చని పంటలు, ప్రశాంతతకు నిలయంగా మారింది. నక్సల్స్ ఆకు చప్పుట్లు.. పోలీసుల బూట్ల చప్పుట్లు ప్రభావిత ప్రాంతాల్లో కనపడకపోవడంతో నిత్యజీవనం సాఫీగా సాగుతోంది. ఉత్తర తెలంగాణలోని అటవీ, మైదాన ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పెను సవాల్‌గా మారిన మావోయిస్టు పార్టీ కార్యకలాపాలు క్రమక్రమంగా కనుమరుగయ్యాయి. మారిన పరిణామాల నేపథ్యంలో నిత్యనిర్బంధాన్ని ఎదుర్కొన్న మావోయిస్టు పార్టీ.. పలువురు కీలక నేతలను ఎన్‌కౌంటర్లలో కోల్పోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల వైపు వెళ్లి ఆ ప్రాంతాల్లో కార్యక్రమాలు విస్తృతం చేసే పనిలో నిమగ్నమైంది. మావోయిస్టు పార్టీలో కీలక నేతలు తెలుగువారే అయినా.. మళ్లీ తెలంగాణకు రావాలనుకున్న వారి ప్రణాళికలకు ఇక్కడి పోలీసులు ఎప్పటికప్పుడు అడ్డుకట్ట వేస్తున్నారు. నక్సల్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడంలో పోలీసులు కీలకపాత్ర పోషించారు.

పోస్టర్లకే పరిమితం..

- కరీంనగర్ తూర్పు డివిజన్ పరిధిలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని అటవీ గ్రామాల్లో అడపాదడపా పోస్టర్లు వేయడం మినహా సుమారు ఐదేళ్లుగా మావోయిస్టు కార్యకలాపాలు పెద్దగా కనిపించడంలేదు.
- ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో సైతం వారి ఉనికి పత్రికా ప్రకటనలకే పరిమితమైంది.
- బడే దామోదర్, కంకణాల రాజిరెడ్డి లాంటి కీలక నేతలు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో మకాం వేసి.. తెలంగాణలో పాగా వేయాలనుకున్నా పోలీసుల వ్యూహాలను ఛేదించలేకపోయారు.
- అందివచ్చిన సాంకేతికత ఒకవైపు, అభివృద్ధి కార్యక్రమాలు మరోవైపు అటవీ గ్రామాల్లోని ప్రజల్లో పెనుమార్పులు తీసుకొచ్చాయి.
- ఇలాంటి పరిస్థితుల్లో మావోయిజం 'మనకెందుకు' అని అటవీ ప్రాంతాల్లోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల ప్రజలు పాతవాసన వైపు వెళ్లడంలేదని భావిస్తున్నారు.
- అభివృద్ధి.. సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నక్సలైట్ల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

పోలీసులదే పైచేయి..

మావోయిస్టులు తెలంగాణ వైపు చూసే క్రమంలో కంటిచూపు కంటే వేగంగా నిఘావర్గాలు వారి కదలిలు పసిగట్టి ఎప్పటికప్పుడు కట్టడి చేస్తున్నాయి. దీంతో ఇవి మావోయిస్టులకు మింగుడు పడడం లేదని తెలుస్తోంది. భవిష్యత్‌పై భరోసా లేక, ఉద్యమాన్ని విస్తృత పరచలేక అగ్రనాయకత్వం సైతం అయోమయంలో ఉన్నట్లు నిఘావర్గాల ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో రాష్ట్ర కమిటీ, ఏరియా కమిటీల ఉనికి పూర్తిస్థాయిలో ప్రశ్నార్థకంగా మిగిలింది. కమిటీలు ఉన్న మాటే గానీ.. సభలు సమావేశాలు అటు ఉంచితే కనీసం ఉనికి చాటుకునే ప్రయత్నంలో కూడా ఉద్యమ నిర్మాణం ముందుకు సాగడం లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ఎల్‌ఎండీ ఎస్సారెస్పీ కార్యాలయంలో చోరీ

- సీపీయూలు, మానిటర్లు, ప్రింటర్లు మాయం
- ఇంటి దొంగల పనేనా?
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ చేరాలు

తిమ్మాపూర్(మానకొండూర్): తిమ్మాపూర్ మండలం ఎల్‌ఎండీ కాలనీలోని ఎస్సారెస్పీ నీటిపారుదల శాఖ డివిజన్ నంబర్–5 కార్యాలయంలో ఆదివారం సాయంత్రం చోరీ జరిగింది. నాలుగు సీపీయూలు, ఐదు మానిటర్లు, రెండు ప్రింటర్లు ఎత్తికెళ్లినట్టు అధికారులు తెలిపారు. ఎల్‌ఎండీ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ చేరాలు సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వాచ్‌మెన్ బయటకు వెళ్లాక..

దొంగతనం సాయంత్రం 5 నుంచి 6 గంటల ప్రాంతంలో జరిగినట్లు పోలీసులు ధ్రువీకరించారు. రాత్రి విధుల్లో ఉండే వాచ్‌మెన్ సాయంత్రం 4 గంటల వరకు అక్కడే ఉండి, గంటసేపు బయటకు వెళ్లాడు. అతను తిరిగి వచ్చేసరికి తాళాలు తీసి ఉండటంతో ఆందోళనకు గురయ్యాడు. వెంటనే అధికారులకు సమాచారం అందించాడు. కార్యాలయంలోకి వెళ్లిన దుండగులకు ఇతర తాళాలు ఎక్కడ ఉంటాయో తెలియడం ప్రశ్నార్థకంగా మారింది. తెలిసినవారే చోరీకి పాల్పడి ఉంటారా అని పోలీసులు అనుమానిస్తున్నారు. చోరీ జరిగిన స్థలంలో ముఖ్య అధికారుల కంప్యూటర్లు వదిలి ఇతర అధికారుల సీపీయూ, మానిటర్లు ఎత్తుకెళ్లడం అనుమానాలకు తావిస్తోంది. కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు. ఫింగర్ ప్రింట్ సేకరణకు క్లూస్ టీం అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు సోమవారం ఉదయం వస్తారని తెలిసింది. వాళ్లు వస్తే కీలక సమాచారం బయటపడే అవకాశాలున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

రికార్డులు మాయం చేసేందుకేనా?

కార్యాలయానికి సంబంధించి రివ్యూ సమావేశాలు ఇటీవల రెగ్యులర్‌గా జరుగుతున్నట్లు సమాచారం. వాటి వివరాల రికార్డులు మాయం చేసేందుకే చోరీ జరిగిందా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఏదేమైనా నిందితులను పట్టుకొని, ఎంతటి వారైనా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

మంచిమాట

పొగడ్తకి పొంగిపోని వాళ్ళు ఉండరు అంటే అతిశయోక్తి కాదు. మనుషులే కాదు దేవతలు కూడా పొగిడితే ఉబ్బి తబ్బిబ్బై పోతారు. పొగడ్త వినగానే డోపమైన్ అనే హార్మోను విడుదల అవుతుంది. అందుకే దైవాన్ని, ఇష్టదైవాన్ని అష్టోత్తరాలు, సహస్రనామాలతో కీర్తిస్తూ ఉంటారు. మానవులు, దేవతలు మాత్రమే కాదు. జంతువులు కూడా పొగిడితే సంతోషిస్తాయి. పెంపుడు జంతువులున్నవారికి ఇది అనుభవమే.



ముఖ స్తుతి

పొగడ్తలు మనిషిని ప్రోత్సహించే వరకు ఉపయోగ పడతాయి. నిజంగా ప్రతిభ ఉన్నవారికి చిన్న మెప్పుదల ఉత్సాహాన్ని ఇస్తుంది. తాము చేస్తున్నది మంచిదే అయినా సాటివారి ఆమోదముద్ర తమ పని మీద నమ్మకాన్ని కలిగిస్తుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. పొగడ్తలో కొంచెం అయినా నిజం ఉంటుంది.

ముఖస్తుతిలో అంటే ఎదురుగా పొగడటంలో నిజం ఉండే అవకాశం తక్కువ. మెరమెచ్చుల కోసం లేనిపోనివి అపాదించి చెప్పటం ముఖస్తుతి. ఆ సంగతి అంటున్నవారికి, వింటున్నవారికి తెలుసు. అయినా ఇష్టం లేనట్టు ముఖం పెట్టి వింటూనే ఉంటారు. లోలోపల సంతోషంగానే ఉంటుంది. ఎటువంటి వారికైనా తమని మెచ్చుకుంటూ ఉంటే బాగానే ఉంటుంది. "మీ లాగా పొగడ్తలు ఇష్టపడని వారు చాల గొప్ప వాళ్ళు. అందుకే మీరంటే నాకు ఎంతో అభిమానం." అంటే బోల్తాపడరా? చిన్నపిల్లల దగ్గర నుండి, దేవతల వరకు.

ముఖస్తుతిని ఆశించి, ఆనందించే వారు సాధారణంగా నష్టపోతూ ఉంటారు. తనకి అపాదించబడిన గుణాలు తనలో ఉన్నాయేమో నని భ్రమ పడుతూ ఉంటారు. ఆ భ్రమ వల్ల దానిని నిజం చేయాలనే తాపత్రయంలో ఎదురుదెబ్బలు తింటూ ఉంటారు. దాని వల్ల కలిగే దుష్ఫలితాలు ఏవిధంగా ఉంటాయో గమనించవచ్చు. ఉదాహరణకి: మన్మథుడు, శల్యుడు.

ఇంద్రుడు మన్మథుణ్ణి పిలిపించి అతడి సామర్థ్యాన్ని పొగుడుతాడు. అతడు ఉబ్బి తబ్బిబ్బు అయిపోయి "నేను ఎంతటి వారినైనా ప్రలోభపెట్ట గలను – శివుడైనా సరే!" అంటాడు. ఇంద్రుడికి కావలసింది అదే! అంతే! ఇరుక్కుపోయాడు. శరీరాన్ని కోల్పోయాడు.

శల్యుణ్ణి దుర్యోధనాదులు పొగిడి కర్ణుడి రథసారథిగా ఒప్పించారు. ససేమిరా, నేను సారథ్యం చేయట మేమిటి? అని భీష్మించుకున్న శల్యుడు తనని కృష్ణుడితో సమానమని పోల్చగానే ఆ పొగడ్తల మాయాజాలంలో పడి రథసారథ్యం చేశాడు.

ములగచెట్టు ఎక్కించటం అని చమత్కారంగా అంటూ ఉంటారు. ఆ కొమ్మ పుటుక్కున విరిగిపోతుంది. ముఖస్తుతి చేసేవారు ఎదుట పొగిడినా, వెనుక విమర్శిస్తూ ఉంటారు. పైగా పొగడ్తలకి పడిపోయారని చులకనగా మాట్లాడుతారు.

ఈ ఆయుధం కొన్ని మారులు ఉపయోగకరంగా కూడా ఉంటుంది. "నా బంగారు కొండ మంచివాడు. చక్కగా అన్నం తిని నిద్రపోతాడు." అంటుంది తల్లి. వాడు అన్నం తినటానికి పేచీ పెడతాడని ఒక పట్టాన నిద్రపోడని ఆ తల్లికి తెలుసు. వినగా, వినగా ఆ లక్షణాలు కొడుకులో పెంపొందుతాయేమోననే ఆశతో ఆ విధంగా పొగుడుతుంది.

ఒక రాజుకి ఒక కన్ను లేదు. తన చిత్రాన్ని అందంగా వేసిన వారికి బహుమతి ప్రకటించాడు. ఒక చిత్రకారుడికి ఆ బహుమతి దక్కింది. రాజు విల్లు ఎక్కుపెట్టి లక్ష్యం వైపు చూడటానికి ఒక కన్ను మూసినట్టు వేశాడు. పొగడటానికి అబద్ధాలు చెప్పనక్కర లేదు.

సాధారణంగా ఏదైనా ప్రయోజనాన్ని ఆశించి లేని సద్గుణాలని అపాదించి ఇంద్రుడు, చంద్రుడు అని కీర్తించేదే ముఖస్తుతి. పిల్లికి బిచ్చం పెట్టని వాణ్ణి దానకర్ణుడని, పొట్ట పొడిస్తే అక్షరం ముక్క లేని వాణ్ణి బృహస్పతి అని పొగడటం ముఖస్తుతి కాక మరేమిటి? ముఖస్తుతికి అలవాటు పడిన వారు విమర్శను అంగీకరించ లేరు. ఆత్మవిమర్శ అసలే ఉండదు. తాము చేసింది సరైనదే అనే మొండిపట్టు ఉంటుంది. పొరపాట్లని సరిదిద్దుకునే లక్షణం ఉండదు కనుక నాశాన్ని కొని తెచ్చుకున్నట్టు అవుతుంది. మహత్కార్యాలు చేయటానికి ఈ పొగడ్త ప్రేరకం అవుతుంది. ఉదాహరణకి హనుమ.

– డా.ఎన్.అనంత లక్ష్మి

బౌద్ధవాణి

సత్యం పలకడం చాలా అవసరం



సిద్ధార్థుడు శాక్య యువరాజు. కానీ, సన్యసించి రాజ్యాన్ని వదిలాడు. భిక్షువుగా మారాడు. ఆ తర్వాత తన బిడ్డ రాహులుణ్ణి కూడా భిక్షువుగా మార్చాడు. ఒకరోజున రాహులుడు అంబలట్ఠిక అనే చోట ఒక వనంలోని ఆరామంలో ఉన్నాడు. బుద్ధుడు రాజగృహంలోని వేణువనం నుండి అక్కడికి వచ్చాడు. బుద్ధుని రాకను గమనించిన రాహులుడు లేచి వచ్చి, నమస్కరించాడు. ఒక చెట్టుకింద బుద్ధునికి తగిన ఆసనాన్ని ఏర్పాటు చేశాడు. కాళ్ళు కడుక్కోవడానికి నీళ్ళు ఇచ్చాడు. బుద్ధుడు కాళ్ళు కడుక్కుని, ఆ పాత్రలో కొంచెం నీటిని ఉంచాడు. బుద్ధుడు ఎంత కష్టమైన విషయాన్నైనా ఉపమానంతో తేలికగా అర్థం అయ్యేలా చెప్పడంలో నేర్పరి. ఆయన వచ్చి ఆసనం మీద కూర్చొని –

"రాహులా! ఈ పాత్రలో మిగిలిన నీటిని చూశావా?" అని అడిగాడు.

"భంతే! చూశాను. అడుగున కొద్దిగా ఉన్నాయి"

"అవును కదా! తెలిసి తెలిసీ ఎవరు అబద్ధాలు ఆడతారో, మోసపు మాటలు చెప్తారో, అలా చెప్పడానికి సిగ్గుపడరో... అలాంటి వారికి దక్కే శ్రామణ్య ఫలం చాలా చాలా కొద్దిదే" అన్నాడు. రాహులుడు నిండు వదనంతో నింపాదిగా ఆ నీటి పాత్రవైపు చూశాడు. బుద్ధుడు ఆ పాత్రలో ఉన్న నీటిని అంతా పారబోశాడు. "రాహులా! నీరు పారబోయడం చూశావా?"

"చూశాను భగవాన్"

"తెలిసి తెలిసీ అసత్యాలు పలికే వారి మోసపు మాటలు చెప్పే వారి శ్రామణ్యం కూడా ఇలా పారబోసిన నీటిలాంటిదే"

బుద్ధుడు ఆ పాత్రను తీసుకుని తన పక్కనే ఉన్న రాతిపలక మీద బోర్లించాడు. రాహులుడు ఆ పాత్రవైపు కన్నార్పకుండా చూస్తూనే ఉన్నాడు. అప్పుడు బుద్ధుడు–"రాహులా! అలాంటి అబద్ధాలకోరు మోసపు మాటల కోరుకు దక్కే ధ్యానఫలం కూడా బోర్లించిన పాత్ర లాంటిదే" అన్నాడు. రాహులుడు తదేకంగా ఆ పాత్ర మీదే దృష్టి నిలిపాడు.

బుద్ధుడు మరలా ఆ పాత్రని తీసి నేల మీద ఉంచాడు. పాత్రలోకి చూపుతూ–"రాహులా! ఇప్పుడు ఈ పాత్ర నిలబడి ఉంది. కానీ ఎలా ఉంది?"

"ఖాళీగా ఉంది భగవాన్"

"అబద్ధాల కోరుకు దక్కే సాధనాఫలం కూడా ఖాళీ పాత్ర లాంటిదే" అన్నాడు.

అలా ఆ ఒక్కపాత్రని నాలుగు రకాలుగా ఉపమానంగా చూపుతూ అబద్ధాల కోరులు ఎంత సాధన చేసినా ధ్యానఫలాన్ని పొందలేరు. కాబట్టి సత్యభాషణం చాలా అవసరం అనే విషయాన్ని తేలిగ్గా అర్థమయ్యేలా చెప్పాడు బుద్ధుడు. అందుకే ఆయనను 'మహా గురువు'గా భావిస్తారు, గౌరవిస్తారు.

శ్రామణ్యం అంటే ధ్యాన సాధన ద్వారా పొందే ఫలం. తమకు తాము స్వీయ సాధన ద్వారా ఈ ధ్యానఫలాన్ని పొందుతారు. అందుకే ఈ సాధకుల్ని 'శ్రమణులు' అంటారు. తమకు తాము ఎంతో శ్రమించి ఎన్నో కఠోర శ్రమలకోర్చి సాధించే యోగ సాధన ఇది. బౌద్ధ భిక్షువుల్ని శ్రమణులు అనీ, బుద్ధుణ్ణి శ్రమణ గౌతముడని ఇందుకే పిలుస్తారు.

– డా. బొర్రా గోవర్ధన్

వాగ్గేయకార వైభవం

ఆ మూడూ చాలు నాకు...



"నాకు అమూల్యమైన అవకాశం దొరికింది. గురువుగారికి స్థాన శుశ్రూష చేస్తున్నాను. (అంటే గురువుగారు ఎక్కడున్నారో అక్కడ ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయడం), ఆత్మ శుశ్రూష చేస్తున్నాను. (అంటే గురువుగారి మాటలు వింటూ వాటిని జ్ఞాపకం పెట్టుకుని మననం చేయడం. గురువుగారు చేసే జ్ఞానబోధ జారిపోకుండా మనసులో నిలబెట్టుకోవడం). వీటన్నింటికన్నా దేహ శుశ్రూష చేస్తున్నా..."

గురువుగారు ఎంతకాలం ఉంటారో అంత కాలమే మాట్లాడగలరు. గురువుగారి శరీరం పతనం అయితే ఆయనకు వచ్చిన నష్టం ఏమీ లేదు. కారణం –"నైనం ఛిందంతి శస్త్రాణి/ నైనం దహతి పావకః /న చైనం క్లేదయంత్యాపో /న శోషయతి మారుతః" అన్నది భగవద్గీత వాక్యం.. శరీరం అసత్యం, ఆత్మ నిత్యం అనీ, అది ఖడ్గం చేత నరకబడదు, అగ్నిచేత కాల్చబడదు, నీటిచేత తడపబడదు, గాలిచేత విసిరి వేయబడదు.. అటువంటి ఆత్మ తానని గురువుగారికి తెలుసు. అందువల్ల శరీరం పతనమయితే ఆయన పొందే బాధేం లేదు. అది సహజం. కానీ గురువు శరీరం వదిలి పెట్టేస్తే నష్టం ఎవరికి అంటే శిష్యులకు. అందుకని శిష్యులు గురువుగారి శరీరాన్ని కాపాడుకుంటుంటారు. పద్మపాదుడు అలానే కదూ శంకరాచార్యుల వారిని కాపాడుకున్నది! "...అలా గురు శుశ్రూష చేస్తున్నా. పరమపావనమైన గంగానదిలో స్నానం చేస్తున్నా. ఆపైన విశ్వనాథ దర్శనం చేస్తున్నా. ఈ మూడూ ప్రతి రోజూ జరుగుతున్నాయి. ఇంతకన్నా ఐశ్వర్యం ఏముంటుంది! అందువల్ల నాకు అమ్మానాన్నలను చూడాలనో, తోబుట్టువులను, నా స్నేహితులను చూడాలనో కోరికలు లేవు. మీదగ్గర ఉండడం చాలు నాకు" అన్నారు ముత్తుస్వామి దీక్షితార్ వారు...

'చాలా కాలమయింది అమ్మానాన్నలను వదిలివచ్చి, ఇల్లు గుర్తుకు రావడం లేదా..." అని అడిగిన గురువుగారితో.

శిష్యుని గురుభక్తికి చిదంబర నాథ యోగి గారు పరమానందం పొందారు. ఆరోజు గంగానదికి స్నానానికి వెళ్లేటప్పుడు శిష్యుడిని పిలిచి.."నాయనా! ఈరోజు ముందు నీవు వెళ్ళు. రోజూ నదిలో స్నానానికి ఎక్కడిదాకా వెడతావో దానికంటే కొంచెం ముందుకు వెళ్ళివచ్చేటప్పుడు మజ్జనం (తలను పూర్తిగా ముంచడం) చెయ్యి. అక్కడ తడిమి చూడు" అన్నారు. దీక్షితార్ వారు అలా చేసి చూస్తే అక్కడ ఆయనకు ఒక వీణ దొరికింది. అన్ని వీణలకు యాళి కిందికుంటే దీనికి పైన ఉంది. అది చూసి గురువుగారు సంతోషించారు. నీ శుశ్రూషకి గంగమ్మ అనుగ్రహించి దీనిని ప్రసాదించిందని చెప్పారు. నువ్వు గొప్ప వాగ్గేయకారుడివై అసమాన కీర్తి ప్రతిష్ఠలు పొందుతావు." అని ఆశీర్వదించి స్నానానికి వెళ్లి నీటిలో మునిగారు. ఇక పైకి లేవలేదు. తరువాత ఆయన భౌతిక కాయం లభించింది. అంత్యేష్టి సంస్కారం చేసి ముత్తుస్వామి దీక్షితార్ వారు తిరిగొచ్చేసారు. వాగ్గేయకారుడిగా కీర్తిప్రతిష్ఠలు గడించారు. గురువుల వైభవాన్ని కీర్తిస్తూ ఆయన చాలా కీర్తనలు చేసారు. వాటిలో ఒకదానిని చిదంబరనాథ యోగి పేర కూడా చేసారు.. అంత గొప్ప గురుభక్తి దీక్షితార్ వారిది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా

చిత్ర పరిశ్రమ పచ్చగా ఉండాలి


– చిరంజీవి



● వరలక్ష్మి, ప్రశాంత్ వర్మ, చిరంజీవి, తేజ సజ్జా, నిరంజన్ రెడ్డి, అమృతా అయ్యర్

"సంక్రాంతి అన్నది సినిమాలకు చాలా మంచి సీజన్. ఎన్ని చిత్రాలు వచ్చినా సరే కథ బాగుండి.. కంటెంట్‌లో సత్తా ఉండి.. దేవుడి ఆశీస్సులు ఉన్నాయంటే ప్రేక్షకులు కచ్చితంగా ఆదరించి, విజయం అందిస్తారు. చిత్ర పరిశ్రమ ఎప్పుడూ పచ్చగా ఉండాలి. ఈ సంక్రాంతికి వస్తున్న 'గుంటూరు కారం, సైంధవ్, నా సామిరంగ' సినిమాలతో పాటు 'హను–మాన్' కూడా బాగా ఆడాలి.. ఆడుతుంది" అని హీరో చిరంజీవి అన్నారు. తేజ సజ్జా, అమృతా అయ్యర్ జంటగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'హను–మాన్'. శ్రీమతి చైతన్య సమర్పణలో కె.నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్యఅతిథిగా హాజరైన **చిరంజీవి మాట్లాడుతూ**–"'హను–మాన్' టీజర్, ట్రైలర్ చూడగానే అద్భుతంగా అనిపించడంతో డైరెక్టర్ ఎవరని అడిగి, ప్రశాంత్ వర్మ గురించి తెలుసుకున్నాను. 'మీ సూపర్ హీరో ఎవరు?' అని ఓ ఇంటర్వ్యూలో సమంత అడిగినప్పుడు.. 'హను–మాన్' అని టక్కున చెప్పేశాను. అదే ఈ సినిమాకి టైటిల్‌గా పెట్టడం చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమా కచ్చితంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రశాంత్ వర్మ ఆలోచన, తేజ కష్టం వృథా కావు. అనుకున్న స్థాయిలో థియేటర్లు దొరక్కపోవచ్చు. కానీ, సినిమాని విడుదల రోజు.. లేకుంటే మరుసటి రోజు.. ఫస్ట్ షో.. లేదంటే సెకండ్ షో చూస్తారు. సినిమా బాగుంటే ఎన్ని రోజులైనా చూస్తారు. 'హను–మాన్'లాంటి మంచి సినిమా తీసిన నిరంజన్ రెడ్డిగారికి థ్యాంక్స్. ఈ సినిమా సూపర్ డూపర్ హిట్ అవుతుంది. ఈ చిత్రం ఆడినన్ని రోజులు ప్రతి టిక్కెట్‌పై వచ్చే డబ్బులో ఐదు రూపాయలు అయోధ్యలోని రామమందిరానికి విరాళంగా ఇస్తామని యూనిట్ చెప్పడం చాలా సంతోషంగా ఉంది. రామమందిరం ప్రారంభోత్సవానికి నాకు ఆహ్వానం అందింది.. కుటుంబ సమేతంగా వెళతాను" అన్నారు. **కె.నిరంజన్ మాట్లాడుతూ**– "నేను ఏదైతే నమ్మానో దాన్ని అలాగే తెరపైకి తీసుకొచ్చిన ప్రశాంత్‌కి థ్యాంక్స్. మా విజన్‌తో నిర్మించిన 'హను–మాన్'ని ప్రేక్షకులు బిగ్‌స్క్రీన్స్‌లో చూసి ఆశీర్వదించాలి" అన్నారు. "నా జీవితంలో నా తల్లిదండ్రుల తర్వాత నేను ఎవరికైనా థ్యాంక్స్ చెప్పుకోవాలంటే అది చిరంజీవిగారికే. ఆయన స్ఫూర్తితో ఇండస్ట్రీకి వచ్చి సినిమాలు చేస్తున్నా. రామ్‌చరణ్‌గారికి రాజమౌళిగారు, రవితేజగారికి పూరి జగన్నాథ్‌గారు, నాకు.. ప్రశాంత్ వర్మగారు అని సగర్వంగా చెబుతున్నా" అన్నారు **తేజ సజ్జా**. "నన్ను నమ్మి 'హను–మాన్' తీయమని సపోర్ట్ చేసిన నిరంజన్ రెడ్డి సర్‌కి థ్యాంక్స్. కలలో కూడా సినిమా గురించే ఆలోచిస్తాడు తేజ.. తనకి సినిమా అంటే అంత ప్రేమ. ఈ సంక్రాంతికి పిల్లలు, పెద్దలందరూ థియేటర్స్‌కి వచ్చి ఎంజాయ్ చేసేలా 'హను–మాన్' ఉంటుంది అన్నారు **ప్రశాంత్ వర్మ**. ఈ వేడుకలో అమృతా అయ్యర్, వరలక్ష్మి శరత్ కుమార్, నటుడు వినయ్ రాయ్, కెమెరామేన్ దాశరథి శివేంద్ర, డైరెక్టర్ కేవీ అనుదీప్, రచయిత–డైరెక్టర్ బీవీఎస్ రవి, సంగీత దర్శకులు అనుదీప్ దేవ్, కృష్ణ సౌరభ్, గౌర హరి తదితరులు పాల్గొన్నారు.

ఆట చూస్తావా!



● మహేశ్‌బాబు

"మీరు మీ పెద్దబ్బాయిని అనాథలా వదిలేసారని అంటున్నారు.. దానికి మీరు ఏం చెబుతారు..' (రమ్యకృష్ణకు ఎదురయ్యే ప్రశ్న)' అనే డైలాగ్‌తో 'గుంటూరు కారం' సినిమా ట్రైలర్ మొదలవుతుంది. 'అతడు, ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్ బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'గుంటూరు కారం'. శ్రీలీల, మీనాక్షీ చౌదరి హీరోయిన్స్‌గా నటించారు. సూర్యదేవర రాధాకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను ఆదివారం విడుదల చేశారు. 'చూడంగానే మజా వచ్చిందా', 'హార్ట్ బీట్ పెరిగిందా', 'ఈల వేయాలనిపించిందా', 'ఆట చూస్తావా..! అంటూ మహేశ్ బాబు చెప్పే డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. రమ్యకృష్ణ, జగపతిబాబు, ప్రకాష్ రాజ్, జయరాం కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు తమన్ సంగీతం అందించారు.

సంక్రాంతికి పండగే పండగ

– వెంకటేశ్




● రుహానీ శర్మ, శ్రద్ధా శ్రీనాథ్, శైలేష్ కొలను, వెంకటేశ్, బేబీ సారా, వెంకట్, నవాజుద్దీన్

"ఓ మంచి సినిమాను ప్రేక్షకులకు ఇవ్వాలనే ఉద్దేశంతో 'సైంధవ్' చేశాం. సంక్రాంతి పండగకు రిలీజ్ చేస్తున్నాం.. పండగే పండగ.. మీకు (అభిమానులు, ప్రేక్షకులు)నచ్చేలా నా ఎమోషనల్, యాక్షన్ సీన్స్ కొత్తగా చేశాను. 'ధర్మచక్రం, గణేష్, ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' ఇలా.. అన్ని సినిమాలను ఆదరించిన మీరు 'సైంధవ్' ని కూడా ఆదరించాలని కోరుకుంటున్నాను" అని వెంకటేశ్ అన్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం 'సైంధవ్'. శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా, ఆర్య, నవాజుద్దీన్ సిద్దిఖీ, బేబీ సారా కీలక పాత్రల్లో నటించారు. వెంకట్ బోయనపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదలవుతోంది. ఈ సందర్భంగా వైజాగ్‌లో జరిగిన 'సైంధవ్' ప్రీ రిలీజ్ వేడుకలో **వెంకటేష్ మాట్లాడుతూ**– "నా తొలి చిత్రం 'కలియుగ పాండవులు', 'సుందరకాండ', 'మల్లీశ్వరీ', 'గురు', 'గోపాల గోపాల', 'సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు'.. ఇలా చాలా చిత్రాల కోసం వైజాగ్ వచ్చాను. ఇప్పుడు 'సైంధవ్' కోసం వచ్చాను. న్యూ ఏజ్ యాక్షన్ అండ్ ఎమోషనల్ థ్రిల్లర్ ఫిల్మ్ 'సైంధవ్'. శైలేష్ కొలను బాగా చూపించాడు. ప్రేక్షకులు కంటతడి పెట్టే సన్నివేశాలు చాలా ఉన్నాయి. ఈ సినిమాకు హీరో సారా పాప. చాలా అద్భుతంగా నటించింది. ఈ సినిమా పండక్కి ప్రేక్షకులను అలరిస్తుంది" అన్నారు. **శైలేష్ కొలను మాట్లాడుతూ**–"వెంకటేశ్‌గారి 75వ సినిమా 'సైంధవ్' బాధ్యతని నాకు ఇచ్చినందుకు థ్యాంక్స్. ఆయన్ను మీరు (ప్రేక్షకులు, అభిమానులు) ఎలా చూడాలనుకుంటున్నారో అలానే చూపించాను. నేను కమల్‌హాసన్‌గారి అభిమానినని చాలాసార్లు చెప్పాను. ఇకపై నేను వెంకటేశ్‌గారి అభిమానిని కూడా. నవాజుద్దీన్‌గారిని తెలుగుకి పరిచయం చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. మన సీనియర్ హీరోలు రియలిస్టిక్ సినిమాలు చేస్తే చూడాలనుకుంటాం.. అలాంటి ఓ సినిమా 'సైంధవ్'" అన్నారు శైలేష్ కొలను. "'బ్రహ్మపుత్రుడు' సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతున్నప్పుడు తొలిసారి వెంకటేశ్‌గారిని చూశాను. 'సైంధవ్' సినిమా నిర్మించే అవకాశం ఇచ్చినందుకు ఆయనకి థ్యాంక్స్" అన్నారు **వెంకట్ బోయనపల్లి**. ఈ వేడుకలో నటుడు నవాజుద్దీన్ సిద్దిఖీ, రుహానీ శర్మ, శ్రద్ధా శ్రీనాథ్, కెమెరామేన్ మణికందన్, బేబీ సారా, పాటల రచయిత రామజోగయ్యశాస్త్రి, ఎడిటర్ గ్యారీ తదితరులు పాల్గొన్నారు.

వాటి గురించి ఆలోచించడం మానేశా

– ఇళయరాజా



"నన్ను అందరూ 'ఇసైజ్ఞాని' అని పిలుస్తుంటారు. నిజం చెప్పాలంటే ఆ పేరుకు నేను అర్హుడినా? అని ఆలోచిస్తే నాకే ప్రశ్నార్థకంగా ఉంటుంది" అని ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా అన్నారు. ఇటీవల చెన్నైలో జరిగిన ఓ పుస్తకావిష్కరణ వేడుకలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ–"నాకు భాష, సాహిత్యంపై అంత పరిజ్ఞానం లేదు. కర్ణాటక సంగీతాన్ని ఔపోసన పట్టలేదు. కానీ, ప్రజలు నన్ను ఇసైజ్ఞాని అని పిలుస్తున్నారు. కానీ, నేను 'ఇసైజ్ఞాని' అనుకోవడం లేదు. నా గర్వాన్ని చిన్న వయసులోనే వదిలేశా. అన్నతో కలిసి నేను కచేరీలకు వెళ్లే సమయంలో హార్మోనియం వాయిస్తుంటే ప్రేక్షకులు చప్పట్లుకొడుతూ అభినందించేవారు. ఆ సమయంలో ఎంతో గర్వంగా ఉండేది. అయితే ఆ అభినందనలు నాకు కాదు.. నేను సృష్టించే బాణీలకు వస్తున్నాయని తెలుసుకున్నా. మనకు ఏ విషయంతో సంబంధం లేదని గ్రహించాను. అందుకే కీర్తి ప్రతిష్ఠల గురించి ఆలోచించడం మానేశాను" అని పేర్కొన్నారు.

ప్రేమలో కొత్త కోణం



● కార్తీక్ రాజు, మోక్ష, షెర్రీ

కార్తీక్ రాజు హీరోగా, మోక్ష, షెర్రీ అగర్వాల్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఐ హేట్ యు'. అంజి రామ్ దర్శకత్వం వహించారు. బి.లోకనాథం సమర్పణలో నాగరాజ్ నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలోనే ఈ సినిమాని రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా నిర్మాత నాగరాజ్ మాట్లాడుతూ–"లవ్, సైకలాజికల్ అంశాలతో రూపొందిన చిత్రం 'ఐ హేట్ యు'. డిఫరెంట్ సబ్జెక్ట్‌తో అంజిరామ్‌గారు ఈ సినిమాను తెరకెక్కించారు. ప్రేమలో కొత్త కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం. త్వరలోనే సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం" అన్నారు. ఈ సినిమాకి సంగీతం: సాకార్.

ఫిబ్రవరిలో ప్రారంభం?



● కమల్ హాసన్

'నాయకన్' (1987) (తెలుగులో నాయకుడు) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో కమల్ హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'థగ్ లైఫ్'. ఈ సినిమాలో త్రిష, దుల్కర్ సల్మాన్, 'జయం' రవి కీలక పాత్రలు పోషించనున్నారు. కాగా ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఫిబ్రవరి చివరిలో లేదా మార్చి మొదట్లో ప్రారంభం కానుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తి కావచ్చాయని, ఇప్పటికే సెట్ వర్క్ జరుగుతోందని టాక్. కమల్ హాసన్, మణిరత్నం, మహేంద్రన్, శివ అనంత్ నిర్మించనున్న ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడు. మరోవైపు కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఇండియన్ 2' విడుదలకు సిద్ధమవుతోంది. అలాగే హెచ్ వినోద్ దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా నటించాల్సిన సినిమా ప్రకటన వచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది. అయితే ఈ సినిమాపై మరో అప్‌డేట్ రావాల్సి ఉంది.

ప్లాంట్-మ్యాన్‌ని ఆదరిస్తున్నందుకు థ్యాంక్స్

– చంద్రశేఖర్



● చంద్రశేఖర్, సోనాలి

"డైరెక్టర్‌గా 'కాలింగ్ బెల్, రాక్షసి' వంటి సినిమాలు తీశాను. నిర్మాతగా నేను చేసిన మొదటి సినిమా 'ప్లాంట్–మ్యాన్'. మా చిత్రాన్ని ఇంత బాగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇలాంటి స్పందన వస్తే ఏడాదికి రెండు చిన్న సినిమాలు చేసి కొత్త వారిని పరిచయం చేయాలని ఉంది" అని నిర్మాత పన్నారాయల్ అన్నారు. చంద్రశేఖర్, సోనాలి జంటగా కె.సంతోష్‌బాబు దర్శకత్వం వహించిన చిత్రం 'ప్లాంట్–మ్యాన్'. డీఎం యూనివర్సల్ స్టూడియోస్‌పై పన్నారాయల్ నిర్మించిన చిత్రం 'ప్లాంట్–మ్యాన్'. ఇటీవల విడుదలైన ఈ సినిమా థ్యాంక్స్ మీట్‌లో కె.సంతోష్‌బాబు మాట్లాడుతూ–"మా 'ప్లాంట్–మ్యాన్' సినిమాకి ఇంత పెద్ద విజయాన్ని అందించిన ప్రేక్షకులకు థ్యాంక్స్. నటీనటులు, సాంకేతిక నిపుణుల సహకారం వల్లే ఇంత మంచి సినిమా చేయగలిగాను" అన్నారు. "మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. నాకు హీరోగా అవకాశం ఇచ్చిన పన్నాగారికి కృతజ్ఞతలు" అన్నారు చంద్రశేఖర్. "ఇలాంటి ఒక మంచి సినిమాలో భాగమైనందుకు సంతోషం" అన్నారు సోనాలి.

ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు నాదల్ దూరం



స్పెయిన్ దిగ్గజ టెన్నిస్ ప్లేయర్ రాఫెల్ నాదల్ ఈనెల 14 నుంచి 28 వరకు జరిగే సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి వైదొలిగాడు. కెరీర్‌లో 22 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన 37 ఏళ్ల నాదల్ గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ తర్వాత తుంటి గాయంతో ఏడాదిపాటు ఆటకు దూరమయ్యాడు. గతవారం బ్రిస్బేన్ ఓపెన్ టోర్నీతో నాదల్ పునరాగమనం చేశాడు. ఈ టోర్నీ లో జోర్డాన్ థాంప్సన్ (ఆస్ట్రేలియా)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయిన నాదల్ ఈ మ్యాచ్ సందర్భంగా ఎడమ కాలి కండరాల గాయానికి గురయ్యాడు.

2017 తర్వాత మళ్లీ టైటిల్...



సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ బల్గేరియా టెన్నిస్ స్టార్ దిమిత్రోవ్ తన కెరీర్‌లో తొమ్మిదో సింగిల్స్ టైటిల్‌ను సాధించాడు. ఆదివారం ముగిసిన బ్రిస్బేన్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో 32 ఏళ్ల దిమిత్రోవ్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో 14వ ర్యాంకర్ దిమిత్రోవ్ 7-6 (7/5), 6-4తో 8వ ర్యాంకర్ హోల్గర్ రూనె (డెన్మార్క్)పై గెలిచి 95,340 డాలర్ల (రూ. 79 లక్షల 30 వేలు) ప్రైజ్‌మనీ సొంతం చేసుకున్నాడు. దిమిత్రోవ్ చివరిసారి 2017 నవంబర్ 17న ఏటీపీ ఫైనల్స్ టోర్నీ టైటిల్ నెగ్గాడు.



రోహిత్, కోహ్లి వచ్చేశారు

- భారత టి20 జట్టులోకి ఎంపిక
- ప్రపంచకప్ ప్రణాళికల్లో సీనియర్లు
- 11 నుంచి అఫ్గానిస్తాన్‌తో సిరీస్

ముంబై: ఈ ఏడాది జరగబోయే టి20 ప్రపంచకప్ టోర్నీలో భారత సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి బరిలోకి దిగే అవకాశాలు మెరుగయ్యాయి. 14 నెలల తర్వాత ఈ దిగ్గజాలిద్దరు మళ్లీ టి20 జట్టులోకి ఎంపికయ్యారు. చివరిసారిగా 2022 నవంబర్‌లో జరిగిన టి20 ప్రపంచకప్‌లో వీరిద్దరు ఆడారు. తదనంతరం పూర్తిగా టెస్టు, వన్డే ప్రపంచ కప్ కోసం వన్డేలకు మాత్రమే పరిమితమయ్యారు. అఫ్గానిస్తాన్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో పాల్గొనే భారత జట్టును ఆదివారం ప్రకటించగా... విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ జట్టులోకి వచ్చారు. తాజా ఎంపికతో వీరిద్దరు ఈ ఏడాది జూన్‌లో వెస్టిండీస్–అమెరికాలలో జరిగే టి20 ప్రపంచకప్ ప్రణాళికల్లో భాగమవుతారని సీనియర్ సెలక్షన్ కమిటీ సూచనప్రాయంగా తెలిపింది. టి20 ఫార్మాట్‌లో ఇటీవల భారత జట్లకు కెప్టెన్లుగా వ్యవహరించిన హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్‌లతోపాటు ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ గాయాల కారణంగా అఫ్గానిస్తాన్‌తో సిరీస్‌కు దూరమయ్యారు. హైదరాబాద్ క్రికెటర్ ఠాకూర్ తిలక్ వర్మ తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. భారత్, అఫ్గానిస్తాన్ జట్ల మధ్య జనవరి 11న తొలి టి20 మొహాలీలో... 14న ఇండోర్‌లో రెండో టి20... 17న బెంగళూరులో మూడో టి20 మ్యాచ్ జరుగుతాయి. ఈ ఏడాది వెస్టిండీస్–అమెరికా సంయుక్తంగా ఆతిథ్యమిచ్చే టి20 ప్రపంచకప్‌కు ముందు భారత్ ఆడే చివరి అంతర్జాతీయ సిరీస్ ఇదే అవుతుంది. అనంతరం భారత ఆటగాళ్లు ఐపీఎల్‌తో మ్యాచ్ ప్రాక్టీస్ పొందుతారు.

భారత టి20 జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), శుబ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, కోహ్లి, తిలక్ వర్మ, రింకూ సింగ్, జితేశ్ శర్మ, సంజూ సామ్సన్, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, కుల్దీప్ యాదవ్, అర్‌్షదీప్ సింగ్, ఆవేశ్ ఖాన్, ముకేశ్ కుమార్.



పుజారా ఖాతాలో 17వ డబుల్ సెంచరీ

- సౌరాష్ట్ర 578/4 డిక్లేర్డ్
- జార్ఖండ్‌తో రంజీ ట్రోఫీ మ్యాచ్

రాజ్‌కోట్: గతేడాది ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ తర్వాత వెటరన్ బ్యాటర్ చతేశ్వర్ పుజారాపై వేటు పడింది. వెస్టిండీస్, దక్షిణాఫ్రికా పర్యటనలకు అతన్ని తప్పించగానే ఈ వెటరన్ పనైపోయిందని అందరూ భావించారు. అయితే రంజీ ట్రోఫీ కొత్త సీజన్‌లో ఈ సౌరాష్ట్ర స్టార్ బ్యాటర్ అజేయ డబుల్ సెంచరీతో తాను ఫామ్‌లోకి వచ్చానని చాటుకున్నాడు. ఓవర్‌నైట్ స్కోరు 406/4 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు ఆట కొనసాగించిన సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 578/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. పుజారా (356 బంతుల్లో 243 నాటౌట్; 30 ఫోర్లు) తన ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో 17వ డబుల్ సెంచరీ సాధించగా, ప్రేరక్ మన్కడ్ (176 బంతుల్లో 104 నాటౌట్; 12 ఫోర్లు) సెంచరీ చేశాడు. రంజీ ట్రోఫీలో పుజారాకిది ఎనిమిదో డబుల్ సెంచరీ. ప్రేరక్, పుజారా అబేధ్యమైన ఐదో వికెట్‌కు 256 పరుగులు జోడించారు. సౌరాష్ట్రకు తొలి ఇన్నింగ్స్‌లో సౌరాష్ట్రకు 436 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆడిన జార్ఖండ్ ఆట నిలిచే సమయానికి 45 ఓవర్లలో 2 వికెట్లకు 140 పరుగులు చేసింది.

4 ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అత్యధిక డబుల్ సెంచరీలు చేసిన క్రికెటర్ల జాబితాలో పుజారా ఉమ్మడిగా నాలుగో స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో డాన్ బ్రాడ్‌మన్ (ఆస్ట్రేలియా: 37), వ్యాలీ హామండ్ (ఇంగ్లండ్: 36), ప్యాట్సీ హెండ్రన్ (ఇంగ్లండ్: 22) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు. హెర్బర్ట్ సట్‌క్లిఫ్ (ఇంగ్లండ్: 17), మార్క్ రాంప్రకాశ్ (ఇంగ్లండ్: 17)లతో కలిసి పుజారా (17) ఉమ్మడిగా నాలుగో స్థానంలో ఉన్నాడు.

2 రంజీ ట్రోఫీ చరిత్రలో అత్యధిక డబుల్ సెంచరీలు చేసిన రెండో ప్లేయర్‌గా పుజారా గుర్తింపు పొందాడు. ఈ జాబితాలో తొమ్మిది డబుల్ సెంచరీలతో పారస్ డోగ్రా (హిమాచల్‌ప్రదేశ్) అగ్రస్థానంలో ఉండగా... అజయ్ శర్మ (ఢిల్లీ–7) మూడో స్థానంలో నిలిచాడు.

రికీ భుయ్ అజేయ శతకం

ఆంధ్ర 339/6



విశాఖ స్పోర్ట్స్: బెంగాల్ జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ డివిజన్ గ్రూప్ 'బి' మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యానికి 71 పరుగుల దూరంలో నిలిచింది. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 133 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 339 పరుగులు సాధించింది. రికీ భుయ్ (243 బంతుల్లో 107 బ్యాటింగ్; 12 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీ సాధించి ఆంధ్ర జట్టును ఆదుకున్నాడు. ఓవర్‌నైట్ స్కోరు 119/3తో మూడో రోజు ఆట కొనసాగించిన ఆంధ్ర మూడు వికెట్లు కోల్పోయి మరో 220 పరుగులు సాధించింది. కెప్టెన్ హనుమ విహారి (51; 7 ఫోర్లు)తో కలిసి రికీ భుయ్ నాలుగో వికెట్‌కు 87 పరుగులు జత చేశాడు. అనంతరం నితీశ్ కుమార్ రెడ్డి (30; 6 ఫోర్లు)తో ఆరో వికెట్‌కు రికీ భుయ్ 71 పరుగులు జోడించాడు. ప్రస్తుతం షోయబ్ మొహమ్మద్ ఖాన్ (31 బ్యాటింగ్; 4 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి రికీ భుయ్ ఏడో వికెట్‌కు అజేయంగా 61 పరుగులు జత చేశాడు. బెంగాల్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 409 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.

పాయింట్ల పట్టిక (PKL)

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	10	9	1	0	46
గుజరాత్ జెయింట్స్	11	7	4	0	39
జైపూర్ పింక్ పాంథర్స్	10	6	2	2	38
దబంగ్ ఢిల్లీ	10	6	3	1	35
యు ముంబా	9	6	3	0	31
హరియాణా స్టీలర్స్	10	6	4	0	31
పట్నా పైరేట్స్	10	5	5	0	28
బెంగళూరు బుల్స్	11	4	7	0	26
బెంగాల్ వారియర్స్	10	3	5	2	23
యూపీ యోధాస్	11	3	7	1	21
తమిళ్ తలైవాస్	10	2	8	0	14
తెలుగు టైటాన్స్	10	1	9	0	9

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

పుణేరి పల్టన్ జోరు

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో పుణేరి పల్టన్ తమ ఆధిపత్యం కొనసాగిస్తోంది. తమిళ్ తలైవాస్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 29–26తో గెలుపొందింది. ఈ లీగ్‌లో పుణేరి పల్టన్‌కిది తొమ్మిదో విజయం కావడం విశేషం. పుణేరి పల్టన్ తరఫున మొహమ్మద్ రెజా 8 పాయింట్లు, గౌరవ్ ఖత్రీ 6 పాయింట్లు, అస్లమ్ ముస్తఫా 5 పాయింట్లు స్కోరు చేశారు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 41–35తో బెంగాల్ వారియర్స్ జట్టును ఓడించింది. హరియాణా తరఫున శ్రీకాంత్ జాదవ్ 10 పాయింట్లు, మణీందర్ సింగ్ 8 పాయింట్లు సాధించారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో బెంగళూరు బుల్స్‌తో పట్నా పైరేట్స్; యు ముంబాతో దబంగ్ ఢిల్లీ తలపడతాయి.

బ్యాటర్ల వైఫల్యంతో...

- రెండో టి20లో భారత మహిళల జట్టు పరాజయం
- ఆరు వికెట్లతో గెలిచిన ఆస్ట్రేలియా
- రేపు నిర్ణాయక మ్యాచ్


హర్మన్‌ప్రీత్


కిమ్ గార్

నవీ ముంబై: వరుసగా రెండో విజయంతో టి20 సిరీస్‌ను సొంతం చేసుకోవాలని ఆశించిన భారత మహిళల క్రికెట్ జట్టుకు నిరాశ ఎదురైంది. బ్యాటర్ల వైఫల్యంతో సాధారణ స్కోరుకే పరిమితమైన హర్మన్‌ప్రీత్ బృందానికి ఓటమి తప్పలేదు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఆస్ట్రేలియా ఈ మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో గెలిచి మూడు మ్యాచ్‌ల టి20ల సిరీస్‌ను 1–1తో సమం చేసింది. సిరీస్ విజేతను తేల్చే నిర్ణాయక మూడో మ్యాచ్ మంగళవారం ఇదే వేదికపై జరుగుతుంది. ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన ఆసీస్ ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హర్మన్ బృందం నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. టాపార్డర్‌లో షఫాలీ వర్మ (1), స్మృతి మంధాన (23; 2 ఫోర్లు, 1 సిక్స్), జెమీమా రోడ్రిగ్స్ (13) సహా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (6) విఫలమయ్యారు. దీంతో 54 పరుగులకే కీలకమైన 4 వికెట్లు కోల్పోయిన టీమిండియా కష్టాల్లో పడింది. ఈ దశలో రిచా ఘోష్ (19 బంతుల్లో 23; 2 ఫోర్లు, 1 సిక్స్); దీప్తి శర్మ (27 బంతుల్లో 30; 5 ఫోర్లు) కాసేపు కుదురుగా ఆడారు. కానీ రిచా అవుటయ్యాక పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. పూజ వస్త్రకర్ (9), అమన్‌జోత్ కౌర్ (4)లు కూడా విఫలమవడంతో డెత్ ఓవర్లలో పరుగుల వేగం పుంజుకోలేదు. ప్రత్యర్థి బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కిమ్ గార్త్ (2/27), అనాబెల్ సదర్లాండ్ (2/18), జార్జియా వేర్‌హమ్ (2/17) రాణించారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఆస్ట్రేలియా 19 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 133 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు అలీసా హీలీ (21 బంతుల్లో 26; 4 ఫోర్లు), బెత్ మూనీ (29 బంతుల్లో 20; 2 ఫోర్లు) తొలి వికెట్‌కు 51 పరుగులు జోడించి విజయానికి అవసరమైన పునాది వేశారు. తర్వాత తాలియా మెక్‌గ్రాత్ (19; 3 ఫోర్లు), ఎలైస్ పెరీ (21 బంతుల్లో 34 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుగైన స్కోరు చేయడంతో ఆస్ట్రేలియా ఒక ఓవర్ మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 2 వికెట్లు తీయగా, శ్రేయాంక పాటిల్, పూజ చెరో వికెట్ పడగొట్టారు.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

మిధాని హైదరాబాద్‌లో 165 ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌లు

హైదరాబాద్ కంచన్‌బాగ్‌లోని మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్.. వివిధ విభాగాల్లో ఏడాది ట్రేడ్ అప్రెంటిస్‌షిప్ శిక్షణకు అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 165
» **ట్రేడులు:** ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, టర్నర్, డీజిల్ మెకానిక్, ఏసీ మెకానిక్, వెల్డర్, సీవోపీఏ.
» **అర్హత:** ఎస్ఎస్‌సీ, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
» **స్టైపెండ్:** నెలకు రూ.7000.
» **ఎంపిక విధానం:** ఎస్ఎస్‌సీ, ఐటీఐలో పొందిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలు ఆధారంగా ఎంపికచేస్తారు.
» **అప్రెంటిస్‌షిప్ మేళా తేది:** 08.01.2024.
» **స్థలం:** ప్రభుత్వ ఐటీఐ కళాశాల, పాతబస్తీ, హైదరాబాద్.
» **వెబ్‌సైట్:** https://midhani-india.in

రాజమహేంద్రవరం జోన్ వైద్యారోగ్య శాఖలో 15 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రాజమహేంద్రవరం జోన్–2 పరిధిలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్(ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)లో సేవలు అందించడానికి ఒప్పంద ప్రాతిపదికన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్/మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 15
» **అర్హత:** ఏపీ నర్సింగ్ కౌన్సిల్ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయంలో బీఎస్సీ నర్సింగ్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. లేదా సర్టిఫికేట్ ప్రోగ్రామ్ ఫర్ కమ్యూనిటీ హెల్త్ (సీపీసీహెచ్) కోర్సుతో బీఎస్సీ పూర్తిచేసి ఉండాలి.
» **వయసు:** జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, ఎక్స్–సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.25,000.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఉత్తీర్ణత సంవత్సరం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్, ఓల్డ్ రిమ్స్, కడప చిరునామకు పంపించాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.01.2024.
» **మెరిట్ జాబితా వెల్లడి తేది:** 27.01.2024.
» **అభ్యంతరాల స్వీకరణకు చివరితేది:**31.01.2024
» **తుది మెరిట్ జాబితా వెల్లడి తేది:** 07.02.2024
» **తుది మెరిట్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు చివరితేది:** 09.02.2024.
» **తుది ఎంపిక జాబితా వెల్లడి తేది:** 12.02.2024
» **కౌన్సిలింగ్ తేది:** 14.02.2024.
» **వెబ్‌సైట్:** hmfw.ap.gov.in

జీజీహెచ్ కర్నూలులో 94 పారా మెడికల్ పోస్టులు

కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఒప్పంద/ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ వైద్య సంస్థల్లో పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **వైద్య సంస్థలు:** కర్నూలు మెడికల్ కాలేజ్ (కర్నూలు), ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (కర్నూలు), రీజనల్ ఐ హాస్పిటల్(కర్నూలు), గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్(కర్నూలు), గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్(నంద్యాల), ప్రభుత్వ వైద్య కళాశాల(ఆదోని), గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్(ఆదోని).
» **పోస్టులు:** జూనియర్ అసిస్టెంట్, పర్సనల్ అసిస్టెంట్, వార్డెన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హౌస్ కీపర్, బార్బర్, హెల్పర్, లస్కర్, పంప్‌మన్, గార్డనర్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా తదితర కోర్సుల్లో ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హత మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపాల్ కార్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాల, కర్నూల్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 09.01.2024.
» **వెబ్‌సైట్:** https://kurnool.ap.gov.in

జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో పార్ట్‌టైమ్ ఎంటెక్, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ(జేఎన్‌టీయూ).. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పార్ట్ టైమ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంబీఏ, ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 390
» **కోర్సు వ్యవధి:** మూడేళ్లు(ఆరు సెమిస్టర్లు).
» **అర్హత:** ఏదైనా డిగ్రీ, బీఈ, బీటెక్, ఎంబీబీఎస్, బీడీఎస్, బీవీఎస్సీ, బీఫార్మసీ, ఎంసీఏ, ఎంఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. హైదరాబాద్ పరిధిలో కనీసం ఏడాది పాటు ఉద్యోగం చేసిన అనుభవం తప్పనిసరిగా ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.01.2024.
» **వెబ్‌సైట్:** jntuh.ac.in.

సెంట్రల్ బ్యాంకులో 484 కొలువులు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగ ప్రకటన విడుదల చేసింది. దీనిద్వారా దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకు శాఖల్లో సఫాయి కర్మాచారి కమ్ సబ్-స్టాఫ్/సబ్-స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. పదోతరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తుకు అర్హులు. జనవరి 9వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టుల వివరాలు

» **సఫాయి కర్మాచారి కమ్ సబ్–స్టాఫ్/సబ్–స్టాఫ్:** 484
» **జోన్లవారీగా ఖాళీలు..** అహ్మదాబాద్–76, భోపాల్–38, ఢిల్లీ–76,కోల్‌కతా–02, లఖ్‌నవూ–78, ఎంఎంజడ్‌వో అండ్ పుణె–118, పట్నా–96.
» **అర్హత:** ఎస్ఎస్‌సీ/పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.03.2023 నాటికి 18–26 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్ల, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.14,500–రూ.28145.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష(70 మార్కులు), లోకల్ లాంగ్వేజ్ టెస్ట్ (30 మార్కులు), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్ పరీక్ష ఆంగ్ల మాధ్యమంలో ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ నాలెడ్జ్, జనరల్ అవేర్‌నెస్, ఎలిమెంటరీ అర్థమేటిక్, సైకోమెట్రిక్ టెస్ట్, సైకోమెట్రిక్ (రీజనింగ్) అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్యసమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 09.01.2024
» **సీబీటీ పరీక్ష తేదీ:** ఫిబ్రవరి 2024
» **వెబ్‌సైట్:** https://centralbankofindia.co.in/en

ఐబీలో.. ఆఫీసర్ కొలువు


జాబ్స్ ఇన్ఫో

బీటెక్ పూర్తి చేసి గేట్‌లో స్కోర్ సాధించిన వారికి కొత్త సంవత్సరంలో చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ)-226 అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్-2 (టెక్నికల్) పోస్టుల భర్తీ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని కీలక శాఖలో కొలువుదీరే అవకాశం సొంతం చేసుకోవచ్చు. ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో.. ఐబీ ఏసీఐఓ గ్రేడ్-2/టెక్నికల్ పోస్టుల నోటిఫికేషన్ సమాచారం, ఎంపిక విధానం తదితర వివరాలు..

» అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్–2 (టెక్) నోటిఫికేషన్
» మొత్తం 226 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ
» బీటెక్, గేట్ స్కోర్ ఆధారంగా దరఖాస్తు అవకాశం
» ఇంటర్వ్యూలో ప్రతిభతో తుది ఎంపిక

రెండు విభాగాలు.. 226 పోస్టులు

ఇంటెలిజెన్స్ బ్యూరోలో తాజా నోటిఫికేషన్ ద్వారా రెండు విభాగాల్లో 226 అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్–2/టెక్నికల్ పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో 79 పోస్టులు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో 147 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ సైన్స్ /కంప్యూటర్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత సాధించి ఉండాలి. (లేదా) ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ లేదా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ లేదా కంప్యూటర్ సైన్స్‌లో ఫిజిక్స్ సబ్జెక్ట్‌తో పీజీ లేదా కంప్యూటర్ అప్లికేషన్స్‌లో పీజీ ఉత్తీర్ణత పొందాలి.
- సంబంధిత బ్రాంచ్/సబ్జెక్ట్‌లో బీటెక్ లేదా ఎమ్మెస్సీతోపాటు గేట్–2021, 2022, 2023లో అర్హత సాధించాలి.
- **వయసు:** జనవరి 12, 2024 నాటికి 18–27 ఏళ్లు (ఎస్సీ/ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు) ఉండాలి.

నెలకు లక్ష వేతనం

నియామకాలు ఖరారు చేసుకున్న అభ్యర్థులకు పే లెవల్–7 (రూ.44,900 – రూ.1,42,400 వేతన శ్రేణి)లో ప్రారంభ వేతనం లభిస్తుంది. మూల వేతనం రూ.44,900గా ఉంటుంది. దీనికి అదనంగా డీఏ, ఎస్ఎస్ఏ, హెచ్ఆర్ఏ, టీఏ, డీఏ వంటి ఇతర భత్యాలు లభిస్తాయి. ఇలా.. మొత్తంగా నెలకు రూ.లక్ష వరకు నికర వేతనం పొందొచ్చు.

గేట్ స్కోర్ ప్రామాణికం

2021, 2022, 2023లో గేట్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్(ఈసీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(సీఎస్) పేపర్లలో ఉత్తీర్ణతను దరఖాస్తుకు అర్హతగా పేర్కొన్నారు. వీరి నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి గేట్ స్కోర్ ఆధారంగా తదుపరి దశకు ఎంపిక చేస్తారు.

ఇంటర్వ్యూతో నియామకాలు

అభ్యర్థులు గేట్–2021, 2022, 2023లలో తమకు వచ్చిన బెస్ట్ స్కోర్‌తో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఈ గేట్ స్కోర్ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు 10 మందిని చొప్పున ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా తుది నియామకాలు ఖరారు చేస్తారు. ఇంటర్వ్యూకు మొత్తం 175 మార్కులు కేటాయించారు.

మెరిట్ జాబితా

ఫైనల్ మెరిట్ జాబితాను రూపొందించేందుకు.. గేట్ స్కోర్‌ను, ఇంటర్వ్యూలో పొందిన మార్కులను క్రోడీకరిస్తారు. ఆ తర్వాత అందుబాటులో ఉన్న పోస్టులు, రిజర్వేషన్, ఇతర నిబంధనలను అనుసరిస్తూ తుది నియామకాలు ఖరారు చేస్తారు.

ఇంటర్వ్యూ ఇలా

మొత్తం 175 మార్కులకు జరిపే పర్సనల్ ఇంటర్వ్యూలో భాగంగా.. సైకోమెట్రిక్ టెస్టులు/ఆప్టిట్యూడ్ టెస్ట్‌లను నిర్వహిస్తారు. ప్రధానంగా జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, ఇంగ్లిష్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అదే విధంగా ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు సంబంధించి అభ్యర్థులకు ఇంటెలిజెన్స్ బ్యూరోపై ఉన్న అవగాహన, ఇంటెలిజెన్స్ బ్యూరో విధులు, దేశంలో శాంతి భద్రతలు తదితర విషయాలపై ఉన్న అవగాహనను పరిశీలిస్తారు.

సబ్జెక్ట్ నైపుణ్యం

ఇంటర్వ్యూలో భాగంగా సబ్జెక్ట్ నైపుణ్యాలను కూడా పరిశీలిస్తారు. అభ్యర్థులు బీటెక్ స్థాయిలో చదివిన సబ్జెక్ట్‌లకు సంబంధించిన ప్రశ్నలను అడుగుతారు. అదే విధంగా.. సాంకేతిక నైపుణ్యాలను.. నిఘా విభాగంలో ఎలా ఉపయోగించొచ్చు? ఇంటెలిజెన్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్‌లలో టెక్నాలజీని అమలు చేస్తున్న తీరు? తదితర అంశాలపై ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. అభ్యర్థులు ఇంటెలిజెన్స్ బ్యూరో విధి విధానాలపై అవగాహన ఏర్పరచుకోవడం ఉపయుక్తంగా ఉంటుంది. అంతేకాకుండా.. అకడమిక్స్ కోణంలో తాము చేసిన ప్రాజెక్ట్ వర్క్స్, వాటి ద్వారా గుర్తించిన సమస్యలు, వాటికి కనుగొన్న పరిష్కారాలు, అవి ఉపయోగపడే తీరు వంటి వాటి గురించి పునరావలోకం చేసుకోవడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

విధులు ఇలా

ఏసీఐఓ గ్రేడ్–2/టెక్నికల్‌గా నియమితులైన వారు.. నిఘా విభాగానికి సంబంధించిన వివిధ కార్యకలాపాలను సాంకేతికీకరణ చేసే విధంగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. నివేదికలు రూపొందించేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్‌ను వినియోగించడం, నిఘా విధులకు కీలకంగా నిలుస్తున్న కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ సాధనాల పనితీరును పర్యవేక్షించడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

పదోన్నతితో డిప్యూటీ డైరెక్టర్

ఏసీఐఓ గ్రేడ్–2 హోదాలో నియమితులైన వారు భవిష్యత్తులో పదోన్నతుల ద్వారా డిప్యూటీ డైరెక్టర్ స్థాయికి కూడా చేరుకునే అవకాశం ఉంది. తొలుత ఏసీఐఓ గ్రేడ్–1గా పదోన్నతి లభిస్తుంది.ఆ తర్వాత ప్రతి హోదాకు ఆరు నుంచి ఎనిమిదేళ్ల కాల వ్యవధి ఆధారంగా.. డిప్యూటీ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్, అసిస్టెంట్ డైరెక్టర్, జాయింట్ డిప్యూటీ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ వంటి హోదాలకు చేరుకోవచ్చు. 27 ఏళ్ల వయసులో కొలువులో చేరిన వారు పదవీ విరమణ సమయానికి అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయికి చేరుకోవచ్చు. అత్యున్నత ప్రతిభతో డిప్యూటీ డైరెక్టర్ స్థాయికి కూడా చేరుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జనవరి 12, 2024.
- **పర్సనల్ ఇంటర్వ్యూ తేదీ:** మార్చి/ఏప్రిల్‌లో నిర్వహించే అవకాశం.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.mha.gov.in, www.ncs.gov.in

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
8-1-2024

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

	సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
	179	52
	72,026	21,711

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	14,524	▲	14
డోజోన్స్	37,466	▲	26
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,700	▽	34
డాక్స్	16,594	▲	23
హాంగ్‌సెంగ్	2,929	▽	25
నికాయ్	33,377	▲	132

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • ఫ్రాన్స్ • హాంకాంగ్ • జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	82.84	86.86
£	బ్రిటన్ పౌండ్	[illegible]	104.42	106.97
€	యూరో	[illegible]	90.02	92.39
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	56.87	58.17
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	54.89	56.83
S$	సింగపూర్ డాలర్	[illegible]	61.69	63.49
SAR	సౌదీ రియాల్	[illegible]	21.22	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.71	23.54
¥	చైనా యువాన్	[illegible]	10.50	12.58

మీ ఇంటికి బీమా ఉందా..?

ప్రమాదాలు, విపత్తులతో భారీ నష్టం ● కొన్ని సందర్భాల్లో ఊహించలేనంత..
వాటిని గట్టెక్కేందుకు బీమా ఉండాలి ● పొదుపుతో కొన్న ఇంటికి పూర్తి రక్షణ
● తక్కువ ప్రీమియంతో మెరుగైన కవరేజీ





దీపావళి రోజున హైదరాబాద్‌కు చెందిన రామన్ కుటుంబం ఓ పెద్ద ప్రమాదం నుంచి బయటపడింది. స్కై షాట్ క్రాకర్ గతితప్పి ఎనిమిదో అంతస్తులోని రామన్ అపార్ట్‌మెంట్‌లోకి దూసుకెళ్లింది. దాంతో మంటలు మొదలయ్యాయి. ఇంట్లోని ఫర్నిచర్, విలువైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, వస్త్రాలు కాలిపోయాయి. ఒకింత అదృష్టం ఏమిటంటే రామన్ కుటుంబ సభ్యులు అందరూ ఫ్లాట్ నుంచి బయటకు వచ్చేశారు. ఎవరికీ గాయాలు కాలేదు. కానీ, ఇంట్లోని విలువైన వస్తువులు కాలిపోవడం వల్ల రూ.20 లక్షల ఆస్తి నష్టం జరిగింది. ఇది ఊహించని నష్టం. ఇలాంటి ప్రమాదం ఏర్పడుతుందని ఎవరూ అనుకోరు. కానీ, ప్రమాదాలు అన్నవి చెప్పి రావు. అందుకే ఇంటికి, ఇంట్లోని విలువైన వాటికి బీమా ఉండాలని నిపుణులు తరచూ చెబుతుంటారు. కానీ, దీన్ని పాటించే వారు చాలా తక్కువ మందే అని చెప్పుకోవాలి. హోమ్ ఇన్సూరెన్స్ ఇంటితోపాటు, ఇంట్లోని విలువైన వస్తువులకు ప్రమాదాలు, విపత్తుల కారణంగా ఏర్పడే నష్టం నుంచి రక్షణనిస్తుంది. చౌక ప్రీమియానికే వస్తుంది. రోజుకు ఒక టీకి పెట్టేంత ఖర్చు కూడా కాదు. హోమ్ ఇన్సూరెన్స్ ఎందుకు తప్పనిసరి అనేది వివరంగా చూద్దాం...

''ప్రజలు తమ జీవిత కాల పొదుపును ఇంటి కొనుగోలు కోసం వెచ్చిస్తున్నారు. మరి అంతటి విలువైన ఆస్తిని కాపాడుకునేందుకు కావాల్సిన చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. ఎంతో విలువైన ఆస్తికి ఎల్లప్పుడూ రిస్క్ పొంచి ఉంటుంది''అని ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ అండర్‌రైటింగ్, ప్రాపర్టీ క్లెయిమ్స్ చీఫ్ గౌరవ్ అరోరా తెలిపారు. నిజానికి ప్రతి 20 ఇళ్లల్లో కేవలం ఒక ఇంటికే ప్రస్తుతం బీమా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. సగటు వ్యక్తికి ఇల్లు అనేది పెద్ద పెట్టుబడి అవుతుంది. అందుకే ఆ విలువైన ఆస్తికి తప్పకుండా రక్షణ తీసుకోవాలి. ''విపత్తులు రావడం అన్నది అరుదే. కానీ, వచ్చినప్పుడు వాటిల్లే నష్టం భారీగా ఉంటుంది''అని డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ డైరెక్ట్ సేల్స్ హెడ్ వివేక్ చతుర్వేది పేర్కొన్నారు.

అనుభవాలను మర్చిపోవద్దు..

జీవిత బీమా తీసుకోవాలని చాలా మంది ఏజెంట్లు అడగడం వినే ఉంటారు. కానీ, అదే స్థాయిలో హోమ్ ఇన్సూరెన్స్ మార్కెటింగ్ కనిపించదు. దీన్ని తీసుకున్నామని, తీసుకోవాలని సూచించే వారు కూడా అరుదు. విపత్తులు, ప్రమాదాలే హోమ్ ఇన్సూరెన్స్ దిశగా అడుగులు వేయించేవిగా భావించాలి. నిజానికి ప్రకృతి విపత్తుల సమయాల్లో హోమ్ ఇన్సూరెన్స్ విక్రయాలు పెరుగుతుంటాయి. 2018లో కేరళను వరదలు తీవ్రంగా నష్టపరిచాయి. ఆ తర్వాతి ఏడాదిలో హోమ్ ఇన్సూరెన్స్ ప్రీమియం ఆదాయం 34 శాతం పెరిగింది. ఇంటి బీమా కోసం ఆసక్తి పెరిగింది. 2020లో యాంఫాన్ తుపాను పశ్చిమబెంగాల్‌ను నష్టపరచగా ఆ తర్వాతి ఆర్థిక సంవత్సరంలో పై ప్రీమియం ఆదాయం 27 శాతం పెరగడం గమనించొచ్చు. కానీ, ఇదంతా తాత్కాలిక ధోరణిగానే ఉంటోంది. విపత్తులు లేదా ప్రమాదాలు తలెత్తినప్పుడు సహజంగా హోమ్ ఇన్సూరెన్స్ విక్రయాలు పెరుగుతుంటాయి. తిరిగి ఏడాది రెండేళ్ల తర్వాత అక్కడి ప్రజలు వాటిని మరిచిపోతుంటారు. దీంతో విక్రయాలు మళ్లీ తగ్గుతుంటాయి.

ఇదే పరిస్థితి ఇప్పుడు హెల్త్ ఇన్సూరెన్స్ విభాగంలోనూ కనిపిస్తోంది. కరోనా మహమ్మారి సమయంలో వైద్య బిల్లులు గణనీయంగా పెరిగాయి. దీంతో ఆరోగ్య బీమా తీసుకునే వారిలో పెద్ద ఎత్తున పెరుగుదల కనిపించింది. ఇప్పుడు కరోనా విపత్తు బలహీనపడింది. దీంతో హెల్త్ ఇన్సూరెన్స్ విక్రయాలు తిరిగి సాధారణ స్థాయికి చేరాయి''అని డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్‌కు చెందిన చతుర్వేది తెలిపారు.

ఫ్లాట్ యజమానులు హౌసింగ్ సొసైటీ తీసుకున్న హోమ్ ఇన్సూరెన్స్‌పై ఆధారపడడం సరికాదని నిపుణుల సూచన. తమ ఫ్లాట్‌తోపాటు, అందులోని విలువైన వస్తువులకు విడిగా కవరేజీ తీసుకోవడం అన్ని విధాలుగా మెరుగైన నిర్ణయం అవుతుంది. ఇంటికి భూకంపాలు, తుపాను, వరదల ముప్పు మాత్రమే కాదు, ఎత్తయిన భవనాలు, ఖరీదైన గాడ్జెట్ల వినియోగం నేపథ్యంలో అగ్ని ప్రమాదాల ముప్పు కూడా ఉంటుందన్న విషయాన్ని గ్రహించాలి. ముంబైలో ఏటా 5,000 వరకు అగ్ని ప్రమాదాలు నమోదవుతున్నట్టు ఒక అంచనా. ఇందులో 70 శాతానికి విద్యుత్తే కారణంగా ఉంటోంది. ఢిల్లీ, బెంగళూరు తదితర పట్టణాల్లో ఏటా 2,500 మేర అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ''ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్ల వినియోగం పెరిగిపోవడంతో, ఎలక్ట్రికల్ వైరింగ్‌పై భారం అధికమై అగ్ని ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయి''అని ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ చతుర్వేది తెలిపారు. అపార్ట్‌మెంట్లలో అగ్ని ప్రమాదానికి సంబంధించి అలారమ్ మోగిన వెంటనే, స్ప్రింక్లర్ సిస్టమ్ నుంచి నీరు ఎంతో ఒత్తిడితో ఎగజిమ్మడం మొదలవుతుంది. ఈ నీటి కారణంగా ఇంట్లోని విలువైన గాడ్జెట్లు, ఇంటీరియర్ దెబ్బతింటాయి. కనుక అగ్ని ప్రమాదం జరగకపోయినప్పటికీ, ఇంటి యజమా ని చాలా నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. అద్దె ఇంట్లో ఉంటే హోమ్ ఇన్సూరెన్స్ అవసరం లేదని చాలా మంది అనుకుంటూ ఉంటారు. కానీ, ఇది ఎంత మాత్రం సరైనది కాదు. హోమ్ ఇన్సూరెన్స్ అన్నది కేవలం ఇంటి నిర్మాణానికి జరిగిన నష్టానికే పరిమితం కాదు. ఇంట్లోని వస్తువులు దెబ్బతింటే ఏర్పడే నష్టం నుంచి గట్టెక్కడానికి బీమా అక్కరకు వస్తుంది. దోపిడీ, దొంగతనాల వల్ల ఏర్పడే నష్టాన్ని సైతం భర్తీ చేసుకోవచ్చు.

కవరేజీ చాలినంత..

హోమ్ ఇన్సూరెన్స్ తీసుకోవడానికి ముందు కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. తమ అవసరాలకు తగిన పాలసీ కీలకం అవుతుంది. భారత్ గృహ రక్ష (బీజీఆర్) అన్నది ఐఆర్‌డీఏఐ ఆదేశాల మేరకు అన్ని సాధారణ బీమా సంస్థలు తీసుకొచ్చిన ప్రామాణిక నివాస బీమా. ప్రకృతి విపత్తులు అయిన వరదలు, భూకంపాలతోపాటు అగ్ని ప్రమాదాలు, చెట్టు విరిగి పడడం, వాహనం ఢ్యాష్ ఇవ్వడం కారణంగా ఇంటికి వాటిల్లే నష్టానికి ఈ పాలసీలో పరిహారం లభిస్తుంది. శిథిలాల తొలగింపునకు, ఇంజనీరింగ్ లేదా ఆర్కిటెక్ట్ ఫీజులకు అయ్యే మొత్తాన్ని కూడా చెల్లిస్తుంది. కానీ, ఇందులో పరిమితులు కూడా ఉన్నాయి. రూ.10 లక్షలు లేదా తీసుకున్న కవరేజీలో 20 శాతం ఏది తక్కువ అయితే అంత మేరే ఈ పాలసీ కింద పరిహారం లభిస్తుంది. ఓ సాధారణ మధ్య తరగతి ఇంటికి రూ.10 లక్షలు బీమా సరిపోదు. ఇంట్లో అధిక విలువ కలిగిన వస్తువులు ఉంటే, వాటి కోసం ప్రత్యేక కవరేజీ తీసుకోవాలని బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ ప్రాపర్టీ అండ్ రైటింగ్ హెడ్ గురుదీప్ సింగ్ బాత్రా సూచించారు. ఇంటి మార్కెట్ విలువ ఆధారంగా బీమా కవరేజీపై నిర్ణయానికి రావద్దు. ఇంటి నిర్మాణం దెబ్బతింటే, పునరుద్ధరించడానికి అయ్యే వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.



చదరపు అడుగుకు ఎంత వ్యయం అవుతుందో ఇంజనీర్లను అడిగితే తెలుస్తుంది. ఇంట్లో విలువైన ఫిట్టింగ్‌లు ఏర్పాటు చేసుకున్న వారు, ఆ విలువను కూడా బీమా కవరేజీకి అదనంగా జోడించుకోవాలి. హోమ్ ఇన్సూరెన్స్ ప్రీమియం ఏటా ఎంతో కొంత పెరుగుతుంటుంది. కనుక ఏడాదికి కాకుండా ఒకేసారి రెండు, మూడేళ్ల కాలానికి పాలసీ తీసుకోవచ్చు. ''ఇంటికి తీసుకునే బీమాని ఏటా రెన్యువల్‌కు ముందు ఆ కవరేజీని సమీక్షించుకోవాలి. ఎందుకంటే ద్రవ్యోల్బణం ప్రభావంతో ఏటా ఇంటి నిర్మాణ వ్యయం పెరిగిపోతుంటుంది. అందుకు అనుగుణంగా ఏటా నిర్ణీత శాతం మేర కవరేజీని పెంచుకోవాలి. ఏటా 10 శాతం మేర కవరేజీ పెరుగుతూ వెళ్లే వాటిని పరిశీలించొచ్చు.

ఇంట్లో ఉన్న ఒక్కో పరికరం, కొనుగోలు చేసిన సంవత్సరం, మోడల్ నంబర్, దాని విలువ ఈ వివరాలన్నీ సిద్ధం చేసుకోవాలి. ఇన్సూరెన్స్ సంస్థలు ఈ వివరాల ఆధారంగానే పరిహారాన్ని నిర్ణయిస్తాయి. అవి ఎన్నేళ్ల పాటు వాడారన్న వివరాల ఆధారంగా ప్రామాణిక తరుగును అమలు చేస్తాయి. ఎలక్ట్రానిక్ పరికరాల విలువ ఏటా తగ్గుతూ ఉంటుంది. రూ.50 వేలు పెట్టి రెండేళ్ల క్రితం కొనుగోలు చేసిన వస్తువు విలువ ఇప్పుడు సగానికి తగ్గిపోతుంది. కనుక పాడైపోయిన దాని స్థానంలో కొత్తది కొనుగోలుకు అయ్యే మొత్తాన్ని బీమా సంస్థ చెల్లిస్తుందని అనుకోవద్దు. ఇంట్లో విలువైన కళాకృతులు ఉంటే, వాటికి సైతం బీమా కవరేజీ కోరుకుంటే.. సర్టిఫైడ్ ఏజెన్సీ నుంచి వ్యాల్యూయేషన్ సర్టిఫికెట్ తీసుకోవాలి. ఒకవేళ కళాఖండాల మొత్తం విలువ రూ.5 లక్షలు, విడిగా ఒక్కోటి విలువ రూ.లక్ష మించకపోతే వ్యాల్యూయేషన్ సర్టిఫికెట్ అవసరం పడదు.

ఎలాంటి కవరేజీ..?



ప్రతి ఇంటికి కనీసం హోమ్ ఇన్సూరెన్స్ బేసిక్ పాలసీ అయినా ఉండాలి. భూకంపాలు, పిడుగులు, తుపానులు, వడగళ్లు, వరదలు తదితర ప్రకృతి విపత్తులు, అగ్ని ప్రమాదం, విధ్వంసం, అల్లర్ల కారణంగా ఇంటి నిర్మాణానికి నష్టం ఏర్పడితే బేసిక్ పాలసీలో పరిహారం లభిస్తుంది. మరమ్మతులు లేదంటే తిరిగి నిర్మాణం వీటిల్లో సరైన దానికి కవరేజీనిస్తుంది. రూ.లక్ష కవరేజీకి ప్రీమియం రూ.30 వరకు ఉంటుంది. ఇక ఇంటి నిర్మాణానికి అదనంగా, ఇంట్లోని వస్తువులకు కూడా రక్షణ తీసుకోవచ్చు. ఈ తరహా కవరేజీకి ప్రతి రూ.లక్షకు గాను ప్రీమియం రూ.60 వరకు ఉంటుంది. దోపిడీ, దొంగతనాల నుంచి సైతం రక్షణ అవసరం. ఇంట్లోని ఫర్నిచర్, కళాఖండాలు, వస్త్రాలు, గృహోపకరణాలు, గాడ్జెట్ల వంటి వాటికి దొంగతనాల నుంచి రక్షణ కోరుకుంటే ప్రతి రూ.లక్షకు రూ.200 వరకు ప్రీమియం చెల్లించాల్సి వస్తుంది. ఇంట్లో గాడ్జెట్లు పనిచేయకుండా పోవడం చూస్తుంటాం. ఇలా ఉన్నట్టుండి ఇంట్లో పరికరం పనిచేయకుండా పోతే, పరస్పర అంగీకారం మేరకు పరిహారం అందించే 'బ్రేక్‌డౌన్' కవర్ కూడా ఉంటుంది. దీనికి ప్రీమియం రూ.లక్షకు రూ.200–300 వరకు ఉంటుంది. రుణంపై ఇంటిని తీసుకున్న వారు ఈఎంఐ ప్రొటెక్షన్ కవర్ తీసుకోవచ్చు. ఇంటి నిర్మాణం దెబ్బతిన్న సందర్భాల్లో పునరుద్ధరణ లేదా పునర్‌నిర్మాణం వరకు రుణ ఈఎంఐని బీమా కంపెనీ చెల్లించాలని కోరుకుంటే ఈఎంఐ ప్రొటెక్షన్ కవర్ తీసుకోవచ్చు. ఆరు నెలల ఈఎంఐ రక్షణకు ప్రీమియం రూ.2,500 వరకు ఉంటుంది. ఇంటి నిర్మాణం దెబ్బతిన్నప్పుడు అందులో ఉండే కిరాయిదారు ఖాళీ చేయాల్సి రావచ్చు. అదే జరిగితే అప్పటి వరకు ప్రతి నెలా క్రమం తప్పకుండా వస్తున్న అద్దె ఆదాయానికి బ్రేక్ పడుతుంది. ఇలా అద్దె ఆదాయాన్ని నష్టపోకుండా, బీమా సంస్థ చెల్లించేలా యాడాన్ కవర్ తీసుకోవచ్చు. దీనికి ప్రతి నెలా రూ.25వేల అద్దె చొప్పున ఆరు నెలల పాటు చెల్లించే కవర్‌కు ప్రీమియం రూ.2,000 ఉంటుంది. వ్యక్తిగత ప్రమాద బీమా ప్రత్యేకంగా ఉంటే, హోమ్ ఇన్సూరెన్స్‌తో తీసుకోవాల్సిన అవసరం లేదు.

భారం తగ్గాలంటే..?



హోమ్ ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించుకునేందుకు కొన్ని మార్గాలు న్నాయి. ఇల్లు, ఇంట్లోని వస్తువులకు నష్టం వాటిల్లినప్పుడు, కొంత మొత్తాన్ని తామే భరించేట్టు అయితే ప్రీమియం తగ్గుతుంది. కొన్ని కంపెనీలే ఈ ఆప్షన్ ఇస్తున్నాయి. ఇంట్లో అన్నింటికీ బీమా అవసరం ఉండదు. బాగా పాత పడిపోయిన వాటికి, పెద్దగా వ్యాల్యూ లేని (తరుగు బాగా పడే) వాటికి బీమా అనవసరం. అగ్ని ప్రమాదం జరిగితే హెచ్చరించి, అప్రమత్తం చేసే అలారమ్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే, అగ్ని ప్రమాదాన్ని అదుపు చేసే పరికరాలు ఏర్పాటు చేసుకుంటే ప్రీమియంలో 15 శాతం వరకు తగ్గింపు లభిస్తుంది. స్వయం ఉపాధిలోని నిపుణులు లేదా వ్యాపారులు అయితే హోమ్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై పన్ను మినహాయింపు పొందొచ్చు. వేతన జీవులకు ఈ వెసులుబాటు లేదు. ఏడాదికి కాకుండా, ఏడాదికి మించి ఎక్కువ కాలానికి పాలసీ తీసుకుంటే ప్రీమియంలో 10 శాతం తగ్గింపు వస్తుంది.

వచ్చే వారం రిలయన్స్ డేటా సెంటర్ ప్రారంభం

బ్రూక్‌ఫీల్డ్, డిజిటల్ రియాలిటీతో కలిసి ఏర్పాటు



చెన్నై: వేగంగా వృద్ధి చెందుతున్న డేటా సెంటర్స్ విభాగంలోకి రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎంట్రీ ఇస్తోంది. వచ్చే వారం చెన్నైలో సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు సంస్థ చైర్మన్ ముకేశ్ అంబానీ వెల్లడించారు. కెనడాకు చెందిన బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్, అమెరికాకు చెందిన డిజిటల్ రియాలిటీ సంస్థలతో కలిసి దీన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. తమిళనాడు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు వివరించారు. చెన్నైలో 20 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న ఈ జాయింట్ వెంచర్ సంస్థ ముంబైలో మరో 40 మెగావాట్ల సెంటర్ కోసం 2.15 ఎకరాలు కొనుగోలు చేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-1-2024	
విశాఖ	625–00
చిత్తూరు	583–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	565–00
విజయవాడ	565–00
రిటైల్ ధర (డజను)	72.00
7-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	560–00
వరంగల్	562–00
రిటైల్ ధర	6.00

స్టాక్స్ వ్యూ

ఎల్‌జీ బాలకృష్ణన్ | సీడీ ఈక్విసెర్చ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,263 టార్గెట్: రూ. 1,484



ఎందుకంటే: రోలర్ చైన్ల తయారీతోపాటు.. వార్మ్ అండ్ కోల్డ్ ఫోర్జింగ్, ఫైన్ బ్లాంకింగ్, మెషీన్డ్ పార్టులతో కూడిన మెటల్ ఫార్మింగ్ చేపట్టే ఆటోమొబైల్ విడిభాగాల దిగ్గజం ఎల్‌జీ బాలకృష్ణన్ బ్రదర్స్ దేశీయంగా ద్విచక్ర వాహన రంగానికి కీలక ప్రొడక్టులు అందిస్తోంది. అయితే పండుగల సందర్భాలను మినహాయిస్తే ఇటీవల కొద్ది రోజులుగా దేశీ ద్విచక్ర వాహన విభాగం మందగమనంలో సాగుతోంది. ఈ ఏడాది పండుగల నేపథ్యంలో ద్విచక్ర వాహన అమ్మకాలు జోరు చూపినప్పటికీ కంపెనీకి ప్రధానమైన ట్రాన్స్‌మిషన్ ప్రొడక్టుల బిజినెస్‌పై మందగమన ప్రభావం పడింది. 2023-24 తొలి అర్ధభాగం(ఏప్రిల్-సెప్టెంబర్) ఆదాయంలో 3.7 శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. అయితే గతేడాది(2022-23) ఇదే కాలంతో పోలిస్తే లాభార్జన ఆశావహంగా 17.1 శాతం పురోగమించింది. దీంతో మార్జిన్లు 200 బేసిస్ పాయింట్లు(2 శాతం)మేర మెరుగుపడ్డాయి. ఇందుకు ముడిసరుకుల ధరలు దిగిరావడంతో తగ్గిన వ్యయాలు సైతం సహకరించాయి. ద్విచక్ర వాహన రంగంలో కొనసాగుతున్న మందగమనం కారణంగా ఈ ఏడాది ఆర్జనలో వృద్ధి 8 శాతానికి పరిమితంకావచ్చని భావిస్తున్నాం.

పీఐ ఇండస్ట్రీస్ | ఎలారా సెక్యూరిటీస్ | కొనొచ్చు


ప్రస్తుత ధర: రూ. 3,451 టార్గెట్: రూ. 4,270



ఎందుకంటే: అగ్రిసైన్స్ దిగ్గజం పీఐ ఇండస్ట్రీస్ రూపొందించే పైరోగ్జాసల్ఫోన్‌ను భారీ స్థాయిలో తయారు చేసేందుకు చైనాలో ప్లాంట్ల ఏర్పాటుకు తెరలేచినట్లు వెలువడిన వార్తలు గతంలో కొంత ఆందోళనలకు లోనుచేశాయి. గోధుమలు, మొక్కజొన్న, సోయాబీన్ పంటల ముందస్తు రక్షణగా వినియోగించే హెర్బిసైడ్ ఇది. అగ్రికెమికల్స్‌కు ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్‌గా నిలిచే యూఎస్‌లో పైరోగ్జాసల్ఫోన్ 2025వరకూ పేటెంట్ రక్షణ పరిధిలోకి చేరే అవకాశముంది. ఇదేవిధంగా లాటిన్ అమెరికాలో 2030వరకూ అండర్ పేటెంట్‌కు వీలుంది. భారత్, ఆస్ట్రేలియావంటి చిన్న మార్కెట్లలో మాత్రమే పేటెంట్ పరిధినుంచి బయటపడింది. దీంతో 2026 డిసెంబర్‌లోగా యూఎస్‌లో పైరోగ్జాసల్ఫోన్ జనరిక్ రిజిస్ట్రేషన్ పొందేందుకు అవకాశాలు తక్కువే. అయితే ప్రస్తుత 60–70 కోట్ల డాలర్ల విలువైన పైరోగ్జాసల్ఫోన్ మార్కెట్ భవిష్యత్‌లో మరింత విస్తరించే వీలున్నట్లు కంపెనీ యాజమాన్యం అంచనాలు వేస్తోంది. ఇందుకు అత్యధిక వినియోగ మార్కెట్లయిన అమెరికా, ఆస్ట్రేలియాలలో ఈ ప్రొడక్ట్ వినియోగం మరింత పెరగడం తోడ్పాటును ఇవ్వనున్నట్లు భావిస్తోంది. పైరోగ్జాసల్ఫోన్ ప్రొడక్టులో ప్రపంచ నిల్వలు లేదా పోటీ పెరగడం వంటి అంశాల ద్వారా కంపెనీపై ఆర్థికంగా ప్రభావం పడే అవకాశాలు తక్కువే. ఫలితంగా ఇటీవల కంపెనీ షేరులో వచ్చిన దిద్దుబాటు తాత్కాలికమే.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

క్యాపిటల్ గెయిన్ బాండ్లలో ఇన్వెస్ట్ చేయొచ్చా?



Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ప్రాపర్టీ విక్రయించినప్పుడు వచ్చిన లాభం నుంచి పన్ను చెల్లించి మిగిలిన మొత్తాన్ని ఈక్విటీ ఆధారిత సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవడం మంచిదా? లేక దీర్ఘ కాల మూలధన లాభాల పన్ను నుంచి మినహాయింపు కోసం ఆర్‌ఈసీ, పీఎఫ్‌సీ, ఐఆర్‌ఎఫ్‌సీ జారీ చేసే సెక్షన్ 54ఈసీ బాండ్లలో ఇన్వెస్ట్ చేసుకోవాలా..?

– అనిల్ మిశ్రా

ప్రాపర్టీని రెండేళ్లకు పైగా కలిగి ఉన్న తర్వాత విక్రయించినప్పుడు వచ్చిన లాభం నుంచి ఇండెక్సేషన్ (ద్రవ్యోల్బణ ప్రభావాన్ని మినహాయించడం) చేసిన తర్వాత మిగిలిన మొత్తంపై 20 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ప్రాపర్టీని విక్రయించిన ఆరు నెలల్లోపు క్యాపిటల్ గెయిన్ బాండ్లలో ఇన్వెస్ట్ చేసినప్పుడు ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 54ఈసీ కింద రూ.50 లక్షల వరకు లాభాన్ని మూలధన లాభాల నుంచి మినహాయింపునకు అవకాశం ఉంటుంది. రూ.50 లక్షలపై 20 శాతం పన్ను అంటే రూ.10 లక్షల మేర ఆదా చేసుకున్నట్టు అవుతుంది. ప్రభుత్వ మద్దతు గల ఆర్‌ఈసీ, పీఎఫ్‌సీ, ఐఆర్‌ఎఫ్‌సీ తదితర ఇన్‌ఫ్రా ఫైనాన్సింగ్ కంపెనీలు జారీ చేసే స్థిరాదాయ సాధనాలనే క్యాపిటల్ గెయిన్ బాండ్లుగా చెబుతారు. క్యాపిటల్ గెయిన్ బాండ్లు ఐదేళ్ల లాకిన్ పీరియడ్‌తో ఉంటాయి. వీటిపై 5.25 శాతం వార్షిక వడ్డీ రేటు వర్తిస్తుంది. ఈ వడ్డీ పన్ను పరిధిలోకి వస్తుంది. వడ్డీ ఆదాయాన్ని ఏటా రిటర్నుల్లో చూపించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. 30 శాతం పన్ను పరిధిలో ఉన్న వారికి నికరంగా లభించే రేటు 3.68 శాతం. ఈక్విటీ ఫండ్స్‌తో పోల్చి చూసినప్పుడు క్యాపిటల్ గెయిన్ బాండ్లపై లభించే 5.25 శాతం రేటు చాలా తక్కువ. ఫ్లెక్సీక్యాప్ ఫండ్ గత ఐదేళ్ల కాల సగటు రాబడి 20 శాతంగా ఉంది. ఇప్పుడు పన్ను ఆదా కోసం క్యాపిటల్ గెయిన్ బాండ్లలో ఐదేళ్ల కాలానికి రూ.50 లక్షలు ఇన్వెస్ట్ చేస్తే, 5.25 శాతం రేటు ప్రకారం గడువు తీరిన తర్వాత రూ.63 లక్షలు సమకూరుతుంది. అదే 20 శాతం క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ (రూ.10లక్షలు) చెల్లించి, మిగిలిన రూ.40 లక్షలను ఫ్లెక్సీక్యాప్ పథకాల్లో క్రమానుగతంగా ఇన్వెస్ట్ చేస్తే ఐదేళ్లలో రూ.70 లక్షలు సమకూరుతుంది. ఈ గణాంకాలను పరిశీలించి చూసినప్పుడు మూలధన లాభాల పన్ను చెల్లించి, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయడమే మేలని అనిపిస్తుంది. కానీ, ఈక్విటీల్లో మెరుగైన రాబడి వస్తుందని చెప్పి మొత్తం తీసుకెళ్లి ఇన్వెస్ట్ చేయడం సంక్లిష్టం కావచ్చు. ఐదేళ్లు, అంతకుమించిన కాలాలకు ఈక్విటీల్లో మెరుగైన రాబడులు వస్తాయి. కానీ ఇదేమీ గ్యారంటీడ్ కాదు. ఆటుపోట్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. కానీ, క్యాపిటల్ గెయిన్ బాండ్లు హామీతో కూడిన రాబడిని ఇస్తాయి. రిస్క్ లేని రాబడి కోరుకునేట్టు అయితే, ఐదేళ్ల తర్వాత కచ్చితంగా పెట్టుబడి మొత్తం కావాల్సిన వారు క్యాపిటల్ గెయిన్ బాండ్లకు వెళ్లొచ్చు. కొంత రిస్క్ తీసుకుని, అవసరమైతే ఐదేళ్లకు అదనంగా మరికొంత కాలం పాటు ఇన్వెస్ట్ చేసేట్టు అయితే దీర్ఘకాల మూలధన లాభాల పన్ను చెల్లించి మిగిలిన మొత్తాన్ని ఈక్విటీ పథకాలకు కేటాయించుకోవచ్చు.



ఎస్‌సీఎస్ఎస్ ఖాతాను ఎనిమిదేళ్ల తర్వాత కూడా పొడిగించుకోవచ్చా..?

– గురునాథ్

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్‌ఎస్) నిబంధనల్లో సవరణ చోటు చేసుకుంది. ఈ పథకం కాల వ్యవధి ఐదేళ్లు. ఆ తర్వాత కోరుకుంటే మరో మూడేళ్ల కాలానికి దీన్ని పొడిగించుకోవచ్చు. ఇలా ఒక్కసారి మాత్రమే పొడిగింపునకు అవకాశం ఉండేది. ఆ తర్వాత కూడా అందులోనే ఇన్వెస్ట్‌మెంట్ కొనసాగించాలంటే, ఉపసంహరించుకుని మళ్లీ తాజాగా ఖాతా తెరవాల్సి వచ్చేది. ఈ నిబంధనను మార్చారు. ఇకపై ఐదేళ్ల ప్రాథమిక కాల వ్యవధి ముగిసిన తర్వాత నుంచి.. మూడేళ్లకు ఒకసారి చొప్పున ఖాతాను పొడిగించుకుంటూ వెళ్లొచ్చు. అంతేకానీ, ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ కొత్త ఖాతా తెరవాల్సిన అవసరం ఉండదు. గడువు పొడిగించే సమయంలో ఉన్న రేటు తదుపరి కాలానికి వర్తిస్తుంది. ఇందులో ప్రస్తుతం 8.2 శాతం వడ్డీ రేటు అమల్లో ఉంది. ఇప్పటికే పెట్టుబడి పెట్టి ఐదేళ్లు పూర్తయి ఉంటే, కొనసాగించుకోవడం వల్ల తదుపరి మూడేళ్ల కాలానికే 8.2 శాతం వడ్డీ రేటు వర్తిస్తుంది. దీనికి బదులు ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకుని, తిరిగి తాజాగా ఇన్వెస్ట్ చేయడం వల్ల ఐదేళ్ల కాలానికి 8.2 శాతం గరిష్ఠ రేటును పొందొచ్చు.

మహిళలంటే సమాజంలో ఇప్పటికీ చిన్నచూపే

- మంత్రి సీతక్క
- ఘనంగా ఫ్లో హైదరాబాద్ బిజినెస్ అవార్డ్స్ ప్రదానం



సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): మహిళలపై సమాజంలో ఇప్పటికీ చిన్నచూపు ఉందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఎఫ్ఐసీసీఐ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ), యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వైఎఫ్ ఎల్ఓ) సంయుక్తంగా వివిధ రంగాలలో నిష్ణాతులైన మహిళలకు 10 విభాగాలలో 20 అవార్డులు అందించింది. ఐదు ప్రత్యేక అవార్డులను కా ర్యక్రమంలో ప్రదానం చేశారు. ఆదివారం సాయంత్రం కోఠి మహిళా విశ్వవిద్యాలయంలోని బ్రిటిష్ రెసిడెన్సీ వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫ్లో ఫాస్ట్ నేషనల్ ప్రెసిడెంట్ పింకీరెడ్డి, నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి మంత్రి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ వివిధ రంగాలలో నిష్ణాతులైన మహిళలకు ఇలాంటి అవార్డులు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, ఫ్లో సంస్థ ఇలాంటి అవార్డులను అందించడం మహిళల్లో ఉన్న ప్రతిభను గుర్తించడమేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఐఏఎస్ అధికారులు అభిలాష బిస్త్, దేవసేన, దినాజ్, షర్మిల హీరేంద్రనాథ్ తదితర ప్రముఖులకు అవార్డులు ఇచ్చారు.

ఐఎల్ టీ20 టోర్నీలో ముంబై ఇండియన్స్ తరఫున ఆడతా..

వృత్తిపరమైన క్రికెట్‌ను ఆడుతున్నప్పుడు రాజకీయాలకు దూరంగా ఉండాలి: అంబటి రాయుడు



సాక్షి, అమరావతి : క్రికెట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించిన భారత జట్టు మాజీ క్రికెటర్ అంబటి రాయుడు మళ్లీ బ్యాట్ పడతానని ప్రకటించారు. ఈ నెల 20 నుంచి దుబాయ్‌లో జరిగే ఇంటర్నేషనల్ లీగ్(ఐఎల్) టీ20 టోర్నీలో ముంబై ఇండియన్స్ తరఫున ఆడతానన్నారు. వృత్తిపరమైన క్రికెట్ క్రీడను ఆడుతున్నప్పుడు రాజకీయాలకు దూరంగా ఉండాల్సిన అవసరం ఉందంటూ 'ఎక్స్'లో ఆదివారం ట్వీట్ చేశారు. ఐఎల్ టీ20 టోర్నీలో ముంబై ఇండియన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న అంబటి రాయుడు టోర్నీలో పాల్గొనేందుకు వైఎస్సార్‌సీపీని వీడినట్లు స్పష్టమవుతోంది.



నూతన సంవత్సరం వచ్చింది.. 'ఇకపై రోజూ వ్యాయామం చేస్తా.. పొద్దున్నే లేచి బుక్స్ పట్టుకుంటా.. సిగరెట్ మానేస్తా.. మందు ముట్టుకోను..' ఎవరికి వారు పెట్టుకునే ఇలాంటి టార్గెట్లెన్నో.. వీటిని కొద్దిరోజులు గట్టిగానే పాటించి.. ఆ తర్వాత వట్టిగానే వదిలేస్తుండటమూ కామనే. మరి ఇలా కొత్త సంవత్సరం కోసం కొత్త కొత్తగా ఎలాంటి లక్ష్యాలు పెట్టుకుంటే బాగుంటుందని 'కృత్రిమ మేధ (ఏఐ)' ప్రోగ్రామ్‌లను అడిగితే ఏమేం సూచించాయో తెలుసా..?

- సాక్షి సెంట్రల్ డెస్క్

నెలకో పార్టీ పెట్టి..

మెదడుకు సానబెట్టి..

కొత్త ఏడాది కోసం 'ఏఐ' చెప్పిన సరికొత్త లక్ష్యాలు

కొత్తగా ఏం చేస్తే బాగుంటుందని?

ఇటీవల ఏఐ ప్రోగ్రామ్‌ల వినియోగం పెరిగిపోయింది. ఫొటోలను, వీడియోలను సృష్టించడం నుంచి కంప్యూటర్ కోడ్‌లను రాసిపెట్టడం, కెరీర్ సలహాల దాకా ఎన్నో పనులకు ఏఐని వాడేస్తున్నారు. ఈ క్రమంలో డెయిలీమెయిల్ వెబ్‌సైట్.. గూగుల్‌కు చెందిన 'బార్డ్', మైక్రోసాఫ్ట్ బింగ్‌కు అనుసంధానం చేసిన 'చాట్‌జీపీటీ', అమెజాన్ సహకారంతో అభివృద్ధి చేసిన 'క్లాడ్'ఏఐ ప్రోగ్రామ్‌లను విభిన్నమైన ప్రశ్న అడిగింది. ఈ 2024 సంవత్సరంలో.. విభిన్నమైన లక్ష్యాలను సూచించాలని, అయితే అవి సులువుగా సాధించగలిగేలా ఉండాలని కోరింది. దీనికి ఏఐ ప్రోగ్రామ్‌లు నిజంగానే వినూత్న ఐడియాలు ఇచ్చాయి.

కృత్రిమ మేధ అంటేనే డిజిటల్ ప్రోగ్రామ్‌లు. అయినా సాంకేతికతకు దూరంగా, ప్రకృతికి దగ్గరగా ఉండాలంటూ సూచనలు చేయడం గమనార్హం.

నెలకో డిన్నర్ థీమ్ పార్టీ



ప్రతినెలా ఓ రోజు విభిన్నమైన థీమ్‌తో డిన్నర్ పార్టీ చేసుకోవాలని గూగుల్ బార్డ్ సూచించింది. ''పురాతన విందుల నుంచి స్పేస్‌లో ప్రయాణం దాకా భిన్నమైన థీమ్‌లు పెట్టుకుని డిన్నర్ పార్టీ చేసుకోండి. ప్రతిసారి సరికొత్త వంటకాలను ప్రయత్నించండి. ఇలాంటి పార్టీల వల్ల స్నేహం, బంధాలు బలపడతాయి. ఒత్తిళ్లు దూరమవుతాయి..''అని పేర్కొంది.

మీ కుటుంబ మూలాల్లోకి వెళ్లండి

''మీ కుటుంబం మూలాల్లోకి వెళ్లండి. దూరపు బంధువులు, పెద్దలను కలసి కుటుంబ చరిత్రను, పూర్వీకుల ఘనతను తెలుసుకోండి. ఫ్యామిలీ ట్రీని రూపొందించుకోండి. మీకు ఎన్నో ఉత్కంఠ భరిత అంశాలు తెలియవచ్చు. అంతా సరికొత్తగా ఉంటుంది..''అని గూగుల్ బార్డ్ సూచించింది.

వారానికోసారి చేతి రాతతో లెటర్ రాయండి

ప్రతి వారం చేతిరాతతో కూడిన లేఖలు రాసే అలవాటు చేసుకోవాలని క్లాడ్ ఏఐ సూచించింది. ''దూరంగా ఉన్న బంధువులు, స్నేహితులకు ఒకప్పటి తరహాలో చేతి రాతతో లెటర్లు రాయండి. మీ అనుభూతులను, ఆలోచనలను అందులో పంచుకోండి. ఈ అనుభవం ఎంతో బాగుంటుంది''అని క్లాడ్ పేర్కొంది.



'డిజిటల్ డిటాక్స్' మొదలుపెట్టండి

కొత్త సంవత్సరం సందర్భంగా డిజిటల్ పరికరాలకు దూరంగా ఉండే (డిజిటల్ డిటాక్స్) తీర్మానం చేసుకోవాలని చాట్‌జీపీటీ పేర్కొంది. ''వారంలో ఒక రోజు లేదా రోజులో కొన్ని గంటల పాటు ఫోన్, టీవీ, కంప్యూటర్ వంటి ఎలాంటి డిజిటల్ పరికరాలు వాడొద్దన్న లక్ష్యాన్ని పెట్టుకోండి. ఆ సమయంలో పుస్తకాలు చదవడం, మెడిటేషన్, ప్రకృతిలో గడపడం వంటివి చేయండి..''అని సూచించింది.

వారానికో రోజు పూర్తి వెజ్..



మీ ఆహార అలవాట్లను నియంత్రించుకుని, వారానికి ఓ రోజు పూర్తిగా శాఖాహారమే తీసుకునేలా లక్ష్యాన్ని పెట్టుకోవాలని 'చాట్‌జీపీటీ'సూచించింది. ''వారానికి ఒక రోజు పూర్తిగా వెజ్. అందులోనూ ఎప్పటికప్పుడు కొత్త వంటకాలు, రుచులను ఆస్వాదించండి. ఇది మీకు ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుతుంది. పర్యావరణానికీ ఎంతో మంచిది..''అని పేర్కొంది.

మీకు నచ్చిన అంశంపై రోజుకో వాక్యం

''మీకు నచ్చిన, బాగా ఆసక్తి ఉన్న అంశంపై డైరీ లాంటి ఓ జర్నల్‌ను మొదలుపెట్టండి. అందులో రోజుకు కనీసం ఒక్క వాక్యాన్ని తప్పనిసరిగా రాస్తూ వెళ్లండి. కొంతకాలానికి ఈ జర్నల్ ఎంతో ఆలోచనాత్మకంగా రూపుదిద్దుకుంటుంది..''అని చాట్‌జీపీటీ సూచించింది.



చిన్ననాటి భయాన్ని దూరం చేసుకోండి

ప్రతి ఒక్కరికీ చిన్ననాటి భయాలు కొన్ని ఉంటాయి. నదులు, సముద్రాల్లోకి దిగడానికి.. రోలర్ కోస్టర్, జెయింట్ వీల్ వంటివి ఎక్కడానికి భయపడుతుంటారు. పబ్లిక్ మీటింగ్‌లలో మాట్లాడటానికి మొహమాటపడతారు.. సాలె పురుగులు, బల్లులను చూస్తే దూరంగా పరుగెడతారు. ఇలాంటి వాటిని వదిలించుకునేలా కొత్త సంవత్సరం ప్రయత్నించాలని క్లాడ్ ఏఐ సూచించింది.

ఖర్చులకు బడ్జెట్.. పొదుపుపై ఫోకస్

ఈ ఏడాది మీ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవడంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని బింగ్-చాట్‌జీపీటీ పేర్కొంది. ''ప్రతి ఖర్చును నమోదు చేస్తూ బడ్జెట్ రూపొందించుకోండి, కచ్చితంగా డబ్బును పొదుపు చేయండి, జాగ్రత్తపడుతూ స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టండి''అని సూచించింది.

మెదడును సానబెట్టండి

కొత్త సంవత్సరంలో మీ మెదడుకు పనిచెప్పి, చురుగ్గా ఉండేలా ప్రయత్నించాలని గూగుల్ బార్డ్ సూచించింది. ఏదైనా ఒక తేదీ చెప్తే.. అది ఏ వారమో చెప్పగలిగేలా ప్రయత్నం చేయాలని.. ఇది చూసి అంతా ఆశ్చర్యపోతారని పేర్కొంది.



అభిమాని ఇంటికి కేటీఆర్

- కుటుంబ సభ్యులతో కలిసి భోజనం...

రహమత్‌నగర్: ఓ అభిమాని ట్విట్టర్ (ఎక్స్)లో పంపిన ఆహ్వానాన్ని స్వీకరించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్. స్వయంగా తానే ఆయన నివాసానికి వెళ్లి అతిథ్యాన్ని స్వీకరించారు. అభిమాని కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. బోరబండ బంజారనగర్‌కు చెందిన ఇబ్రహీంఖాన్ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈనెల 2న కేటీఆర్‌కు ఒక ట్వీట్ చేశారు. తన ఇంటికి వచ్చి అతిథ్యాన్ని స్వీకరించాలని కోరారు. స్పందించిన కేటీఆర్ తప్పక వస్తానని సమాధానమిచ్చారు. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి ఇబ్రహీంఖాన్ నివాసానికి చేరుకున్నారు. ఇబ్రహీం కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఇబ్రహీం పిల్లలకు చెవుడు సమస్య ఉండటంతో, అవసరమైన వైద్య చికిత్సకు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు.

ఏపీలో 19, తెలంగాణలో 117 బోగస్ సంస్థలు

సాక్షి, న్యూఢిల్లీ: వస్తుసేవల పంపిణీ లేకుండా బోగస్ ఇన్‌వాయిస్‌లు సృష్టించి పన్ను ఎగవేతలకు పాల్పడిన నకిలీ సంస్థలు ఏపీలో 19, తెలంగాణలో 117 ఉన్నట్లు గుర్తించినట్లు కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా 29,273 సంస్థలు రూ.44,015 ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ఎగవేతలకు పాల్పడినట్లు తెలిపింది. మే 2023 నుంచి నకిలీ సంస్థల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో 19 నకిలీ సంస్థలు సుమారు రూ.765 కోట్ల పన్ను ఎగవేతకు పాల్పడగా.. రూ.11 కోట్లు రికవరీ చేశామని, ఎవరినీ అరెస్టు చేయలేదని తెలిపింది. తెలంగాణలో 117 నకిలీ సంస్థలు రూ.1,645 కోట్ల పన్ను ఎగవేతకు పాల్పడగా.. రూ.44 కోట్లు బ్లాక్/రికవరీ చేశామని, ఒకరిని అరెస్టు చేశామని వివరించింది.

పుస్తకం చేతిలో ఉంటే మంచి స్నేహితుడు వెంట ఉన్నట్లే

- ప్రముఖ సినీనటుడు, రచయిత తనికెళ్ల భరణి
- విజయవాడలో ముగిసిన 34వ పుస్తక మహోత్సవం



మాట్లాడుతున్న తనికెళ్ల భరణి

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): పుస్తకం చేతిలో ఉంటే మంచి స్నేహితుడు వెంట ఉన్నట్లేనని సినీనటుడు, రచయిత తనికెళ్ల భరణి అన్నారు. ఆదివారం జరిగిన ముగింపు సభకు ఆయన హాజరయ్యారు. విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్వహించిన 34వ పుస్తక మహోత్సవం ఆదివారం ముగిసింది. డిసెంబర్ 28న మొదలైన ఈ పుస్తక మహోత్సవం 11 రోజుల పాటు జరిగింది. పుస్తక మహోత్సవం ఆవరణలోని కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై ప్రతిరోజూ పలు పుస్తకాలను ఆవిష్కరించారు. పుస్తకమహోత్సవం ఆవరణలోని శ్రీరమణ ప్రతిభా వేదికపై విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించారు. ముగింపు సభలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ ఏఎండీ ఇంతియాజ్, ఎమెస్కో సంస్థ అధినేత విజయకుమార్, విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్షుడు మనోహర్ నాయుడు, గౌరవాధ్యక్షుడు బెల్లపు బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. సభ అనంతరం పోటీల్లో విజేతలైన వారికి అతిధులు బహుమతులను అందచేశారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.